క్రాంతి

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎస్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 31    సంచిక : 3    మే - జూన్ 2007    వెల : ఐదురూపాయలు

### లోపలి పేజీల్లో

610 జీవో.....6
మేడే వర్థిల్లాలి.....9
బొక్షైట్ వ్యాసం.....11
నిర్బంధ రిపోర్ట్.....16
డార్‌ఫర్‌లో.....18
పోరాట వార్తలు.....21
సరైన భావాలు.....మధ్య పేజీలో
జూలై 28 పిలుపు.....24
అమరవీరుల చరిత్రలు.....28

# ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ స్ఫూర్తిని ఎత్తిపడుదాం!

చరిత్రగతిలో ఎన్నో రోజులూ, సంవత్సరాలూ దొర్లిపోతుంటాయి. అయితే కొన్ని రోజులూ, సంవత్సరాలు చరిత్రగతిని మలుపు తిప్పిన రోజులుగా, సంవత్సరాలుగా నిలిచిపోతాయి. అవి చరిత్రలో ఒదిగిపోవు. చరిత్రే ఆ రోజుల్లో, సంవత్సరాల్లో ఒదిగి నూతన చరిత్రగా ఆవిర్భవిస్తుంది. అలా భారతదేశ చరిత్రను ఒక మలుపు తిప్పి, ఉజ్వలమాన చరిత్రగా నిలిచిపోయిన సంవత్సరం 1857.

సిపాయిల తిరుగుబాటుగా, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా పేరుగాంచిన, ప్రజాస్వామిక విప్లవ ప్రారంభంగా చెప్పుకుంటున్న 1857 తిరుగుబాటుకు 150 యేళ్లు నిండాయి. అయినా నేటికీ భారత ప్రజలకు ఆ పోరు చిరస్మరణీయం. నేడు దేశంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికీ స్ఫూర్తిదాయకం.



1857 తిరుగుబాటు నేపథ్యాన్ని కొంచెం తడిమితే.... అప్పటికి శతాబ్దానికి పైగా భారతదేశం బ్రిటీష్ (ఈస్ట్ ఇండియా కంపెనీ) పాలనలో అతలాకుతలమవుతోంది. దేశాన్ని దోచుకోవడమే ఏకైక లక్ష్యంగా కల్గిన బ్రిటీష్ పాలనలో దేశంలోని అన్ని రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఇక్కడి ఉత్పత్తి విధానం ఛిన్నాభిన్నమయింది. బ్రిటీష్ వాళ్లు రాకముందు భూమి గ్రామ ఉమ్మడి సొత్తుగా వుండేది. బ్రిటీష్ పాలన భూసంబంధాలలో పెను మార్పులను తెచ్చింది. భూమిపై ప్రైవేటు యాజమాన్యాన్ని కల్పించడంలో భాగంగా శాశ్వత రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని మూలంగా సాగు భూమి, క్రమంగా పన్నులు వసూలు చేసే జమీందార్ల్లా, వడ్డీ వ్యాపారస్తుల చేతిలోకి పోయింది. పాత జమీందార్ల స్థానంలో కొత్త జమీందార్లను సృష్టించింది. శిస్తు విధానంలో కూడా మార్పులను తెచ్చింది. అప్పటిదాకా పండిన పంటలో కొంత భాగాన్ని శిస్తుగా చెల్లించడం ఉండేది. దానికి బదులు నగదు రూపంలో శిస్తు చెల్లించాలనే విధానం తేవడంతో, పంట పండకపోయినా శిస్తు చెల్లించాల్సి వచ్చేది. శిస్తు కట్టని వారికి కఠినమైన శిక్షలు ఉండేవి. ఇలా శిస్తు చెల్లించలేక అనేకమంది రైతులు వ్యవసాయం మానివేసారు. వ్యవసాయం మానివేసినప్పటికీ శిస్తు కట్టవల్సిన పరిస్థితి వుండేది. ఇలా రైతులు వ్యవసాయాన్ని మానివేయడంతో, వ్యవసాయంలో సంక్షోభం

వచ్చింది. దీనికి తోడు మునుపటి నీటి పారుదల వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్ల కూడా వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభం తీవ్రమైంది.

భారతదేశాన్ని కేవలం తనకు ముడిసరుకును సరఫరా చేసే వనరుగా, తన సరుకులను అమ్ముకునే మార్కెట్‌గా ఈస్ట్ ఇండియా కంపెనీ భావించింది. కనుక దాని సరుకులతో ఇక్కడి మార్కెట్లను నింపి, ఇక్కడి చేతి వృత్తులనూ, కుటీర పరిశ్రమలనూ దెబ్బతీసింది. విచ్చల విడిగా వస్త్రాలు దిగుమతి కావడం వల్ల ఇక్కడి చేనేత పరిశ్రమ కుప్పకూలి పోయింది. వీటిపై ఆధారపడినవారు గత్యంతరం లేక వ్యవసాయ రంగంలోకి ప్రవేశించడంతో కమతాలు చిన్నవైపోయి వ్యవసాయంలో మరింత సంక్షోభం చోటు చేసుకుంది. దానితో దేశం కరువు కాటకాలకు నిలయంగా మారింది. ఒక్క చేనేత పరిశ్రమను దెబ్బతీయడం మూలంగానే మిలియన్ల ప్రజలు కరువుబారిన పడ్డారంటే మొత్తం చేతి వృత్తుల విధ్వంసం మరెంత కరువుకు దారితీసి వుంటుందో ఊహించుకోవచ్చు. ఫలితంగా రైతాంగ, చేతి వృత్తుల వర్గాల్లో అసంతృప్తి రాజుకుంది.

ఈనాం చట్టం తేవడం ద్వారా కంపెనీ ప్రభుత్వం అనేక ఈనాం భూములనూ, సంస్థానాలను, వంశపారంపర్య హక్కు రద్దు చట్టం తేవడం ద్వారా అనేక రాజ్యాలను తనలో కలిపేసుకుంది. శిస్తులు చెల్లించని సంస్థానాలను కూడా అనేకం కలిపేసుకుంది. లార్డ్ డల్‌హౌసీ తన పరిపాలనా కాలం (1848-56)లో ఎనిమిది రాజ్యాలను తమ పాలనలోకి కలుపుకున్నాడు. ఇదంతా పాత జమీందార్లూ, సంస్థానాధీశులూ, రాజుల్లో తీవ్ర అసంతృప్తిని తీసుకువచ్చింది.

దీనికి తోడు బ్రిటీష్ వాళ్లు తీసుకొచ్చిన సంఘ సంస్కరణలు ఇక్కడి ప్రజల మత విశ్వాసాలను దెబ్బతీయడంతో మతపర వర్గాల్లోనూ అసంతృప్తులు బయలుదేరాయి.

ఈ అసంతృప్తులు 1857కు పూర్వమే అనేక తిరుగుబాట్లుగా వ్యక్తీకరించబడ్డాయి. బ్రిటీష్ వాళ్లు అడుగుపెట్టిన నాటి నుండీ 1857 వరకూ సైనిక, పౌర, రైతాంగ, ఆదివాసీ తిరుగుబాట్లు కొన్ని వందల సంఖ్యలో జరిగాయి. బెంగాల్ సిపాయిల తిరుగుబాటు (1764), నెల్లూరు సిపాయిల తిరుగుబాటు (1806), బ్యారక్‌పూర్ సిపాయిల తిరుగుబాటు (1834), కచ్ తిరుగుబాటు (1816-32), ఆదివాసీల కోల్ తిరుగుబాటు (1831), సంతాల్‌ల తిరుగుబాటు (1855) మొదలైనవి ఈ తిరుగుబాట్లలో ముఖ్యమైనవి. భారత సమాజం ఎన్నడూ స్థబ్దంగా లేదు. అది పోరాటాలను వెదజల్లుతూనే వుంది.

అందుకే బ్రిటీష్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సైన్యాన్ని తయారుచేసుకుంది. 1857 నాటికి 20 కోట్ల జనాభాకు రెండు లక్షల దేశీయ సైన్యం ఉండింది. ఈ సైన్యానికి అధికారులు బ్రిటీష్ వారే. అంతేకాదు ఈ సైన్యాన్ని నిరంతరం కనిపెట్టుకొని ఉండడానికి నలభై వేల ఆంగ్ల సైన్యం కూడా వుంది. ఈ సైన్యం అండతో బ్రిటీష్ ప్రభుత్వం నిశ్చింతగా వుంటూ తన దోపిడీని యథేచ్ఛగా కొనసాగించవచ్చని భావించింది. కానీ అన్ని వర్గాల్లో నెలకొంటున్న అసంతృప్తి జ్వాలల ప్రతిఫలనాలు దేశీయ సైన్యం మీద కూడా పడ్డాయి. ఎందుకంటే సైనికులు యూనిఫారాల్లో వుండే రైతులే. అంతేకాదు ఆనాడు బ్రిటీష్ సైనికులకూ, భారత సైనికులకు మధ్య తీవ్రమైన వివక్ష వుండేది. భారత సైనికులకు ఏమాత్రం గుర్తింపూ, గౌరవం ఉండేదికాదు. బ్రిటీష్ అధికారులు భారత సైనికులను చాలా హీనంగా చూసేవారు. వారికి పదోన్నతులు కల్పించేవారు కాదు. 1856లో ఒక సిపాయిల చట్టం వచ్చింది. దాని ప్రకారం సైనికులు, అవసరం అయినపుడు తప్పనిసరిగా సముద్రాలు దాటి వెళ్లాలి (హిందువులు సముద్ర ప్రయాణాన్ని దోషంగా భావిస్తారు). అంతేకాదు ఆదివారాలు బ్రిటీష్ అధికారులు చెప్పే క్రైస్తవ బోధనలు వినాలని వత్తిడి చేసేవారు. వీటన్నింటికి తోడు ఆనాడు తుపాకి తూటాలకు పంది, ఆవు కొవ్వులను పూసేవారు. ఆ తూటాలపై చుట్టిన పేపర్‌ను నోటితో కొరికి చింపవల్సి వచ్చేది. ఇది హిందూ, ముస్లిం సైనికుల మత భావనలను గాయపరిచేది. అయినప్పటికీ బ్రిటీష్ అధికారులు దీన్ని బలవంతంగా అమలుచేయించేవారు. ఫలితంగా సైనికుల్లో బ్రిటీష్ పాలనపట్ల వ్యతిరేకత తీవ్రమైంది. కనుక ఏ సైన్యాన్ని బ్రిటీష్ ప్రభుత్వం తనకు దన్నుగా భావించిందో అదే సైన్యం 1857 తిరుగుబాటుకు నాంది పలికింది. అందుకే కారల్ మార్క్స్ "భారత ప్రజలకు ఎన్నడూ లేనట్టి దేశవ్యాప్తమైన ప్రథమ సాధారణ ప్రతిఘటన కేంద్రాన్ని సృష్టించారు" అన్నాడు.

1857 జనవరి 22న కలకత్తా సమీపంలోని కంటోన్మెంట్‌లో మొదట తిరుగుబాటు జరిగింది. ఫిబ్రవరి 25న బరంపురంలోని 19వ రెజిమెంట్ తిరుగుబాటు చేసింది. మార్చి ఆఖరులో బ్యారక్‌పూర్‌లో మంగల్‌పాండే అనే యువ సైనికుడు తిరుగుబాటు చేసాడు. కొవ్వు పూసిన తూటాలను వాడాలని బలవంతం చేసిన బ్రిటీష్ సార్జెంట్ మీదపడి పిడిగుద్దులు గుద్దాడు. కత్తితో గాయపర్చాడు. బ్రిటీష్ ప్రభుత్వం వెంటనే అతన్ని అరెస్టు చేసి ఉరిశిక్ష విధించింది. ఏప్రిల్ 18వ తేదీన ఉరి తీయాలని మొదట నిర్ణయించినప్పటికీ 10 రోజుల ముందే అతన్ని ఉరి తీసారు. దీనికి కారణం - మంగల్‌పాండే చేసిన తిరుగుబాటు అగ్గిలా రాజుకోసాగింది. ఆ వెనువెంటనే అలహాబాద్, ఆగ్రా, అంబాలా,

మీరట్ కంటోన్మెంట్‌లలో తిరుగుబాట్లు జరిగాయి. మద్రాస్, ముంబయ్‌లలోనూ అసంతృప్తులు చెలరేగాయి. దీంతో ఈ తిరుగుబాటుదారులకు గుణపాఠం నేర్పాలనే ఉద్దేశంతో మంగల్‌పాండేను త్వరగా ఉరి తీసారు. ఇక అగ్గి చల్లారుతుందనుకున్నారు. కానీ అది దావానలం అయింది.

మే 9వ తేదీన మీరట్‌లో 3వ అశ్విక దళం పూర్తి స్థాయి తిరుగుబాటును చేసింది. ఈ అశ్విక దళం జెయిల్ వరకూ మార్చ్ చేస్తూ ఖైదీలందరినీ విడిపించింది. అదే రోజు సాయంత్రం 11వ, 20వ రెజిమెంట్లు కూడా కల్సి పెరేడ్ గ్రౌండ్‌లో సమావేశమయ్యాయి. అంతిమంగా సైనిక అధికార్లను చంపి కంటోన్మెంటుకు నిప్పుపెట్టాయి. ఆ తర్వాత ఈ సైన్యమంతా ఢిల్లీ వైపుకు దూసుకుపోయింది. దారి పొడుగునా అనేక కంటోన్మెంట్లు వీరితో కల్సాయి. అలాగే అనేక మంది బ్రిటీష్ అధికారులపై దాడులు చేస్తూ, వాళ్లను చంపుతూ, వారి బంగ్లాలను తగులబెడుతూ, రికార్డులను తగులబెడ్తూ, జైళ్లను బద్దలు కొడ్తూ ముందుకు సాగి వీరు మే 11వ తేదీన ఎర్రకోటను హస్తగతం చేసుకున్నారు. ఢిల్లీలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను కూలదోసి రెండవ బహదూర్ షా జాఫర్‌ను చక్రవర్తిగా ప్రకటించారు.



మంగళ్‌పాండే

ఈ ఉత్తేజం దేశవ్యాప్తంగా పాకింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య భారత దేశాల్లో తిరుగుబాట్లు ఉవ్వెత్తున జరిగాయి. బుందేల్ ఖండ్, ఝాన్సీ ప్రాంతాలు ఈ తిరుగుబాట్లకు నాయకత్వ పాత్రను వహించాయి. ఝాన్సీలో అన్ని జైళ్ల నుంచి ఖైదీలను తిరుగుబాటుదార్లు విడిపించారు. అవధ్‌లో తిరుగుబాటుదార్లు ఆయుధాలు, డబ్బు, గుర్రాలు అన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. బంగ్లాలను తగులబెట్టారు. అనేకమంది పౌరులు ఆ ఆయుధాలను అందుకొని పోరులో కదిలారు. బెంగాల్, చిట్టగాంగ్, నాగ్‌పూర్, ఔరంగాబాద్, కోలాపూర్ కంటోన్మెంట్లలోనూ తిరుగుబాట్లు జరిగాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లోనూ తిరుగుబాటు జరిగింది కానీ అణచివేయబడింది.

ఈ తిరుగుబాట్ల ప్రభావంతో తెలంగాణా, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లోనూ పలుచోట్ల తిరుగుబాట్లు జరిగాయి. కొన్నిచోట్ల ప్రయత్నాలు విఫలమయ్యాయి. జూలై 17న హైదరాబాద్ సంస్థానంలో 500 మంది యువకులు సాయుధులై నగరం నడిబొడ్డున బ్రిటీష్ రెసిడెంట్ కార్యాలయంగా ఉన్న సుల్తానాబజార్‌లోని కోఠీపై సాహసోపేతంగా దాడిచేశారు. అయితే ఈ దాడి విఫలమయింది. బోయినపల్లిలో బ్రిటీష్ సైనికాధికారిని చంపే ప్రయత్నం జరిగింది. రాయలసీమలోని కడపజిల్లాలో షేక్ పీర్ సాహెబ్ అనే యోధుడు కడప కంటోన్మెంట్‌లోని భారత సైనికులను తిరగబడమని ప్రోత్సహించాడు. నవంబర్ 7న క్రిష్ణా జిల్లా జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌పై 400 మంది ఆయుధాలతో దాడి చేశారు. ఆయుధాలనూ, నగదునూ సొంతం చేసుకున్నారు.

సైనికులే ప్రారంభించినప్పటికీ ఈ పోరుకు రైతాంగం, చేతి వృత్తుల వారు, విశాల పీడిత ప్రజానీకం చోదక శక్తులుగా ఉన్నారు. అందుకే ఇది రైతాంగ పోరాటంగా పరిణమించిందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అంతేకాదు ఈ పోరాటం వలసవాద వ్యతిరేక పోరాటంగా ప్రారంభమైనప్పటికీ, భూస్వామ్య వ్యతిరేక పోరాటంగానూ ముందుకు సాగింది. పీడిత ప్రజలేగాక ఠాకూర్లూ, రాజపుత్రులూ, సంస్థానాధీశులూ, ఫ్యూడల్ రాజులు కూడా ఈ పోరులో చురుకైన పాత్ర వహించారు. నాయకత్వ పాత్రను సహితం అందించారు. అయితే వీరిలో అధికులు సైనికుల వత్తిడిమేరకు పోరులోకి వచ్చారు. బహుదూర్‌షా, ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియాతోపే, నానాసాహెబ్ వంటి వారు సైనికుల వత్తిడిమేరకు ఈ పోరాటంలో పాల్గొన్నప్పటికీ వీరోచితమైన పాత్రను వహించారు. బ్రిటీష్ పాలనవల్ల వీరి ప్రయోజనాలు దెబ్బతినడం వల్లే ఇటువంటి వర్గాలు సహితం పోరులో పాల్గొన్నాయి. ముఖ్యంగా 1840-50లో ఉత్తర, మధ్య భారతాలను బ్రిటీష్ వాళ్లు తమ ప్రత్యక్ష పాలన కిందికి తెచ్చుకున్నారు. దానితో తమ అధికారాన్ని కోల్పోయిన ఎందరో పాలకులు ఈ పోరులో చురుకైన పాత్ర వహించారు.

ఈ పోరులో ముస్లింలు చాలా ప్రముఖమైన పాత్రను వహించారు. బహుదూర్‌షా, మహమ్మద్ భక్త్‌ఖాన్, అహ్మద్ అలీఖాన్, తఫ్‌జుల్ హుస్సేన్ సరత్ జంగ్, లియాఖత్ అలీఖాన్, షహీద్ పీర్ అలీ, హిక్మతుల్లా మౌల్వీ, అహ్మదుల్లా షా వంటి వారు ఈ పోరుకు వీరోచితంగా నాయకత్వం అందించారు. అయితే నేడు మన దేశంలో ముస్లిం మతస్తులు గురవుతున్న వివక్ష రీత్యా వారి పాత్ర మరుగునపడింది. ఆనాటికి మతం అనేది వ్యక్తిగత విశ్వాసంగానే ఉన్నది. రాజకీయాల్లోకి మతం ప్రవేశించలేదు. కనుక హిందూ, ముస్లింలు ఐక్యంగా పోరాడారు.

అంతేకాదు, ఢిల్లీని స్వాధీనం చేసుకున్నాక ముస్లిం రాజు బహదూర్‌షాను ఏకగ్రీవంగా చక్రవర్తిగా ప్రకటించారు. ఇది మత ఐక్యతకు సంబంధించిన విషయంగా మార్క్స్ కూడా పేర్కొన్నాడు. ఈ పోరాటం నుంచి పొందిన గుణపాఠంతో బ్రిటీష్ వాళ్లు తమ 'విభజించు పాలించు' విధానంలో భాగంగా **1857** తర్వాత రాజకీయాల్లోకి మతాన్ని జొప్పించారు.

ఈ పోరులో మహిళల పాత్ర గర్వించతగినది. ఝాన్సీ రాణి పోరాట సామర్థ్యం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. నేటికీ ఆమె పేరు సాహసానికి పర్యాయపదంగా నిలిచిపోయింది. వీరోచిత పాత్రను నిర్వహించిన ముస్లిం మహిళలు సహితం ఎందరెందరో. అవధ్ మహారాణి బేగం హజరత్ అందులో ఒకరు. ఝాన్సీ లక్ష్మీబాయికి సమవుజ్జీ ఈమె. ఒక బ్రిటీష్ అధికారి '...... బేగం హజరత్ మాతో అప్రకటిత యుద్ధం ప్రారంభించింది. ఈ రాణులు, బేగంల శ్లాఘనీయ, శక్తివంత చరిత్రలను గమనించాక, అంతఃపురంలో పరదాల చాటు వుంటూ కూడా ఎంతటి శక్తి యుక్తులు సంతరించుకోగలరో తెలుసుకున్నాం' అని వ్యాఖ్యానించడం చూస్తే బేగం హజరత్‌తో పాటు మరెందరో మహిళల శక్తియుక్తులు అర్థమవుతాయి. బేగం అజీజున్ అనే పాతికేళ్ల మహిళ గురించి వింటే మహిళల పాత్ర మరింత తెలుస్తుంది. ఈమె మహిళా సైనిక బెటాలియన్‌ను ఏర్పాటు చేసింది. మహిళా సైనికులకు తుపాకీ పేల్చడం, కత్తి తిప్పటం, గుర్రపు స్వారీ వంటి వాటిల్లో స్వయంగా శిక్షణ నిచ్చింది. గూఢచర్యం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించింది.



ఈ పోరులో ప్రముఖ పాత్ర వహించిన వాళ్లుగా చరిత్రకెక్కిన వారిలో అధికులు రాజులూ, సంస్థానాధీశులూ, రాణులూ, బేగంలు. అయితే ఈ పోరులో అసంఖ్యాకమైన సామాన్య ప్రజలు వీరోచితమైన పాత్ర వహించారు. ఈ రాజులు, రాణుల వలె కాక ఏ స్వార్థ ప్రయోజనాలు లేకుండా కేవలం సామ్రాజ్యవాద వ్యతిరేకతతోనే ఈ పోరులో వీరంతా పాల్గొన్నారు. వీరి సాహసమే, వీరి త్యాగమే ఈ పోరుకు వెన్నెముక. కానీ వీరిలో అసంఖ్యాకులు అనామకంగానే చరిత్రలో కలిసిపోయారు.

ఇలా కుల, మత, జాతి, లింగ భేదం లేకుండా ప్రజలంతా ఏకతాటి మీద నడిచిన ఈ పోరు సెప్టెంబర్ వరకూ అప్రతిహతంగా సాగుతూ అనేకచోట్ల బ్రిటీష్ పాలనను తుడిచిపెట్టేసింది. ముఖ్యంగా ఉత్తర భారతంలో బ్రిటీష్ పాలన పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. వలస పాలకులకే కాక వాళ్లకు తొత్తులుగా ఉండిన స్వదేశీ పాలకులకూ, అధికారులకూ వ్యతిరేకంగా ఈ పోరాటం సాగింది. దేశమంతటినీ కుదిపేసిన ఈ పోరును అణచడం బ్రిటీష్ వారికి చాలా కష్టమైంది.

బ్రిటీష్ పాలనను తుడిచేసి అనేక చోట్ల ఉద్యమకారులు తమ అధికారాన్ని నెలకొల్పారు. తమ పాలనలో లంచాలు, అవినీతి వంటి వాటిని అంతం చేయడానికి ప్రయత్నించారు. మొదట బహదూర్‌షాను చక్రవర్తిగా ప్రకటించినప్పటికీ ఆ తర్వాత అధికారాన్ని నడపడానికి అత్యున్నత కమిటీని ఎన్నుకున్నారు. అంటే వ్యక్తి పాలనను కాకుండా ఒక సమిష్టి పాలనను ఉనికిలోకి తెచ్చారు, న్యాయ స్థానాలనూ నెలకొల్పారు. ఈ న్యాయ స్థానాల్లోని పదవులలోకి సహితం పౌరుల నుంచీ, సైనికుల నుంచీ ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎన్నుకున్నారు.

సెప్టెంబర్ 20న బ్రిటీష్ సైన్యాలు ఢిల్లీని ఆక్రమించాయి. దీంతో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామపు ఓటమి ప్రారంభమైంది. దాదాపు సంవత్సరంనర తర్వాత ఈ పోరాటం పూర్తిగా ఓటమికి గురయింది.

ఈ ఓటమికి దారితీసిన కారణాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ఈ పోరాటం శాస్త్రీయ సిద్ధాంతం వెలుగులో జరగలేదు. విప్లవకర నాయకత్వం లేదు. సైనికులకు ఆధునిక ఆయుధాలు లేవు. నిర్మాణ కౌశలం లేదు. వివిధ ప్రాంతాల్లో జరిగిన తిరుగుబాట్ల మధ్య సమన్వయం లేదు. క్రమశిక్షణ సహితం కొరవడింది. సరుకుల సరఫరా లేక చాలా కష్టాలు పడ్డారు. బ్రిటీష్ పాలనను అంతం చేసిన తర్వాత ఏర్పాటు చేయవల్సిన ప్రత్యామ్నాయ వ్యవస్థ గురించిన అవగాహనలేదు. దీనికితోడు భారత ఫ్యూడల్ శక్తులు విద్రోహం చేశాయి. బ్రిటీష్ వారు ప్రపంచ విజేతలు. కాబట్టి అటువంటి ఆధునిక రాజ్యశక్తిపై ఈ తిరుగుబాటు విజయం సాధించలేకపోయింది.

ఈ తిరుగుబాటు ఓడిపోయినప్పటికీ ఈ పోరాటం కుల, మత, జాతి తేడాలు లేకుండా దేశవాసులను సమైక్యపరిచిన పోరుగా నిలిచింది. విముక్తి కోసం పోరాడవల్సిన ఆవశ్యకతను ఎజెండా మీదికి తెచ్చింది.

తిరుగుబాటు ముగిసిన తర్వాత పోరాటకారులపై బ్రిటీష్ ప్రభుత్వం ఘోరాతి ఘోరమైన హింసాకాండను జరిపింది. వేలాదిమందిని ఊచకోత కోసింది. తిరుగుబాటు కాలంలోనూ దొరికిన వారిని పాశవికంగా హత్య చేసింది. అనేక మంది పోరులో భాగంగానూ అమరులయ్యారు.

హైదరాబాద్‌లో తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కుర్రెబాజ్ ఖాన్‌ను పట్టుకొని కాల్చిచంపి, సుల్తానా బజార్‌లోని ఒక చెట్టుకు వేళ్లాడదీసారు. బ్యారక్‌పూర్ వద్ద మంగల్ పాండేను ఉరి తీసారు. 27 వేల మంది ముస్లింలను ఉరితీసారని రికార్డులు చెప్తున్నాయి. కానీ అనధికార అంచనాల ప్రకారం మరో 30 వేల మంది ఊచకోతకు గురై ఉంటారని భావిస్తున్నారు. దీన్ని బట్టి మొత్తంగా ఇంకెంత మందిని ఊచకోతకు గురిచేసి వుంటారో అర్థం చేసుకోవచ్చు. వలసవాద ప్రభుత్వం ఇంతగా ఊచకోతను అమలు చేసినప్పటికీ '1857' భారత ప్రజల్లో కల్గించిన స్వాతంత్ర్య స్ఫూర్తిని ఆర్పేయలేకపోయింది. ఆ స్ఫూర్తి ఆ తర్వాత కూడా కొనసాగుతూ బ్రిటీష్ పాలకులను కలవర పెడుతూనే వుండింది. కాకోరి, చిట్టగాంగ్ తిరుగుబాట్లు, గూండాదూర్ నాయకత్వంలో జరిగిన భూంకాల్ పోరాటం, బిర్సాముండా నాయకత్వంలో జరిగిన ఆదివాసీ పోరాటం, అల్లూరి సీతారామరాజు నడిపిన మన్యం పోరాటం వీటిలో ముఖ్యమైనవి. కొమురం భీం నాయకత్వంలో నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం కూడా 1857 స్ఫూర్తిని కొనసాగిస్తూ జరిగినదే. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్, ఆజాద్ వంటి విప్లవ వీరుల నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటం మరింత స్పష్టమైన అవగాహనతో కూడినది. ఇలా అనేక పోరాటాల రూపంలో కొనసాగిన 1857 స్ఫూర్తిని దారి మళ్లించి ప్రజల స్వాతంత్ర్య కాంక్షను కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచింది. ఫలితంగా ప్రజలు కోరుకున్న స్వాతంత్ర్యం కాకుండా దేశానికి బూటకపు స్వాతంత్ర్యం వచ్చింది.

అది బూటకపు స్వాతంత్ర్యమని విప్లవ ప్రజానీకం వెంటనే గుర్తించింది. అందుకే అధికార మార్పిడికి ముందే మొదలైన తెలంగాణ సాయుధ పోరాటం హైదరాబాద్ సంస్థానాన్ని 'స్వతంత్ర భారతదేశం'లో విలీనం చేసిన తర్వాత కూడా ఆగలేదు. నిజమైన స్వాతంత్ర్యం ప్రజారాజ్యాధికార స్థాపనలోనే వుందని గుర్తించి వీరోచితంగా ముందుకు సాగింది. ఇదే సమయంలో తెభాగ, పునప్రవాయిలర్ వంటి పోరాటాలు సాగాయి. ఈ పోరాటాలను పాలకవర్గాలు తీవ్రంగా అణచివేసి తాము బ్రిటీష్ పాలకులకు అచ్చమైన వారసులమని చాటుకున్నాయి.

ఆ తర్వాత ప్రజల స్వాతంత్ర్య కాంక్ష నక్సల్బరీ పోరాటంగా ముందుకు వచ్చింది. 'నక్సల్బరీ' భారత విముక్తి పోరుకు సరైన దిశనూ, మార్గాన్ని నిర్దేశించింది. ఆ తర్వాత అది శ్రీకాకుళం, జగిత్యాల, సిరిసిల్లాల మీదుగా అప్రతిహతంగా ముందుకు సాగుతోంది. ఈ పోరుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వం వహిస్తోంది.

ఇదే సమయంలో పాలకవర్గాలు సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి రోజు రోజుకు మరింతగా దాసోహం అంటున్నాయి. నాటి వలసవాద దోపిడీ స్థానంలో నేడు నయా వలస తరహాలోని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దోపిడీ రాజ్యమేలుతోంది. ఒకవైపు దేశాన్ని అడ్డూ అదుపూ లేకుండా దోచుకుంటూ, సామ్రాజ్యవాదులకు దోచిపెడ్తూ వున్న భారతపాలక వర్గాలు, ప్రథమ స్వాతంత్ర్య పోరాటపు 150 ఏళ్ల ఉత్సవాలను నిస్సిగ్గుగా జరుపుతున్నాయి. ఈ ఉత్సవాల కోసం మన్మోహన్ ప్రభుత్వం 150 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ దోపిడీ దార్లకూ, సామ్రాజ్యవాద ఏజెంట్లకూ, ఒక దోపిడీ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని స్మరించుకునే అర్హత లేదు. అంతేకాదు నాటి బ్రిటీష్ పాలకులు 1857 పోరును అణచిపెట్టినట్టుగానే, నేడూ దేశంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటాన్ని ఈ దోపిడీ పాలకవర్గాలు తీవ్రంగా అణచివేయ ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా నాటి బ్రిటీష్ పాలకులను మించిన హింసాకాండకు పాల్పడుతున్నాయి. ఒకవైపు పోరాటాలను అణచివేస్తూ, మరోవైపు పోరాట దినాలను ఉత్సవాలుగా జరపడమంటే, ఆ పోరాటం వేసిన ప్రభావాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకోవడం, అదే సమయంలో ఆ పోరాట దినపు స్ఫూర్తిని హరించి, దాన్ని ఉత్త డొల్లగా మిగల్చడం. ఈ కుట్రను పాలకవర్గాలు ఎప్పటినుండో ప్రయోగిస్తున్నాయి.

అయితే విప్లవ ప్రజానీకం ఎప్పటికప్పుడు ఇటువంటి కుట్రలను భగ్నం చేస్తూ పోరును ముందుకు తీసుకెళ్తూనే వుంది. ఆ పోరులో మరింత విస్తృతంగా చేరి, దోపిడీ వర్గాలను కూలదోసి, దేశ భవితను రక్షించుకోవాలని యావత్ దేశ ప్రజానీకానికీ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి 150 యేళ్లు నిండిన ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తోంది. ఈ సందర్భంగా నాటి పోరులో ప్రాణాలర్పించిన నామక, అనామక వీరయోధులందరికీ అరుణారుణ జోహార్లర్పిస్తోంది.

★

# 610 జీవోను అమలు చేయాలి

610 జీవో మళ్లోసారి ఆంధ్రప్రదేశ్‌లో చర్చనీయాంశం అయింది. ఉద్యోగ నియామకాల్లో తెలంగాణా ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దడం కోసం అంటూ 1985లో చేసిన ఈ జీవో నేటికీ చర్చనీయాంశంగానే వుండడం ఈ ఇరవై ఏళ్లలో రాష్ట్రాన్ని పాలించిన పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం.

తెలంగాణలోని స్థానికుల ఉద్యోగ పరిరక్షణ కోసం 1975లో రాజ్యాంగ సవరణ చేశారు. దీన్నే రాష్ట్రపతి ఉత్తర్వులు అంటారు. ఈ ఉత్తర్వుల ప్రకారం స్థానికులకు ఎల్.డి.సి దాని దిగువ స్థాయి ఉద్యోగాల్లో 80 శాతం, ఇతర నాన్ గెజిటెడ్ కేటగిరీ (జోనల్ కేడర్)లో 70 శాతం, జోనల్ గెజిటెడ్ కేటగిరీలో స్థానికులకు 60 శాతం రిజర్వేషన్‌ను కేటాయించాలి. అయితే తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగ నియామకాల్లో ఈ ఉత్తర్వులను పట్టించుకోక పోవడంతో అన్ని స్థాయిల ఉద్యోగాల్లో స్థానికేతరుల సంఖ్య పెరగసాగింది. ఫలితంగా తమ ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని తెలంగాణలోని నిరుద్యోగ వర్గాల్లో ఆందోళన బయలుదేరింది. ఈ ఆందోళన ఫలితంగా 1985లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న ఎన్.టి రామారావు 610 జీవోను జారీ చేసాడు. ఈ జీవో రాష్ట్రపతి ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయడానికి తగిన మార్గదర్శకాలను సూచించింది.

ఈ జీవో ప్రకారం 1975 నుండి రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా తెలంగాణా ప్రాంతంలో ఉద్యోగాలు పొందిన స్థానికేతరులను వారి స్వస్థలాలకు పంపాలి. 1985 డిసెంబర్‌లో జారీ అయిన ఈ జీవో 1986 మార్చి 31 నాటికల్లా అమలు కావాల్సి వుండే. కానీ నేటికీ ఈ జీవో అమలుకాలేదు.

ఈ జీవోపై అధ్యయనం కోసం చంద్రబాబు ప్రభుత్వం 2001లో గిర్‌గ్లానీ కమీషన్‌ను నియమించింది. ఈ కమీషన్, 108 ప్రభుత్వ శాఖల్లో 610 జీవో అమల్లో ఉల్లంఘన జరిగిందని తేల్చి చెప్పింది. అయితే ఆ నివేదికను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక ఈ జీవోను అమలుచేయడం కోసం 1985 నుంచీ నేటి వరకు పలు జీవోలు విడుదలయ్యాయి. కానీ ఈ జీవోలన్నీ వివాదాస్పదం అవుతున్నాయి. తాజాగా 399, 415 జీవోలు కూడా విడుదలై దుమారాన్ని రేపి, రద్దయ్యాయి.

రాష్ట్రంలో మొత్తం 13 లక్షల రాష్ట్ర ఉద్యోగాలున్నాయి. ఇందులోని 5 లక్షల 30 వేల ఉద్యోగాలు 610 జీవో ప్రకారం తెలంగాణా ప్రజలకు చెందాల్సి వున్నాయి. కానీ కేవలం రెండు లక్షల ఉద్యోగాలే తెలంగాణా ప్రజలకు దక్కాయి. ఇందులోనూ టీచర్లు, పోలీసులు, అటెండర్ల వంటి ఉద్యోగాలే అత్యధిక శాతం. ఇంకా మూడున్నర లక్షల తెలంగాణ వాసులకు చెందాల్సిన ఉద్యోగాలను తెలంగాణేతరులు పొందారు. ఇలా తెలంగాణా ప్రజలు తమ సొంత గడ్డ మీదనే దారుణమైన వివక్షకు గురవుతున్నారు. ఈ వివక్షను సరిదిద్దవల్సిన జీవో ఎందుకు అమలు కావడం లేదంటే పాలకులనే వేలెత్తి చూపాలి.

వలసవాదుల స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణను ఆంధ్రలో విలీనం చేసిన పాలకవర్గాలు నాటి నుంచి తెలంగాణ ప్రజల పట్ల అన్ని రంగాల్లో దారుణమైన వివక్షను చూపిస్తున్నాయి. అందులో భాగంగానే రాష్ట్రపతి ఉత్తర్వులనైనా, 610 జీవోనైనా గాలికి వదిలేస్తున్నాయి. తెలంగాణా ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్న, దానికోసం ఉద్యమిస్తోన్న నేపథ్యంలో కూడా ఈ జీవోను అమలుచేయడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదంటే వలసవాదుల ప్రయోజనాలకు పాలకులు ఎంత దృఢంగా కట్టుబడి వున్నారో అర్థం అవుతోంది.

ఇన్నాళ్లుగా ఈ జీవో అమలుపట్ల జరిగిన నిర్లక్ష్యాన్ని వదిలేసి ఇటీవలి కాలంలో దీని అమలుకోసం అంటూ జరుగుతున్న తతంగాన్ని చూసినా ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. ఒకవైపు వలసవాదుల ప్రయోజనాలకు కట్టుబడి వుంటూనే మరోవైపు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణా గురించి పట్టించుకున్నట్లు నటించడం పాలకులకు అవసరం. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణా నినాదంతో ఎన్నికల బరిలోకి దిగింది. 610ని అమలు చేస్తామని కూడా చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక తెలంగాణతోపాటు 610ని కూడా పక్కనపెట్టేసింది.

అయితే ఈ మధ్య కాలంలో తిరిగి హోరెత్తుతున్న తెలంగాణా ఉద్యమ నేపథ్యంలో ప్రభుత్వం 610ని అమలు చేస్తానని మరోసారి చెప్తోంది. దానికోసం డెడ్ లైన్ల మీద డెడ్‌లైన్లను పెడుతోంది. దాన్ని అమలుచేయడంలో ప్రభుత్వానికి ఎంత అయిష్టత ఉందనేది పలు అంశాల్లో బహిర్గతం అవుతోంది.

ఈ జీవో అమలుకు ప్రభుత్వమూ, పార్టీ కట్టుబడి వున్నాయని ఒకవైపు వై.ఎస్ తదితర నాయకులు చెప్తున్నారు. కానీ మరోవైపు పలు కాంగ్రెస్ నేతలు ఈ జీవోకు వ్యతిరేకంగా బహిరంగంగా ప్రకటనలు ఇస్తున్నారు. దీని అమలు ఫలితంగా ఇతర ప్రాంతాల వారికి నష్టం కలుగుతుందంటూ ఇద్దరు ఎం.పిలు పిటీషన్ వేసారు. ఇక దీని అమలుకోసం ఏర్పాటు చేసిన సభా సంఘం నుంచి జీవోను వ్యతిరేకిస్తూ పలువురు కాంగ్రెస్ ఎం.ఎల్.ఎలు రాజీనామా చేశారు. ఈ జీవోను వ్యతిరేకిస్తూ ఆంధ్ర ఉద్యోగులు చేసిన ఆందోళనా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా పాల్గొంటున్నారు. ఈ జీవోకు 'కట్టుబడి' ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇటువంటి సభ్యులపట్ల ఎటువంటి క్రమశిక్షణా చర్యలూ తీసుకోలేదు. కనీసం బహిరంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి అయినా చేయలేదు. దీన్నిబట్టి చూస్తే ఈ వ్యతిరేక స్వరాలు ప్రభుత్వ అభీష్టానికి విరుద్ధంగా బహిర్గతం అవుతున్నాయని అనుకోలేం. ప్రభుత్వ రహస్య ప్రోత్సాహంతోనే ఈ వ్యతిరేకత ముందుకు వస్తోందని స్పష్టమవుతోంది. అంతెందుకూ ఈ జీవోను అమలుచేస్తే హైదరాబాద్ జోన్‌కు ఇతర జిల్లాల తెలంగాణ ప్రజలు సహితం స్థానికేతరులు అవుతారు కనుక, వారు కూడా హైదరాబాద్ వదిలి వెళ్లాలని వై.ఎస్ మాట్లాడాడు. ముఖ్యమంత్రి స్థానంలో వుండి ఇలా బహిరంగంగా మాట్లాడాడంటే ఈ జీవో అమలు పట్ల అతని వైఖరి అర్థమవుతోంది.

ఇకపోతే ఈ జీవోను అమలు చేయడానికి మార్గదర్శక సూత్రాలంటూ ప్రభుత్వం 399వ జీవోను జారీ చేసింది. అయితే ఈ జీవోలో ఓపెన్ కేటగిరీ అనేదాన్ని స్థానికేతర కోటాగా పేర్కొంది. ఇన్నేళ్లుగా స్థానికులకున్న రిజర్వేషన్ హక్కును అమలు చేయని ప్రభుత్వం స్థానికేతరులకు మాత్రం రిజర్వేషన్ ఇవ్వజూపిందంటే ప్రభుత్వం స్పష్టంగా స్థానికేతరుల పట్ల దాని పక్షపాత బుద్ధిని చూపుకున్నట్టు. అందుకే ఈ జీవో పట్ల దుమారం రేగింది. దాంతో వెంటనే దాన్ని రద్దు చేస్తూ 415వ జీవోను తెచ్చింది. ఈ జీవోలో అసలు 610 ప్రస్తావనే తేకుండా ఐదేళ్ల క్రితం జారీ అయిన 129వ జీవో అమలుకు కట్టుబడి వున్నామని చెప్పింది. దాంతో దీనిపైనా వ్యతిరేకత వ్యక్తమయింది. ఫలితంగా ప్రభుత్వం దీన్నీ రద్దు చేసింది.

హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా పేర్కొనడం వల్ల కూడా పెద్ద ఎత్తున దుమారం రేగింది. హైదరాబాద్ జోన్‌కు ఉన్న ప్రాధాన్యతరీత్యా అక్కడ తమ ప్రాబల్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేని కోస్తా నేతలు హైదరాబాద్‌ను తెలంగాణాకూ, కోస్తాకు చెందని ఫ్రీ జోన్‌గా మార్చాలనే వాదనను గత కొన్నాళ్లుగా చేస్తున్నారు. అందులో భాగంగా 610ని అమలు చేయడం కోసం కూడా హైదరాబాద్‌ను ప్రభుత్వం ఫ్రీ జోన్‌గా ప్రకటించింది. అయితే దీనిపైన పెద్ద దుమారం చెలరేగడంతో వెనక్కి తగ్గి హైదరాబాద్‌ను ఆరవ జోన్‌గా ప్రకటించింది.

ఇకపోతే జీవో అమలుకుపెట్టిన డెడ్‌లైన్లు దాటిపోయాయి కానీ స్థానికేతర ఉద్యోగుల జాబితాలు ఖరారు కాలేదు. ఇప్పటికి 63 ప్రభుత్వ శాఖల్లో మాత్రమే జాబితాలు ఖరారు అయినట్టు చెప్తున్నారు. అందులోనూ అనేక అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అనేకమంది స్థానికేతరులు దొంగ సర్టిఫికెట్లతో స్థానికులయ్యారు. 1985 నాటికి 58,952 మంది స్థానికేతర ఉద్యోగులు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం రెండున్నర లక్షల మంది స్థానికేతరులు ఉన్నట్టు తెలంగాణా ఉద్యోగుల సంఘాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రభుత్వం తయారుచేసిన జాబితాల ప్రకారం స్థానికేతరులు 8 వేలలోపే వున్నారు. నిజానికి ఇప్పటికి ఇన్ని జీవోలు విడుదల చేసినా స్థానికేతరులుగా ఎవర్ని గుర్తించాలనే విషయంలో స్పష్టత రాలేదని అధికారులు వాపోతున్నారు. దీన్నిబట్టి చూస్తే ఏదో కొంతమందిని మొక్కుబడిగా వెనక్కి పంపి, జీవోను అమలు చేసాం అని ప్రభుత్వం చెప్పుకోదల్చిందని స్పష్టమవుతోంది.

ఇక్కడి నుండి స్థానికేతరులను బదిలీ చేయడంలో సరైన ప్రమాణాలను పాటించడంలేదు. అంటే వారిని సమాన స్థాయి పదవిలో నియమించడం, వారి సీనియారిటీని సంరక్షించడం వంటి జాగ్రత్తలు ఏవీ తీసుకోవడంలేదు. ఫలితంగా వారు బదిలీలను వ్యతిరేకిస్తూ స్టేలు తెచ్చుకుంటున్నారు. అంటే సానుకూలతను సృష్టించవల్సిన ప్రభుత్వం అననుకూలతలను సృష్టిస్తోందని అర్థం అవుతోంది. డిప్యుటేషన్ల పేరుతో స్థానికేతరులను యధావిధిగా కొనసాగించడం అనేది కూడా జరుగుతోంది.

సింగరేణిలో ఈ జీవోను ఎలా అమలు చేస్తున్నారో ఒకసారి చూద్దాం. సింగరేణి సంస్థ కేవలం తెలంగాణా జిల్లాల్లోనే వుంది కనుక, ఇక్కడి స్థానికేతర ఉద్యోగులను మరో ప్రాంతానికి పంపడం సాధ్యంకాదనీ, కనుక ఇప్పటివరకూ వున్న స్థానికేతరులను యధావిధిగా కొనసాగిస్తూ ఇకమీదట జరిపే నియామకాల్లో 610ని అమలుచేయాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. సింగరేణిలో స్థానికేతరులు ఎక్కువగా ఉన్నది పై స్థాయి ఉద్యోగాల్లోనే. వీరిని ఇదే స్థాయిలోని మరో సంస్థకు బదిలీ చేసి ఇప్పుడు వారు పని చేస్తున్నటువంటి(మేనేజర్లు, సూపర్‌వైజర్లు, క్లర్కులు మొదలైన) పనులనే ఇవ్వవచ్చు. అందులో

ఏ ఇబ్బందీ వుండదు. అట్లా కాకుండా వారిని యధావిధిగా కొనసాగించడంలో స్థానికేతర పక్షపాతం తప్ప ఏ సహేతుకతా లేదు. ఇప్పటి నుండి 610ని అమలుజరిపే విషయంలోనూ వీరు తీసుకున్న నిర్ణయం ఎలా వుందంటే, ఓపెన్ కేటగిరీని స్థానికేతరులకు కేటాయించాలని నిర్ణయించారు. అధికారుల ఉద్యోగాల్లో 40 శాతం ఓపెన్ కేటగిరి వుంది. అంటే ఇదంతా స్థానికేతరులకు దక్కుతుందన్నమాట. స్థానికులకు కేటాయించిన 60 శాతం కూడా అర్హులయినవారు లేకుంటే వాటిని బ్యాక్‌లాగ్ పోస్టులుగా వుంచకుండా స్థానికేతరులతో భర్తీ చేయాలని నిర్ణయించారు. దీనివలన అర్హతలు లేవు అనేదానితో స్థానికులను కాదని స్థానికేతరులకే పెద్ద పీఠం వేసే అవకాశం వుంది. అంటే ఈ జీవో అమలు తర్వాత కూడా సింగరేణిలో స్థానికేతరుల పెత్తనం యధావిధిగా వుంటుంది.

ఇవన్నీ చూస్తుంటే ఒకవైపు 610ని అమలుచేస్తామని చెబుతూనే మరోవైపు దాని సారాన్ని దెబ్బతీసే చర్యలకు ప్రభుత్వం పూనుకుంటోందని అర్థం అవుతోంది.

ఈ జీవో పైన ప్రభుత్వ వైఖరి ఇట్లా వుంటే ఇతర రాజకీయ పార్టీల, స్థానికేతర ప్రజల వైఖరిని, ఆ వైఖరికి గల కారణాలను ఒకసారి చూద్దాం.

ప్రత్యేక తెలంగాణను సమర్థిస్తున్నట్లు చెప్పుకుంటున్న టి.ఆర్.ఎస్, బి.జె.పి, సి.పి.ఐల గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అవి ఎలాగూ ఈ జీవోను సమర్థిస్తాయి. అయితే దీని అమలు కోసం ఎంతవరకు పోరాడుతున్నాయనేది వేరే సంగతి.

తెలుగుదేశం పార్టీ ఈ జీవోను సమర్థిస్తున్నట్లు ఒకవైపు మాట్లాడుతూ, మరోవైపు ఆంధ్రా ఉద్యోగులు చేస్తున్న ఆందోళనల్లో పాల్గొంటోంది. సి.పి.ఎం కూడా దీన్ని సమర్థిస్తున్నట్లు మాట్లాడుతున్నా దాని అమలుకు గట్టిగా డిమాండ్ చేసిందీ, పోరాడిందీ లేదు. ఇవి రెండు పార్టీలు కోస్తా ప్రయోజనాలను కాపాడే పార్టీలు అనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే వీటికి తెలంగాణా ప్రజల ఓట్లు కూడా కావాలి. అంతేకాదు ప్రజాస్వామికవాదులన్న పేరు కనీసంగానైనా కావాలి. కనుక తెలంగాణ ప్రజల కనీస ప్రజాస్వామిక హక్కుకు హామీనిచ్చే ఈ జీవోను బహిరంగంగా కాదనలేవు. అలాగని గట్టిగా సమర్థిస్తే కోస్తాలో తమ పార్టీ ప్రయోజనాలు దెబ్బతింటాయేమోననే భయమూ వుంది. కనుక ఈ పార్టీలది ఎటూ గట్టిగా మాట్లాడలేని సంకట స్థితి.

ఆంధ్ర ఉద్యోగులు తమ స్వస్థలాలకు వెళ్లిపోతే ఆంధ్రాలో నిరుద్యోగం పెరుగుతుందని కొందరు కోస్తా ప్రాంతపు కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. అన్ని అర్హతలు వుండి కూడా తమకు చెందాల్సిన ఉద్యోగాలను వేరే ప్రాంతం వాళ్లు అనుభవిస్తుంటే చూస్తూ తెలంగాణ ప్రజలు నిరుద్యోగులుగా వుండచ్చుగానీ, ఆంధ్రా ప్రాంతంలో మాత్రం నిరుద్యోగిత పెరగకూడదు అనే తమ ఉద్దేశాన్ని ఇంత నగ్నంగా బయటపెట్టుకుంటున్నారు. వీళ్లు కోస్తా ప్రాంతపు ప్రతినిధులు కనుక వీరికి తెలంగాణా ఓట్లు అవసరం లేదు. కనుక వీరు ఏ దాపరికాలు లేకుండా మాట్లాడుతున్నారు.

అంటే ఈ వైఖరుల వెనుక స్వార్థ రాజకీయ ప్రయోజనాలే తప్ప ప్రజల శ్రేయస్సు గురించిన చింతన ఎంతమాత్రమూ లేదని అర్థం అవుతోంది.

స్థానికేతర ఉద్యోగుల్లో, ప్రజల్లో కూడా ఈ జీవో పట్ల వ్యతిరేకత వుండే అవకాశం వుంది. ఎందుకంటే 30, 40 ఏండ్ల నుంచి ఇక్కడ ఉద్యోగాలరీత్యా స్థిరపడ్డవారు, ఇప్పుడు ఈ జీవో కారణంగా తమ స్వస్థలాలకు వెళ్లాలి. ఇది ఇక్కడ బస్సెక్కి అక్కడ దిగినంత సులువైన విషయం కాదు. వాళ్ల ఇండ్లూ, వాకిళ్లను ఏం చేయాలి అనే, పిల్లల చదువులూ, వారి స్థానికత వంటి అనేక సమస్యలు ముందుకు వస్తాయి. పైగా తమ స్వస్థలాలకు పోతే మళ్లీ వారికి ఇళ్లూ, వాకిళ్లు లేని పరిస్థితే ఏర్పడవచ్చు. కనుక వీరి వ్యతిరేకత పూర్తిగా అసమంజసమైనది కాదు. అయితే ఏదేమైనా వీరు అక్కడికి ఉద్యోగులుగానే వెళతారు. కొంచెం వెనుకా ముందయినా, కొంచెం అసౌకర్యం కలిగినా మళ్లీ అన్నీ సమకూర్చుకొనే అవకాశం వుంటుంది. వీరికి అసౌకర్యం కలగకుండా వుండడం కోసం తెలంగాణా ప్రజలు తమ జీవికల్నే కోల్పోవల్సిన అవసరం లేదు. అర్ధ శతాబ్దానికి పైగా వివక్షకు గురవుతున్న తెలంగాణా ప్రజలు ఒకానొక ప్రాథమిక హక్కును కాపాడుకోవడం కోసం చేస్తున్న ప్రజాస్వామిక పోరాటంగా స్థానికేతర ప్రజలు దీన్ని అర్థం చేసుకోవాలి.

ఇక్కడి నుంచి బదిలీయై వెళుతున్న వారు, వారి సీనియారిటీ తదితరాలను కోల్పోకుండా ప్రభుత్వంతో పోరాడాలి. వారి తరపున మాట్లాడుతున్న వారు కూడా చేయవల్సింది ఇదే. అక్కడ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన చెందుతున్న వారు, ఉద్యోగిత కోసం పోరాడాలి.

*(తరువాయి 10వ పేజీలో.....)*

# మేడే వర్ధిల్లాలి

హక్కులూ, సంఘాలూ, సమ్మెలూ, షిఫ్టులు ఈ పదాలన్నీ కార్మికులకు సంబంధించిన పదాలుగా స్థిరపడిపోయాయి. కానీ ఒకప్పుడు కార్మికవర్గానికి హక్కుల్లేవు, సంఘాల్లేవు, సమ్మెల్లేవు, షిఫ్టుల్లేవు. పెట్టుబడిదారీ సమాజం కార్మికవర్గాన్ని యంత్రాలకంటే హీనంగా చూసింది. పని స్థలాల్లో కనీస వసతుల్లేవు. సూర్యోదయానికి ముందే వెళ్లి సూర్యాస్తమయం తర్వాతే ఇంటికి చేరుకునే పరిస్థితి. ఇంతగా రెక్కలు ముక్కలు చేసుకుంటే శ్రమకు దక్కే ఫలితం అతి తక్కువ.

అటువంటి దుర్భర పరిస్థితులను మార్చుకోవడానికి కార్మికులు మొదటి నుండీ చిన్న చిన్న పోరాటాలు చేస్తూనే వస్తున్నారు. అయితే 1886లో మే 1వ తేదీన చేసిన పోరాటం మాత్రం గతంలోని కార్మిక పోరాటాలన్నింటికంటే సంఘటితమైనది. ఎనమిది గంటల పని దినం కోసం, వేతనాల పెంపుదల కోసం, సంఘాలు పెట్టుకునే హక్కు కోసం, సమ్మెజేసే హక్కుకోసం, పని స్థలాల్లో సదుపాయాల మెరుగుదల కోసం జరిగిన పోరాటమిది. ఈ పోరాటంలో భాగంగా కార్మికులు చేపట్టిన ఊరేగింపుపై పోలీసులు కాల్పులు జరుపగా నలుగురు కార్మికులు చనిపోయారు. దీనికి నిరసన తెలిపేందుకు అమెరికాలోని చికాగో కార్మికులు మే 4వ తేదీన అదే నగరం హే మార్కెట్‌లో ఒక సభను జరుపుకున్నారు. ఆ పోరాటాన్ని ఎంతమాత్రం సహించలేని పెట్టుబడిదారీ సమాజం ఆ సభ మీదికి తన కాపలాకుక్కలైన పోలీసులను ఉసిగొల్పి భగ్నం చేయించింది. ఆ సభలో పాల్గొన్న నలుగురు కార్మికులపై తప్పుడు కేసు బనాయించి ఉరితీసింది. కార్మికవర్గపు హక్కుల కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాన్నీ, ప్రాణాలను సహితం పణంగా పెట్టిన వారి పోరాటాన్ని చరిత్రలో సదా నిల్పి వుంచాలనీ, ఆ పోరాట స్ఫూర్తిని తరతరాల కార్మిక వర్గానికి అందించాలని రెండవ ఇంటర్నేషనల్ భావించింది. 1889లో పారిస్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ ఈ పోరాట దినాన్ని పురస్కరించుకొని మే 1వ తేదీని అంతర్జాతీయ కార్మిక పోరాట దినంగా జరుపుకోవాలని నిర్ణయించింది. 1890లో యూరప్‌లో మొదటిసారి మేడేను జరుపుకున్నారు.

ఆనాటి నుంచీ నేటి దాకా ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గానికి మేడే స్ఫూర్తినిస్తూనే ఉంది. భారతదేశంలోనూ కార్మికవర్గం దీన్ని తమ సొంతం చేసుకుంది. అందుకే కార్మికవర్గాన్ని అణచివేస్తున్న ఇక్కడి ప్రభుత్వాలు, కార్మికవర్గానికి ద్రోహం చేస్తున్న బూర్జువా ట్రేడ్ యూనియన్లూ కూడా కార్మికవర్గాన్ని మభ్యపెట్టడం కోసం మేడేని జరపవల్సి వస్తోంది.

పాలకవర్గాలు ఒకవైపు మేడేని జరుపుతూనే, మరోవైపు మేడే స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైన విధానాలను కార్మికవర్గంపై రుద్దుతున్నాయి. అవి అమలు చేస్తోన్న ఉదారీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్.పి.జి) విధానాలు కార్మికవర్గాన్ని తీవ్ర అభద్రతలోకి నెట్టేశాయి. ఈ విధానాల వల్ల ఎన్నో కంపెనీలు మూతపడి కార్మికులు రోడ్డు మీద పడ్డారు. మరెన్నో కంపెనీలు ప్రయివేటీకరించబడి కార్మికుల బతుకులు అభద్రతలో పడ్డాయి. కార్మికులు పోరాడి, రక్తం ధారపోసి సాధించుకున్న హక్కులను నిరాకరించడంలో భాగంగా ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టాయి. పరిశ్రమల్లో ఆధునిక యాంత్రీకరణ కార్మికుల పాలిట శాపంగా మారుతోంది. కార్మికుల శ్రమను తగ్గించాల్సిన యంత్రాలు కార్మికులను తగ్గిస్తున్నాయి. అంతేకాదు ఈ యాంత్రీకరణ కార్మికుల శారీరక, మానసిక శ్రమ వత్తిడిని అధికం చేస్తున్నది. పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవడంలో భాగంగా అనేక మంది కార్మికులను ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ఫలితంగా కార్మికులపైన శ్రమ భారం పెరుగుతోంది. కార్మికులకు తలపెడుతున్న దుర్మార్గమైన చర్యలకు చట్టబద్ధత కల్పించడం కోసం కార్మిక చట్టాలను ఇష్టం వచ్చినట్టుగా సవరిస్తున్నారు. సామ్రాజ్యవాద దేశాలు అవుట్ సోర్సింగ్‌ల పేరిట ఇక్కడి ఉద్యోగుల, కార్మికుల శ్రమను చౌకగా దోచుకుంటున్నాయి.

ఈ విధానాలన్నీ మహిళా కార్మికులను మరింతగా ప్రభావితం చేసేవే. ఉద్యోగాల తొలగింపులో మొదట ఉద్యోగాలు కోల్పోతున్నది వారే. ఇంటి పనికితోడు ఫ్యాక్టరీల్లో పెరుగుతున్న పని భారం వారిని పీల్చి పిప్పి చేస్తోంది. దీనికి తోడు నైట్ షిఫ్ట్‌ల చట్టం వారిని మరింతగా అభద్రతలో పడేస్తోంది. ఇప్పటికీ పలు కంపెనీల్లో మహిళలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండడంలేదు. ఇవి వున్న పలుచోట్ల తలుపులు ఉండడం లేదు. మహిళల మల మూత్ర విసర్జన సమయాన్ని కూడా తగ్గించి పెట్టుబడిదారులు లాభాలు పెంచుకునే కుట్ర ఇది. చట్టాలెన్ని చెప్తున్నా ఫ్యాక్టరీల్లో శిశు సంరక్షణ కేంద్రాలుండడం లేదు. దీనివల్ల పెట్టుబడిదారులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అంతేకాదు పిల్లలకు పాలిచ్చే తల్లుల సమయమూ వారికి అదనపు విలువగా మారుతుంది.

ఈ మధ్య కాలంలో విచ్చలవిడిగా ఉనికిలోకి వస్తోన్న సెజ్‌లలో కార్మికుల పరిస్థితి మరింత విషమంగా ఉంటోంది. దేశంలో అమల్లో వున్న కార్మిక చట్టాలేవీ ఈ సెజ్‌ల్లో అమల్లో వుండవు. పని గంటలు, వేతనాలు, ఉద్యోగాల నుంచి తొలగింపు అంతా సెజ్‌ల యాజమాన్యం చేతుల్లోనే ఉంటుంది. ఈ కార్మికులకు సంఘాలు పెట్టుకునే, సమ్మెలు చేసే హక్కు వుండదు.

వీటన్నింటికి వ్యతిరేకంగా కార్మికవర్గం నిరంతరం పోరాడుతూనే వుంది. అయితే బూర్జువా, రివిజనిస్టు కార్మిక సంఘాలు పెట్టుబడిదారులకు కొమ్ముగాస్తూ కార్మికుల పోరాటాలను నీరుగార్చుతున్నాయి, పక్కదారి పట్టిస్తున్నాయి.

ఆనాడు కార్మికవర్గం ఏ పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిందో, ఆ పరిస్థితులు నేడు కూడా నెలకొని వుండడం ఒక చారిత్రక విషాదం. పని స్థలాల్లో దుర్భరమైన పరిస్థితులు. సంఘాలు పెట్టుకోలేని, సమ్మెలు చేయలేని పరిస్థితి తీవ్రమైన పని వత్తిడి, ఉద్యోగ అభద్రత, శ్రమకు తగ్గ ఫలితం లేని పరిస్థితికి వ్యతిరేకంగా నేడు కూడా పోరాడాల్సిన కర్తవ్యం కార్మికవర్గం ముందుంది.

అయితే పెట్టుబడిదారి వర్గం ఉనికిలో ఉన్నంతకాలం కార్మికవర్గం కుత్తుక మీద కత్తి ఉన్నట్టే. కనుక పెట్టుబడిదారీ వర్గమూ, దానితో అంటకాగుతున్న భూస్వామ్య వర్గమూ ఈ రెండింటికీ అండగా వున్న సామ్రాజ్యవాదం అంతమైనప్పుడే కార్మికవర్గానికి నిజమైన విముక్తి లభిస్తుంది.

అయితే ఈ దోపిడీ వర్గాలు అంతం కావాలంటే దోపిడీకి గురవుతున్న సమస్త శక్తులూ ఏకమై ఒక మహత్తర పోరాటం చెయ్యాల్సి వుంటుంది. రెక్కలు తప్ప ఆస్తులు లేని కార్మికవర్గం, అన్నింటికంటే అత్యధిక దోపిడీకి గురౌతున్న కార్మికవర్గం మాత్రమే ఆ మహత్తర పోరాటానికి నాయకత్వం వహించగల సామర్థ్యం కలిగి వుంటుంది.

నేడు మన దేశంలో రైతాంగంతో బలమైన మైత్రిని ఏర్పాటు చేసుకొని పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలను కలుపుకొని, భూస్వామ్య, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలను అంతం చేసే, నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించవల్సిన చారిత్రక కర్తవ్యం కార్మికవర్గం మీదనే వుంది. ఆ కర్తవ్య సాధనలో భాగంగా నేడు కార్మికవర్గం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోతోంది. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా మరింత సంఘటితం, చైతన్యవంతం కావాల్సిన అవసరం వుంది.

భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించడమే కాదు, ప్రపంచ సోషలిస్ట్ విప్లవంలో చురుకైన భాగస్వామ్యం వహించ వల్సిన కర్తవ్యం కూడా భారత కార్మికవర్గం మీద వుంది. ఈ కర్తవ్య సాధనకై అది ప్రపంచ కార్మికవర్గంతో ఐక్యతను సాధించాలి.

ప్రపంచ కార్మికులారా ఏకంకండి! మేడేని స్ఫూర్తిగా తీసుకొని దోపిడీ అంతం కోసం సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించండి!

★

---

*(.... 8వ పేజీ తరువాయి)*

610 జీవో తెలంగాణా ప్రాంతపు నిరుద్యోగితను పూర్తిగా పరిష్కరిస్తుందా? అంటే పరిష్కరించలేదనే చెప్పాలి. అది కొంతమేరకు మాత్రమే పరిష్కరించగలదు. తెలంగాణలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 3 లక్షల మంది చదువుకున్న నిరుద్యోగులు వున్నారని అంచనా. ఒక అంచనా ప్రకారం మూడున్నర లక్షల మంది స్థానికేతరులు ఇక్కడ ఉద్యోగాల్లో వున్నారు. అయితే ప్రభుత్వం ఎంతమందిని స్థానికేతరులుగా తేల్చుతుందో చెప్పలేం. అదే సమయంలో వారిని బదిలీ చేయగా ఏర్పడిన ఖాళీలను స్థానికులతో పూరిస్తుందనే నమ్మకం కూడా లేదు. ఎందుకంటే ఉపాధి కల్పన నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటున్న దశలో ప్రస్తుతం మనం వున్నాం. ఉపాధి సమస్య అనేది ప్రభుత్వ విధానాలతో ముడిపడి వున్న సమస్య. కనుక ప్రజల ఉపాధిని హరించివేస్తున్న ఈ విధానాలతోనూ, విధానాలను అమలుచేస్తున్న పాలకవర్గాలతోనూ పోరాడటం ద్వారానే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుంది. అయినప్పటికీ 610 అమలుకోసం పోరాడాలి. దీని అమలు జాప్యాన్నీ, అందులోని అవకతవకలను ఎంతమాత్రమూ ఉపేక్షించకూడదు. ఈ పోరాటం తెలంగాణా ప్రజల ఒక కనీస హక్కును నిలబెట్టుకోగలుగుతుంది.

★

# సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే బాక్సైట్ వెలికితీత

'మా జీవితాన్ని, మా సంస్కృతిని రక్షించుకోవడానికి మా భూమి, నీరు, అడవి మాకు కావాలి. వీటి మీద హక్కు కావాలి. వీటి రక్షణ మా కొరకేకాదు. సమస్త మానవ ప్రపంచం రక్షణకొరకు. మా అభివృద్ధిని నాశనం చేసి, మానవుల్ని కలుషితం చేసి, గనుల కోసం భూమిని లోతుగా గాయం చేసి విధ్వంసం సృష్టిస్తున్నారు. మాకు మా చెట్లనూ, నీటినీ, భూమిని అమ్మడంగానీ, కలుషితం చేయడం గానీ అసలు ఇష్టం వుండదు' అని ఆదివాసీలందరూ ముక్త కంఠంతో మాట్లాడుతున్నారు. అడవి మీద ఆదివాసీల హక్కు కొరకు, సామ్రాజ్యవాదానికి, పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు సంఘటితంగా పోరాడుతున్నారు. దీనిలో భాగంగానే మన్యంలో జిందాల్, అరబ్ సంస్థలు ప్రారంభిస్తున్న బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాడుతున్నారు. ఈ పోరాట నేపథ్యాన్ని చూద్దాం.

బాక్సైట్ అనేది భూమిలో దొరికే ఒక ఖనిజం. దీన్ని రిఫైనరీలో శుద్ధి చేస్తే అల్యూమినా అనే ముడి పదార్థం పౌడర్ రూపంలో లభిస్తుంది. ఆ తర్వాత దీన్ని వివిధ రూపాల్లో లోహంగా మార్చుకోవచ్చు. ఈ లోహాన్నే అల్యూమినియం అంటారు. దీని ఉపయోగం వ్యూహాత్మకంగా కీలకమైనది. యుద్ధ వస్తువుల తయారీకి ముఖ్యమైనది. విమాన ఫ్రేములను (బాడీలను) అల్యూమినియంతోనే తయారు చేస్తారు. వీటిని తయారు చేసే ప్రభుత్వ రంగ (హెచ్.ఎ.ఎల్ వంటి) సంస్థలున్నాయి.

అల్యూమినియంను ఇప్పటికే దేశ అవసరాల కంటే ఎక్కువగానే ఉత్పత్తి చేస్తున్నారు. మరి ఆంధ్ర-ఒరిస్సా, ఇతర రాష్ట్రాల్లో బాక్సైట్ నిల్వల తవ్వకం ఎందుకు జరుగుతున్నట్లు? ప్రపంచీకరణలో భాగంగా సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రయోజనాలు నెరవేర్చేందుకే తప్ప మరొకందుకు కాదు. అదే విధంగా, అల్యూమినియం కొరకు భారతదేశంలో, అందులో కోస్తా తీర ప్రాంతంలో (ఆంధ్ర-ఒరిస్సా) సామ్రాజ్యవాదులు, ఎం.ఎన్.సిలు తిష్టవేయడానికి కారణం ఇక్కడ బాక్సైట్ నిల్వలు అపారంగా వుండి, మేలురకం అల్యూమినియం దొరకడమే.

ప్రపంచంలో బాక్సైట్ నిల్వలు 40 బిలియన్‌ల టన్నులున్నాయి. ఇందులో కేవలం భారతదేశంలోనే 28.5 బిలియన్ టన్నుల నిల్వలున్నాయి. ప్రపంచ బాక్సైట్ నిల్వల్లో మన దేశంలో 70 శాతం నిల్వలున్నాయి. ఆంధ్ర-ఒరిస్సాలోని కోస్తా తీరంలో 2500 మిలియన్ టన్నుల బాక్సైట్ వుంది. ఆంధ్రలోని మన్యంలో 570 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలున్నాయి. ఇతరచోట్ల అల్యూమినియం తయారుకు ఎక్కువ బాక్సైట్ కావాలి. మన్యంలో దొరికే బాక్సైట్ 3 టన్నులతో 1 టన్ను అల్యూమినియం తయారవుతుంది. అందుకే సామ్రాజ్యవాదుల డేగ కన్ను విశాఖపై పడింది.

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ అటవీ ప్రాంతంలో ప్రధానంగా చింతపల్లి, గూడెం, అరకు ప్రాంతాల్లో బాక్సైట్ నిల్వలున్నాయి. అరకు ప్రాంతంలోని గాలికొండ, రక్తకొండ, చిట్టెమగొందిలలో 55 టన్నులు, చింతపల్లి ప్రాంతంలోని సప్పర్ల, జెర్రెల, గూడెం, కాటమరాజు కొండలలో 515 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి.

ఈ నిక్షేపాలను తెలుగుదేశం ప్రభుత్వం గతంలో 'దుబాయి' పారిశ్రామిక సంస్థలకు 5 వేల కోట్ల రూపాయలకు అమ్మివేయాలని దానికి అనుగుణంగా 1/70 చట్టాన్ని సవరించాలని, ఆదివాసీ సలహా మండలిచేత బలవంతంగా అనుమతింపచేసి, షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసేతరుల దోపిడీని చట్టబద్ధం చేయడానికి కుట్ర పన్నింది. ఇది గమనించిన ఆదివాసీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున నిరసనోద్యమం చేయటంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకున్నది.

చంద్రబాబు చేయలేని ఏ పనినైనా నేను చెయ్యగలనని నిరూపించుకోవడానికి అన్నట్లు రాజశేఖర్ రెడ్డి రంగంలోకి దూకాడు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి, సామాజిక అభివృద్ధి పేరిట బాక్సైట్‌ను ప్రభుత్వ కంపెనీల ముసుగులో విదేశీ పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టడానికి పూనుకుంది. ఇందులో భాగంగా ఏజన్సీ పాలకవర్గ ప్రతినిధులతో, నేషనల్ అల్యూమినియం కార్పోరేషన్ (నాల్కో), రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థలతో కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలు జరిపి బాక్సైట్ నిక్షేపాలను వెలికి తీయడానికి జిందాల్ కంపెనీతో 9 వేల కోట్ల రూపాయలకు 2006 జూలై 1న ఒప్పందం కుదుర్చుకుంది.

ఒరిస్సాలోని దామన్ జోడిలో బాక్సైట్ తవ్వకాల వల్ల వేలాది ఆదివాసీ కుటుంబాలు వీధినపడ్డాయి. ఒరిస్సాలో బాక్సైట్ తవ్వకాల వల్ల పదుల సంఖ్యలో పర్వతాలు నేలమట్టం అవుతున్నాయి. అనేక నీటి ప్రవాహాలు ఎండిపోతున్నాయి. దామన్ జోడిలోని నాల్కో అల్యూమినియం ఫ్యాక్టరీ వల్ల వెయ్యి గిరిజన కుటుంబాలు

నిర్వాసితమయ్యాయి. ఇందులో కేవలం 160 మందికే నామమాత్ర పునరావాసం కల్పించారు. నాల్కో ఫ్యాక్టరీలో 5 వేల మంది ఉద్యోగస్తులుండగా 442 మంది ఆదివాసులకు కళాసీ, స్వీపర్లు, డ్రైవర్ల వంటి ఉద్యోగాలు కల్పించారు. ఇంకా కొంత మందికి 15 నుండి 20 రూపాయలు ఇనస్తూ కూలీలుగా పని చేయించుకుంటున్నారు. ఈ ఫ్యాక్టరీ కొరకు 9 వేల ఎకరాలకు పైగా భూమిని ఆదివాసీల నుండి బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. వీరి భూములకు, ఇళ్లకు కేవలం రెండు వేల రూపాయలలోపు నష్టపరిహారం చెల్లించారు. కనీస పునరావాసం కూడా అమలుచేయని ప్రభుత్వాలు మన్యం ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తామనడం వట్టి దగా మోసం. విశాఖ జిల్లా అధికారులు అమాయకులైన ఆదివాసీలను దామన్ జోడి తీసుకెళ్ళి అక్కడి పరిశ్రమలు చూపించి ఉద్యోగాలు ఇస్తామని, పక్కా ఇళ్లు నిర్మిస్తామని మోసపూరితమైన హామీలు ఇస్తున్నారు. దామన్ జోడీని సందర్శించిన విశాఖ ఆదివాసీలెవ్వరికీ అక్కడ అభివృద్ధి కనిపించలేదు. గనుల మీద జరిగే అభివృద్ధి మాత్రం కనిపించింది. అందుకే మన్యం ఆదివాసీలు ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలతో ఆదివాసీల అభివృద్ధి జరుగుతుందని చెబుతున్నది. ఒరిస్సా రాష్ట్రంలో తవ్వకాలకు ప్రభుత్వం వివిధ కంపెనీలకు అనుమతినిచ్చింది. ఆ కంపెనీలు తవ్వకాలకు సన్నద్ధమవుతుంటే ఆదివాసీలు పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహిస్తున్నారు.

ఒరిస్సాలో బాక్సైట్ తవ్వకాలు జరిగితే వంశధార, నాగావళి, జంఝావతి నదులు, విశాఖ జిల్లాలో అనంతగిరి, అరకు మండలాల్లో తవ్వకాలు నిర్వహిస్తే గోస్తనీ, రైవాడ, పెద్దేరు నదులు, చింతపల్లి, గూడెం కొత్తవీధి ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహిస్తే తాండవ, శారద, చిత్రకొండ, సీలేరు, శబరి, గోదావరి నదులు కలుషితం అవుతాయి. బాక్సైట్ తవ్వకాలు చేపడితే 8 వేల హెక్టార్ల ప్రాంతంలో ఉన్న ఆదివాసీ గ్రామాలన్నీ ఖాళీ చేయాల్సి ఉంటుంది. సుమారు 180 గ్రామాలకు చెందిన 47 వేల మందిని తమ తమ గ్రామాల నుండి వెళ్లగొట్టే ప్రమాదముంది. అడవులను కోల్పోయి పర్యావరణం పూర్తిగా నాశనం అవుతుంది. ఈ ప్రాంతంలో 30 రకాల పంటలు అటవీ ఉత్పత్తుల కొరత ఏర్పడే ప్రమాదం వుంది. ఆరోగ్యాన్ని చేకూర్చే ఔషధ మొక్కలు లేకుండా పోతాయి. భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముంది. తవ్వకాల వలన సుమారు 25 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు దుమ్ము వ్యాపించి పంటలపై, తాగునీటిపై పడి ఆదివాసీల జీవితాలు విచ్ఛిన్నమౌతాయి.

9 వేల కోట్ల ఖర్చుతో జిందాల్ కంపెనీ, పరిశ్రమ నెలకొల్పుతుందని ప్రకటించగానే అధికారులు, కంపెనీ ప్రతినిధులు మైదాన ప్రాంతంలో రిఫైనరి స్మెల్టర్లు నెలకొల్పడానికి శరవేగంతో స్థల పరిశీలనలు, సర్వేలు జరిపి సబ్బవరం వద్ద 4 వేల ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈ పరిశ్రమల్లో ఆదివాసీలకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇస్తారని అనుకుంటే అది భ్రమే. ఈ పరిశ్రమల్లో మొత్తం ఉద్యోగాల సంఖ్య వందలోపే ఉంటాయి. మొత్తం యంత్రాలతోనే పరిశ్రమను నడిపిస్తారు. ఇక ఈ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాల వల్ల అనేక రకాల ప్రమాదాలు ఉన్నాయి. నీరు, గాలి, భూమి, కాలుష్యమై పర్యావరణ సమతుల్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. కాలక్రమంలో అటవీ ప్రాంతాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. బహుళజాతి కంపెనీలకు తమ దేశాల్లో ఇలాంటి పరిశ్రమ నెలకొల్పడానికి అక్కడి ప్రభుత్వాల అనుమతి లభించడం లేదు. పర్యావరణ, సామాజిక సంక్షేమ దృక్పథాల వలన ఆ దేశాలు ఈ కంపెనీలకు అనుమతి ఇవ్వడంలేదు. అందుకే అభివృద్ధిచెందిన దేశాల్లోని బహుళజాతి కంపెనీలు మన దేశంపై కన్నువేశాయి. కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ఇక్కడ పర్యావరణశాఖ, అటవీశాఖ, కాలుష్యశాఖ అనుమతులు ఇవ్వకపోయినా స్థానిక ప్రభుత్వాల సహకారంతో ఇక్కడి పెట్టుబడిదారుల ఒత్తిడితో విదేశీ బహుళజాతి సంస్థలు అనుమతులు సాధించుకున్నాయి. బాక్సైట్ నుంచి వచ్చే వృధా మట్టి (రెడ్‌మడ్) చాలా ప్రమాదంతో కూడుకున్నది. దాని కోసం ఏర్పాటు చేసే స్లర్రీ పౌండ్ వల్ల చాలా సమస్యలు ఉత్పన్నమై పలు వ్యాధులు వ్యాపిస్తాయి. ఇప్పటికీ విశాఖ ఏజన్సీలో విష జ్వరాలకు వందలాది మంది ఆదివాసీల ప్రాణాలు ప్రతి సంవత్సరం పోతున్నాయి. ఈ మరణాలను ఆపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం, అల్యూమినియం పరిశ్రమ కట్టి ఆదివాసీ జీవితాలను కాపాడుతామంటూ మోసపూరిత మాటలతో ఆదివాసీలను మరోసారి దగా చేయటానికి సంకల్పించింది. పుట్టిన ఊరుతో, అడవితో, చెట్టు చేమతో ఆదివాసీలకున్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అనుబంధానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. స్వల్పకాలిక ఆదాయాల కోసం, దీర్ఘకాల ప్రయోజనాలను పణంగా పెట్టి ప్రజల జీవన విధానాన్ని భవిష్యత్తును నాశనం చేసే 'అభివృద్ధి'ని తప్పనిసరిగా వ్యతిరేకించాలి.

అభివృద్ధి క్రమంలో ఆదివాసీలను అటవీ లోతట్టు ప్రాంతానికి నెట్టివేసిన ప్రభుత్వాలు ఇప్పుడు ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు తలవంచి అడవులను, ఖనిజ సంపదలను, నీటిని బహుళజాతి

సంస్థలకు, కార్పొరేట్ రంగానికి కట్టబెట్టి అడవిలో బహుళజాతి కంపెనీల ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి పూనుకున్నాయి. ప్రభుత్వం ఆదివాసీ సంఘాలకు గనుల తవ్వకాల్లో భాగస్వామ్యం కల్పిస్తామని వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని మోసపూరిత ప్రకటనలు చేస్తున్నది. గతంలో ఏజన్సీ ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించినపుడు, ఆదివాసీలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు నేటికీ అవి అమలు చేయలేకపోయాయి అనేది నగ్న సత్యం. ఈ ప్రభుత్వాలు ఆదివాసీ శ్రమ సంపదను యధేచ్ఛగా దోపిడీ చేస్తూ బహుళజాతి సంస్థలకూ, విదేశీ పారిశ్రామిక సంస్థలకు సంపద సమకూర్చిపెట్టే సాధనాలుగా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, ఆదివాసీ ప్రజల ప్రయోజనాలను నెరవేర్చేవిగా లేవు.

## ఆదివాసీ చట్టాలు ఏం చెబుతున్నాయి?

చట్టాల విషయానికొస్తే 1/70 ఆదివాసేతరులకు భూ బదలాయింపును నిషేధిస్తుంది. ఖనిజం తవ్వడానికి, ఫ్యాక్టరీ నెలకొల్పడానికి, ఎవరికీ ప్రభుత్వం భూమి లీజుకు ఇవ్వడానికి వీలులేదు. ఈ నిషేధం అయిదవ షెడ్యూల్ పేరా 5(2)(ఎ)(బి)లలోనే ఉందని సమత వర్సస్ స్టేట్ (1997) కేసులో జస్టిస్ రామస్వామి స్పష్టం చేసారు. గనులు, ఖనిజాల నియంత్రణ, అభివృద్ధి చట్టం ప్రకారం మన రాష్ట్రంలో ఆదివాసీలు మాత్రమే సభ్యులుగా ఉన్న సహకార సంఘాలకు తప్ప మరెవ్వరికి ప్రభుత్వం గనులు లీజుకివ్వడానికి వీలు లేదు. కేంద్ర ఆదివాసీ సంక్షేమశాఖ, అటవీ సంరక్షణ చట్టం 1980 ప్రకారం కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్ట్‌లోని గనులు లీజుకివ్వడం నిషేధం. పర్యావరణ చట్టం 1986 ప్రకారం పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే గనులు లీజుకివ్వడం నిషేధం. షెడ్యూల్డ్ ప్రాంత పంచాయితీరాజ్ (పీసా) చట్టం 1998 నియమాలను ఉల్లంఘించి ఆదివాసుల హక్కులను కాలరాస్తూ బాక్సైట్ తవ్వకాలకు ప్రభుత్వం పూనుకుంది. పైగా చట్టాల పేరు చెప్పి పారిశ్రామిక అభివృద్ధిని, ఆదివాసీల అభివృద్ధిని కాలరాయడం తగునా అని ఎదురు ప్రశ్నిస్తున్నది అంటే దాని నైజాం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

## పునరావాసం ఒక బూటకం!

ప్రాజెక్టుల వలన లేదా అభివృద్ధి పనుల వలన నిర్వాసితులయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడానికీ, పునరావాసం కల్పించడానికీ గాను జాతీయ పునరావాస విధానం 2004ను ప్రకటించింది. ఈ విధానంలో చాలా లోపభూయిష్టమైన అవగాహన ఉంది. అంతే కాకుండా ప్రకటించిన పునరావాస చర్యలు చేపట్టడం, నష్ట పరిహారం చెల్లించడంలో కూడా ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

భూమికి భూమి యిస్తామని ఈ పునరావాస విధానంలో ప్రకటించినా, వ్యవసాయానికి అనుగుణంగా ఉన్నచోట భూమిని ఇచ్చిన దాఖలాలు లేవు. నిర్వాసితుల ప్రాంతాలలో నిర్మించే ఫ్యాక్టరీలు, గనుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్న విషయం హామీగానే మిగిలిపోతున్నది. నిర్వాసితులు అంటే బలవంతంగా తమ స్వంత స్థలం నుండి గెంటివేయబడినవారే. ఈ క్రమంలో జీవనోపాధి, జీవన విధానం, వారి సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు విచ్ఛిన్నం అవుతాయి. డబ్బు రూపంలో నష్టపరిహారం చెల్లించినంత మాత్రానా వారి పూర్వ జీవన విధానం రాదుకదా! కొత్త ప్రాంతాల్లో వారికి పునరావాసం కల్పించినప్పటికీ అక్కడి ప్రజలు వీరిని పరాయి వారుగానే చూసే అవకాశం ఉంటుంది. కాబట్టి నష్టపరిహారం, పునరావాసం కల్పించినా జీవించే హక్కుకు చాలా అవరోధాలు ఎదురవుతాయి. ఈ విషయాలపై ఎవరయినా మాట్లాడితే, అభివృద్ధి నిరోధకులు అని పాలకవర్గాలు, పారిశ్రామికవేత్తలు ముద్రవేసి ఆందోళనలను తీవ్రంగా అణచివేస్తున్నారు.

జాతీయ పునరావాస విధానంలోనూ, చట్టాల్లోనూ, ప్రైవేట్ వ్యక్తుల భూములను ప్రజా సంక్షేమ అభివృద్ధి కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి భూసేకరణ చట్టం వీలు కల్పిస్తుంది. ఈ చట్టం ప్రకారం భూమిపై ఆస్తి హక్కు కల్గివున్నవారికే నష్టపరిహారం చెల్లించాలి. ఈ కోణంలో చూస్తే బాక్సైట్ తవ్వకాల వలన నిర్వాసితులయ్యే ఆదివాసీలకు నష్టపరిహారం దక్కే అవకాశం లేదు. ఎందుచేతనంటే అటవీ ప్రాంతంలో ఉండే ఆదివాసీలకు ఆస్తి హక్కును ధృవీకరించే పత్రాలు ఉండవు. ఆదివాసేతరుల చేతుల్లోకి ఆదివాసీల భూమి అన్యాక్రాంతం అయింది. భూమిలేని వారి సంగతి ఏమిటి? వ్యవసాయ కూలీలుగా, పశువుల కాపరులుగా బతికేవాళ్ళున్నారు. అటవీ సంపదపై ఆధారపడి బతికే వారున్నారు. వీరందరినీ పునరావాస విధానం కిందకు తీసుకువస్తుందా? ప్రభుత్వం వీరికి కూడా నష్టపరిహారం చెల్లిస్తానని చెబుతున్నా ఆచరణలో అమలు కావడంలేదు.

## బహుళజాతి సంస్థల 'సామ్రాజ్యాల'ను నెలకొల్పడమే ధ్యేయం

మన్యం ప్రాంతంలోని గూడెం కొత్తవీధి, చింతపల్లి మండలాల్లో మావోయిస్టు ఉద్యమం నిర్మాణాత్మకంగా బలంగా

వుంది. ఇక్కడ వెంటనే బాక్సైట్ తవ్వకాలను చేపట్టారు. ఈ తవ్వకాలకు ఆటంకం లేకుండా చూసుకోవడానికి 2005 ప్రారంభం నుండి తీవ్ర నిర్బంధాన్ని, బహుముఖ దాడిని జరుపుతున్నారు. 2005 ఏప్రిల్‌లో గ్రేహౌండ్స్ బలగాలు కోరుకొండ దళాన్ని చుట్టుముట్టి కాల్చిచంపారు. ఈ దాడిలో కమాండర్ కా. రమణతో సహా ముగ్గురు మహిళా కామ్రేడ్స్ అమరులైనారు. నేటికీ తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నది. ఈ దృష్ట్యా మొదట అరకు, అనంతగిరి మండలాల్లో తవ్వకాలను ప్రారంభించే విధంగా పథకాన్ని రచించారు. అరకు, అనంతగిరి ప్రాంతంలోని రెండు వేల హెక్టార్లలోని బాక్సైట్ తవ్వకాలను ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎ.పి.ఎం.డి.సి) ద్వారా వెలికితీసి, జిందాల్‌కు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నది. దీనికొరకు సబ్బవరంలో అల్యూమినియం ఫ్యాక్టరీని నెలకొల్పడం కొరకు పథకం సిద్ధం చేశారు. దీన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకించడం వంటి కారణాలవల్ల, విజయనగరం జిల్లా ఎస్. కోట (శృంగవరపు కోట)కు మార్చారు. జిందాల్ బాక్సైట్ తవ్వకాలపై అరకు, అనంతగిరిలలో తీవ్ర నిరసన, ఆందోళనలు జరుగుతుండగానే ఇతరచోట్ల తవ్వకాలకు ఒప్పందాలు జరిగాయి.

చింతపల్లి మండలంలోని జెర్రల, గాలికొండ, బలపల, సప్పర్ల, గుమ్మిరేవుల ప్రాంతాల్లోని బాక్సైట్ నిల్వలను వెలికి తీయాలని ఎ.పి.ఎం.డి.సి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్ (యు.ఎ.ఇ) సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈమేరకు రాజశేఖర్ రెడ్డి సమక్షంలో పరిశ్రమల, వాణిజ్యశాఖ కార్యదర్శి, యు.ఎ.ఇ సంస్థ అధినేతలు సంతకం చేశారు. ఈ ఒప్పందం ద్వారా 1300 హెక్టార్ల విస్తీర్ణంలో వున్న 224 మిలియన్ టన్నుల బాక్సైట్ ఖనిజం అరబ్ దేశానికి చెందిన ఈ ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం అవుతుంది. ఈ బాక్సైట్‌ను శుద్ధి చేసి అల్యూమినియం తయారు చేసేందుకు పరిశ్రమ కొరకు స్థలాన్ని కూడా కేటాయించారు. నర్సీపట్నంకు సమీపంలోని మాకవరం పాలెంలో 2600 ఎకరాలలో అల్యూమినియం పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడికి చింతపల్లి ప్రాంతం నుండి వెలికితీసిన బాక్సైట్‌ను జి.కె వీధి మీదుగా పైప్‌లైన్ ద్వారా పంపిస్తారు. ఈ పరిశ్రమ ద్వారా వేలాది మంది జీవితాలు నిరాశ్రయం కానున్నాయి. ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారు.

ఇంకా గూడెం కొత్తవీధి మండలంలో, కాంటం రాజుల కొండలో మిగిలిన బాక్సైట్ నిక్షేపాల కోసం ఎస్సార్ (ఇ.ఎస్.ఎస్.ఎ.ఆర్), గుజరాత్ కంపెనీ, ఇతర బహుళజాతి కంపెనీలు పోటీ పడుతున్నాయి.

ఒక క్రమంలో మన్యంలోని బాక్సైట్ ఖనిజాన్ని సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు దారాధత్తం చేయడాన్ని, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ మిలిటెంట్ పోరాటాలు చేపడుతున్నారు.

## బాక్సైట్ ఉద్యమంలో వివిధ ధోరణులు - రాజకీయ పార్టీల వైఖరి

బాక్సైట్ మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ విశాఖ ఏజన్సీలోని పదకొండు మండలాలలో ప్రజా ఉద్యమాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. ఈ ఉద్యమాలు కొన్నింటిలో రాజీ ధోరణులు చోటు చేసుకుంటున్నాయన్న వాస్తవాన్ని విస్మరించలేము. పరిశ్రమలు స్థాపిస్తే మన వాళ్లకే ఉద్యోగాలు ఇప్పించుకోవచ్చు, జిందాల్ కంపెనీకి ప్రతినిధులుగా మనమే చెలామణి కావచ్చు, సహకార సంఘాలు స్థాపిస్తే వాటిని మన గుప్పెట్లో పెట్టుకోవచ్చు అని రాజకీయ దళారుల ఆలోచనలు సాగుతున్నాయి. లక్ష మందికి పైగానే నిర్వాసితులు తేలారు కాబట్టి వారికి ఆకర్షణీయమైన సహాయ, పునరావాస ప్యాకేజీని సంపాదించి పెడతామనే ఒక వర్గం బయలుదేరింది. ఈ వర్గం ప్యాకేజీ బాగుంటే మైనింగ్‌కు అభ్యంతరం లేదంటున్నది. పరిమిత స్థాయిలో మైనింగ్ జరిగితే అభ్యంతరం లేదని మరో వర్గం అంటున్నది. పెట్టుబడిదారులు ఒకసారి కాలుమోపితే వాళ్ల విస్తరణకు ఎలాంటి హద్దులు ఉండవని ప్రపంచీకరణ అనుభవం రుజువు చేస్తున్నది.

స్వచ్ఛంద సంస్థలు కొన్ని అనుకూలంగా కొన్ని వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. వ్యతిరేకించే స్వచ్ఛంద సంస్థలు కేవలం ప్రచారానికి పరిమితమై ప్రజల్ని పోరాటం నుంచి పక్కదారి పట్టిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో అధికారంలో వున్న ప్రభుత్వాన్ని ఎదుర్కొని ఎన్నికల్లో గెలవడానికి ప్రతిపక్షాలు మిలిటెంట్ పోరాటాలు తీసుకోవాల్సిన రాజకీయ స్థితి నెలకొన్నది. ప్రజా సమస్యలపట్ల తమ వైఖరి అనేది ఎన్నికలున్నపుడు ఒకతీరుగా, ఎన్నికలు లేనపుడు ఒక తీరుగా కొనసాగడం మామూలు విషయమే. బాక్సైట్ విషయంలో మొదటి నుండి ఏ పార్టీ నోరు మెదపలేదు. పంచాయితీ ఎన్నికలు దగ్గర పడడంతో, ప్రజలు నిలదీయడంతో సి.పి.ఐ, సి.పి.ఎం బాక్సైట్‌ను జిందాల్ కంపెనీకి ఇవ్వడాన్ని వ్యతిరేకించాయి, వివిధ పునరావాసాలను డిమాండ్ చేశాయి. వీటిని అమలు జరిపితే బాక్సైట్ తవ్వకాలు జరుపుకోవచ్చనేదే. చివరికి పంచాయితీ ఎన్నికల్లో ఓటు కొరకు తెలుగుదేశం కూడా జిందాల్ కంపెనీకి ఇవ్వడాన్ని వ్యతిరేకించింది.

అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడే కొద్ది సి.పి.ఐ, సి.పి.ఎంలు ఓటు కొరకు మిలిటెంట్ పోరాటాలు జరపవచ్చు. టి.డి.పి కూడా గొంతు కలుపవచ్చు. అధికారంలో వున్న దగ్గర, వున్నప్పుడు ఒక వైఖరి, లేనప్పుడు ఒక వైఖరి అవలంబించే ద్వంద్వ వైఖరి వీటిది. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని తప్పక గ్రహిస్తారు.

**పునారావాసం కాదు మా అడవిపై హక్కు కావాలి**

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మొదటి నుండి రాజీ లేకుండా సాయుధంగా పోరాడుతున్నది ఆదివాసీలే. బ్రిటీష్ కాలంలో దేశవ్యాపితంగా పోరాటాలు జరిగాయి. మన్యంలో 1800లో రంప తిరుగుబాటు, 1879లో ద్వారా బంధాల చంద్రయ్య తదితరుల నాయకత్వంలో తిరుగుబాటు, 1922-24 మధ్య కాలంలో అల్లూరి నాయకత్వంలో జరిపిన పోరాటాలు బ్రిటీష్ సామ్రాజ్యవాదులను బెంబేలెత్తించాయి. 70లలో కొనసాగిన శ్రీకాకుళ సాయుధ పోరాట నేపథ్యంలో పాలకవర్గాలు 1/70 చట్టాన్ని రూపొందించాయి. అప్పటి నుండి ప్రభుత్వం ఈ చట్టానికి తూట్లు పొడుస్తూనే సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రయోజనాలను నెరవేరుస్తూ, నేడు 'ప్రపంచీకరణ'కు దారులు తెరిచింది. సమసమాజ స్థాపన కొరకు, అడవిపై అధికారం కొరకు 1980 నుండి మావోయిస్టు పార్టీ నేతృత్వంలో సాయుధ పోరాటం కొనసాగుతోంది. సాయుధ పోరాటంలో బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని జోడిస్తూ విస్తృతంగా ప్రచార కార్యక్రమం తీసుకున్నది. పలు గ్రామాల్లో బాక్సైట్ వ్యతిరేక మిలీషియాను నిర్మిస్తూ ప్రజల్ని మిలిటెంట్ పోరాటాల వైపుగా కదిలిస్తున్నది. బంద్‌లు, రాస్తారోకోల ద్వారా ప్రజలను సమీకరించింది. గనుల శాఖ, ఇతర అధికారులు సర్వే కోసం వస్తే మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు అడ్డుకుని నిరసన తెల్పుతున్నారు. మే 27, (2007) గనుల శాఖ అధికారులు బాక్సైట్ సర్వే కొరకు జెర్రెల ప్రాంతంకు రాగానే ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం నాయకత్వంలో ప్రజలు అడ్డుకుని, బాక్సైట్ తవ్వకాల పట్ల తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. ఆ అధికారుల బృందాన్ని తిప్పి పంపారు. ఉద్యమ ప్రాంతంలో వివిధ వర్గాల ప్రజలతో ఐక్య సంఘటన ఏర్పడి వివిధ కార్యకలాపాలు చేపడ్తున్నారు.

పాడేరు, అరకు, అనంతగిరి, చింతపల్లి తదితర కేంద్రాల్లోని ఉద్యోగస్తులు, మేధావులు, విద్యార్థులు, వివిధ సంఘాలు కలిసి బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్య వేదికగా ఏర్పడ్డారు. వాజేడు, చింతపల్లి, అరకు తదితర సెంటర్స్‌లో వేలాది మందితో సెమినార్లు, బహిరంగ సభలు నిర్వహించారు. వీటిపై పోలీసులు ప్రయోగిస్తున్న నిర్బంధాన్ని ఎదిరిస్తూ మరింతగా సంఘటితమవుతున్నారు.

ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానాలకూ, ప్రత్యేక ఆర్థిక మండలాలకు వ్యతిరేకంగా, బాక్సైట్ తవ్వకాల వల్ల నిర్వాసితులయ్యే ప్రజలు పెద్ద ఎత్తున కదులుతున్నారు. ఈ ఉద్యమాలను సాయుధ పోరాటంతో సమైక్యం చేస్తూ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం. ప్రపంచబ్యాంకు ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, నిర్వాసితుల సమస్యకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలతో విశాలమైన ఐక్య సంఘటన నిర్మించి, నీరు, అడవి, భూమిపై ఆదివాసీలకే అధికారం నినాదంతో ఆదివాసీ స్వయం ప్రతిపత్తి సాధనకై ఉద్యమాన్ని నిర్మిద్దాం.

★

---

*(....17 వ పేజీ తరువాయి)*

వివిధ వ్యవసాయ రుణాలను మంజూరు చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో ఆర్థికవాద ధోరణిని పెంచుతున్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు వేయి రూపాయల చొప్పున జీతం ఇస్తున్నారు. డివిజన్ వ్యాప్తంగా చేపడుతున్న ఈ అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలకు నాబార్డ్, ప్రపంచ బ్యాంక్, నిధులను ఖర్చు పెడుతున్నారు. ఈ కార్యక్రమాలు చెక్కర పూసిన విషపు గుళికలుగా పని చేస్తూ ప్రజల్లో ఒక సెక్షన్‌ను విప్లవోద్యమానికి వ్యతిరేకంగా నిలబెడుతున్నాయి. ఇంకోవైపు ఈ పథకాల నిధులు దుర్వినియోగమవుతూ అనేక మంది అవినీతిపరులుగా తయారవుతున్నారు. ఈ కార్యక్రమాలు అక్రమ మార్గంలో సంపాదనకు గ్రామ, మండల, జిల్లా స్థాయి రాజకీయ నాయకులకు, కాంట్రాక్టర్లకు, ప్రభుత్వ అధికారులకు బంగారు గుడ్డు పెట్టే బాతుల్లా పని చేస్తున్నాయి.

ఈ విధంగా పాలకవర్గాలు విప్లవోద్యమంపై రకరకాల అణచివేత రూపాలను ప్రయోగిస్తున్నాయి.

★

# అదిలాబాద్ - నిజామాబాద్ డివిజన్లో తీవ్రమైతున్న నిర్బంధం

అదిలాబాద్ - నిజామాబాద్ ఉమ్మడి డివిజన్ విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి ఈ రెండు జిల్లాల పాలనాధికారులు ఎల్.ఐ.సి ఎత్తుగడలను వేగంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇన్‌ఫార్మర్ నెట్ వర్క్‌ను, ప్రత్యేక పోలీసు అధికారుల (ఎస్.పి.ఒ) వ్యవస్థను నిర్మాణయుతం చేసుకున్నారు. పూర్తికాలం కార్యకర్తలు విప్లవోద్యమం నుంచి లొంగిపోయేలా సంబంధిత కుటుంబాలపై వత్తిడి కొనసాగిస్తున్నారు. మరోవైపు పార్టీ నుంచి ప్రజలను దూరం చేయడానికి ఐటిడిఎ, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కోట్లాది రూపాయలను కేటాయించి అమలు చేస్తున్నారు. ఒకవైపు పార్టీపై దుష్ప్రచారం సాగిస్తూనే మరోవైపు ఖచ్చితమైన సమాచారం ఆధారంగా దళాలపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు.

యువతకు ఉపాధి కల్పించే పేరిట డివిజన్‌లో నిరుద్యోగ యువతీ, యువకులను ఎస్.పి.ఒ వ్యవస్థలో రిక్రూట్ చేసుకున్నారు. ఒక్క అదిలాబాద్ జిల్లాలోనే సుమారు 600 మందిని ఈ విధంగా రిక్రూట్ చేసుకున్నారు. ఒక ఐ.పి.ఎస్ అధికారి నేతృత్వంలో ఈ 600 మందిని 6,7 బ్యాచ్‌లుగా చేసి 2 నుండి 6 నెలల వరకు ట్రైనింగ్ ఇచ్చారు.

ట్రైనింగ్‌లో డ్రిల్, వివిధ పొజిషన్స్, వివిధ తుపాకుల ఫైరింగ్, దళం యాక్షన్ చేస్తే తప్పించుకోవడం, యాక్షన్ టీంలు దాడి చేస్తే తప్పించుకోవడం, దళంపై దాడి చేయడం, తుపాకులు గుంజుకోవడం, దళ సెంట్రీపై దాడి చేయడం, సెంట్రీలు చేయడం, ఎన్‌కౌంటర్లలో పాల్గొనడం వంటి అంశాలు నేర్పారు. ఈ ట్రైనింగ్‌లో నక్సలైట్లు ప్రజావ్యతిరేకులు, అభివృద్ధి నిరోధకులు అంటూ విషపూరితమైన బోధనలు చేసారు.

ఎస్.పి.ఒలుగా చేరిన కొందరు పోలీస్ స్టేషన్లలో హోంగార్డులుగా పని చేస్తారు. కొందరు తమకు నిర్ణయించిన గ్రామాల్లో ఇన్ఫార్మర్లను తయారు చేస్తారు, సమాచారం సేకరిస్తారు. కొందరు గ్రామాల్లోనే తమ తమ వృత్తులు చేసుకుంటూ దళ సమాచారాన్ని రహస్యంగా సేకరించి వాళ్లు నిర్దేశించుకున్న చోట చేరవేస్తారు. దళానికి సహకరించే వారి పేర్లను సేకరిస్తారు. కొందరు గ్రామాల్లోనే వుంటూ, దళం గ్రామానికి పోయినపుడు దళం వచ్చిందని గ్రామమంతా ప్రచారం చేస్తారు. కొందరు అడవిలో కర్రలేరుకునే పేరిట, షికార్‌పేరిట, పశువుల - మేకల కాపర్ల పేరిట తిరుగుతూ మకాంలు చూస్తారు. ఈ మకాంలు చూసిన వారు స్పెషల్ బ్యాచ్‌ల కమాండర్లకే రిపోర్ట్ చేస్తారు. మకాంల రెక్కీలకు ఒకరిద్దరు పోలీసులను సివిల్‌లో తీసుకొచ్చి చూపెడతారు.

కొందరు స్పెషల్ బ్యాచ్‌లకు పైలెట్స్‌గా వుంటూనే దాడులల్లో కూడా పాల్గొంటారు.

కొందరు వి.ఐ.పిల ప్రోగ్రాంలు, ఎన్నికలప్పుడు బందోబస్తు డ్యూటీలు చేస్తారు.

ఈ ఎస్.పి.ఒలకు వారి వారి కర్తవ్యాలను బట్టి నెలకు 1500 నుంచి 4 వేల రూపాయల వరకు జీతం ఇస్తున్నారు. కొంతమందిని గ్రామాల్లో డాక్టర్లుగా, టీచర్లుగా, దుకాణాదార్లుగా, పట్టణాల్లో ఎస్.టి.డి దారులుగా వివిధ చిల్లర వ్యాపారస్తులుగా సెటిల్ చేసారు. ఇలా ఒకే గ్రామంలోనే వివిధ కర్తవ్యాలు నిర్వర్తించే ఎస్.పి.ఒలు ఒకరితో మరొకరికి పరిచయాలు వుండవు. ఎవరికి వారు వ్యక్తిగతంగా పని చేయాలి. ఈ ఎస్.పి.ఒల వ్యవస్థ ద్వారా డివిజన్‌లో ఇప్పటికే భారీ నష్టాన్నే చవిచూసాం. 2005 నవంబర్, డిసెంబర్‌లలో జరిగిన జోగాపూర్, ఆవుడం నష్టాలకు ఎస్.పి.ఒ వ్యవస్థనే ముఖ్య పాత్రను పోషించింది. అలాగే 2006 అక్టోబర్‌లో కేరిగూడ ఫైరింగ్ తర్వాత జరిగిన అరెస్టులకు కూడా ఇదే కారణమని అవగతమవుతున్నది. సమాచారం చేరవేతలో సెల్‌ఫోన్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ ఎస్.పి.ఒ వ్యవస్థనే నేడు కీలకమైన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌గా పని చేస్తున్నది.

పోలీసులు తమ అణచివేతలో భాగంగా మాజీలను కూడా విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. విప్లవ చేవచచ్చి శత్రు కాళ్ల ముందు మోకరిల్లిన కొందరు మాజీలు ప్రతీఘాతుక విప్లవ చర్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా బట్టి రాజన్న (ప్రభాకర్), అమృత్, జంగ్, సోము, కిషోర్, బెల్లంపల్లి కొంరన్న, జగన్‌లు స్పెషల్ బ్యాచ్‌లతో వుంటూ దాడులల్లో పాల్గొంటున్నారు. బ్యాచ్‌లకు దారులు, డెన్‌లు, నీటి తావులు చూపెట్టడం, గ్రామాల్లో సహకరించే వారి పేర్లు చెప్పడం చేస్తూ విప్లవ వ్యతిరేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ద్రోహి అమృత్ మూలంగానే 2006 అక్టోబర్‌లో కేరిగూడ ఎన్‌కౌంటర్ జరిగి డిసిఎం కామ్రేడ్ పద్మను నష్టపోయాం. ఈ ఎన్‌కౌంటర్ అనంతరం నెల రోజులు కొనసాగిన శత్రు విస్తృత కూంబింగ్‌లలో వీరు చురుకుగా పాల్గొన్నారు. అమృత్ సింగాపూర్ ఏరియా నుండి పారిపోయిన వెంటనే సరెండరై పోలీసులను తీసుకొచ్చాడు. అప్పుడు దళం మొత్తం మలేరియా, టైఫాయిడ్, కలరా, చికెన్‌గున్యా బారినపడి

వున్నారు. అయితే ప్రజల సహకారంతో భారీ ప్రమాదం నుండి దళం తృటిలో తప్పించుకోగలిగింది. ఈ వరుస క్రమంలోనే కేరిగూడ ఎన్‌కౌంటర్ జరిగింది.

పూర్తికాలం కార్యకర్తలను సరెండర్స్ చేయించడానికి సంబంధిత కుటుంబ సభ్యులపై సామ, దాన, భేద దండోపాయాలను శత్రువు ప్రయోగిస్తున్నాడు. కుటుంబ సభ్యులకు వైద్య చికిత్స చేయించడం, బియ్యం, బట్టలు పంచడం, వారికేమైన సమస్యలు వుంటే పరిష్కరించడం, చేస్తూ కుటుంబాలను విప్లవానికి వ్యతిరేకంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

'జిల్లాలో పార్టీ అంతా దెబ్బతిన్నది,' ఎవరూ లేరు, అంతా పది, పదిహేను మంది మాత్రమే వున్నారు. ఉన్నవారు సైతం లొంగిపోవాలి, లేకుంటే ఎన్‌కౌంటర్ల పాలవుతారని' జిల్లా ఎస్.పి పత్రికా ప్రకటనలు ఇస్తున్నాడు. మరోవైపు నాయకత్వంపై దుమ్మెత్తి పోస్తూ దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులను అరెస్టు చేసి తప్పుడు కేసులు బనాయిస్తూ దుర్మార్గపు దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. డివిసిఎం కామ్రేడ్ బండి ప్రకాష్ తన భార్య, నలుగురు దళ సభ్యులను తుపాకులతో సహా తీసుకొని పారిపోయాడనీ, 50 లక్షల రూపాయలను కూడా ఎత్తుకొని పోయాడని ఎన్‌టి ఎస్.జడ్.సి అధికార ప్రతినిధి రఘు పేరిట ఎస్.ఐ.బి పోలీసులే పత్రికా ప్రకటననిచ్చారు. దీనిని డివిసి సకాలంలో తిప్పికొట్టడంతో వాళ్ల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. అలాగే నిజామాబాద్ నుండి వచ్చిన ఫండ్స్‌ను ఎన్.జడ్.సికి పంపిస్తున్న క్రమంలో ద్రోహంతో అరెస్టులు జరిగాయి. ఇక ఈ డబ్బులను సాకుగా చూపెట్టి డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సాగర్ (ఎన్‌జడ్‌బిలో వెంకటేష్) తన చిన్న బిడ్డ పెండ్లి కోసం బీడి యజమానుల వద్ద చందాలు వసూలు చేసి పంపుతుంటే పట్టుకున్నట్లుగా డిఐజి అంజనీకుమార్ నేతృత్వంలో దుష్ప్రచారాన్ని కొనసాగించారు. కార్యదర్శి బావమరిదిని అరెస్టు చేసి, హింసించి, ఈ అక్రమ కేసు మోపి జైలుకు పంపారు. వీరితో పాటు ఈ చందాల దందాలో సాగర్ భార్యకు కూడా సంబంధాలు వున్నాయని పోలీసు అధికారులు ప్రకటించి, ఇంటిపై దాడులు చేస్తూ తీవ్రంగా వేధించారు. ఈ కేసులో మొత్తంగా నలుగుర్ని అరెస్టు చేసారు. చెన్నూర్ ప్రాంతంలోని వేమనపల్లి మండల మాజీ ఎం.పి.పి దుర్గం శివరాం (టిడిపి)ను గ్రామ కక్షలతో చంపివేసి మేమే చంపాం అని స్థానిక కమాండర్ సంతోష్ (ఈ పేరు జిల్లాలో లేదు) పేరిట హంతకులు ప్రకటన ఇచ్చారు. దీనిని డివిసి ఖండించి, ఆ హత్యతో మాకు సంబంధం లేదు అని స్పష్టం చేస్తే కాలు కాలిన కోతిలా మంచిర్యాల ఎఎస్‌పి ఇది మావోయిస్టుల పనే - అభాసుపాలు అవుతారనే భయంతో ఈ ప్రకటన ఇచ్చారని మాట్లాడాడు. ఈ ప్రకటన చూస్తే ఈ హత్యలో పోలీసుల హస్తం వున్నదనే అనుమానం వస్తున్నది. అయితే దీన్ని లోతుగా పరిశీలించాల్సి వుంది.

అరెస్టులు కూడా తీవ్రతరమయ్యాయి. నిజామాబాద్‌లోని సిర్నాపల్లి ప్రాంతంలో పాత మందు పాతరలను తీసి నలుగురు యువకులను అరెస్టు చేసారు. ఎల్లారెడ్డి ప్రాంతంలో 11 మందిని అరెస్టు చేసారు. చర్చల కాలంలో స్థూపాలు కట్టారని, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారని హింసించి అక్రమ కేసులతో జైలుకు పంపారు.

అదిలాబాద్‌లో మంగి ప్రాంతంలో కేరిగూడ ఎన్‌కౌంటర్ తర్వాత వందలాది బలగాలు మాజీల సహకారంతో విస్తృత కూంబింగ్ నిర్వహించాయి. గోపెరలో నలుగుర్ని అరెస్టు చేసి తీవ్రంగా హింసించి ఇద్దర్ని వదిలేసి, మరో ఇద్దరిపై అక్రమ కేసులు మోపి జైలుకు పంపారు. కేరిగూడ, దంపూర్, రాఘవపూర్, పాతగూడ, టొక్కిగూడ గూడాలల్లో పశువుల కాపర్లను, ప్రజలను కొట్టారు, భయాందోళనలకు గురి చేసారు. చేండ్లు, చెలకలు విస్తృతంగా గాలించారు.

డివిజన్‌లో పార్టీ నుంచి ప్రజలను దూరం చేయడానికి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారు. దెబ్బతిన్న నిజామాబాద్ జిల్లా ఉద్యమం పునర్నిర్మాణం కాకుండా చేయడానికి తీవ్రంగా కృషి సల్పుతున్నారు. రోడ్లు, ప్రాజెక్టులు, వ్యక్తిగత రుణాలను ఇస్తూ ప్రజల్లో ఆర్థికవాద ధోరణిని పెంపొందిస్తున్నారు. ఉపాధి హామీ పథకం, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి శాఖలు మరియు జడ్‌పి నిధుల నుంచి పెద్ద ఎత్తున ఖర్చు పెడుతూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్క కామారెడ్డి రెవెన్యూ డివిజన్‌కే రూ.270 కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మొదలుపెట్టారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అదిలాబాద్‌లో ఐటిడిఎ, జిసిసి, గ్రామీణాభివృద్ధి శాఖ, జడ్.పి నిధులు మరియు ఉపాధి హామీ పథకాన్ని విస్తృతంగా చేపడుతున్నారు. ఉపాధిహామీ పథకాల అమలుపై ఒక్కో గ్రామ పంచాయితీ పరిధిలో గ్రామ జనాభాను బట్టి 3 నుంచి 5 గురు స్థానిక యువకులను ఫీల్డ్ అసిస్టెంట్స్‌గా నియమించుకొన్నారు. వీరి ద్వారా చెట్లు నాటించడం, అడవిలో గుంతలు తవ్వించడం,

*(తరువాయి 15వ పేజీలో.....)*

# ఆఫ్రికా ఖండం సూడాన్ దేశం డార్‌ఫర్‌లో ఏం జరుగుతున్నది

సూడాన్‌లో ఐక్యరాజ్య సమితి బలగాలను ఆమోదించడానికి 2007 జనవరి 1వ తేదీ తుది గడువుగా అమెరికా నిర్ణయించింది. 2005లో నైజీరియాలో ఒపెక్ హెడ్‌క్వార్టర్స్‌లో చేసిన శాంతి ఒప్పందం అమలును సరి చూడడానికి ప్రస్తుతం ఉన్న 53 సభ్యుల ఆఫ్రికా యూనియన్ వారి ఏడు వేల బలగం స్థానంలో ఇరవై వేల ఐక్య రాజ్య సమితి బలగాలను అనుమతించమని ఒత్తిడి చేస్తున్నది. సూడాన్ దీన్ని గట్టిగా వ్యతిరేకించడంతో ఈ తీర్మానం అమలు కాలేదు. చివరికి నాలుగు వేలకు పైగా ఆఫ్రికా బలగాలను పంపాలని రాజీకి వచ్చారు. ఇరాన్, సిరియా, ఉత్తర కొరియా, ఇప్పుడు సూడాన్‌లు అమెరికా లక్ష్యాలుగా ఉన్నాయి.

దేశస్తులు ఉన్నారు. ఇందులో వివిధ ఆదివాసీ గ్రూపులు ఉన్నాయి. అనేక ఆఫ్రికా రాజ్యాల మాదిరిగానే సూడాన్‌లో కూడా అంతర్యుద్ధాలు జరిగాయి. వివిధ జాతులు స్వయం నిర్ణయాధికార హక్కు కోసం పోరాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. గతంలో కూడా ఆగ్నేయ, పశ్చిమ ప్రాంతాలలో కూడా తిరుగుబాటులు జరిగాయి. దక్షిణాన అంతర్యుద్ధం కూడా తిరిగి వచ్చింది. ప్రభుత్వ వ్యతిరేక యుద్ధంలో ప్రధానంగా పాలు పంచుకున్నది సూడాన్ ప్రజా విముక్తి సైన్యం. ఇది సూడాన్ ప్రజా విముక్తి ఉద్యమ సాయుధ విభాగం. దీని నాయకుడు జాన్ గరాంగ్.




## సూడాన్ వైఖరి

ఐక్య రాజ్య సమితి నేతృత్వంలో ఉన్న అంతర్జాతీయ బలగం వస్తే అది వలసవాదానికే దారి తీస్తుందని ఖార్‌టౌం అంటూ వచ్చాడు. డార్‌ఫర్‌లో ఆఫ్రికా యూనియన్ బలగాలు కొనసాగాలని సూడాన్ అధ్యక్షుడు ఒమర్ హసన్ అల్ బషీర్ అన్నాడు. ఆఫ్రికా బలగం ఐక్య రాజ్య సమితి బలగంగా మారడానికి మేం వ్యతిరేకం అన్నాడు.

## సూడాన్ చరిత్ర, తిరుగుబాటులు

సూడాన్ ఆఫ్రికాలో నాలుగు కోట్ల బహుళ జాతి ప్రజలు ఉన్న అతి పెద్ద దేశం. అమెరికాలో నాలుగింట ఒక వంతు ఉంటుంది. ఫ్రాన్స్ పరిమాణంలో ఉంటుంది. సూడాన్‌లో అరబ్‌లు, నల్ల ఆఫ్రికా ఆదివాసులూ కలిసి ఉంటారు. 39 శాతంగా ఉన్న అరబ్‌లు అధికారంలో ఉన్నారు. 52 శాతం నల్ల ఆఫ్రికా

స్వయం నిర్ణయాధికార హక్కు కోసం దక్షిణ తిరుగుబాటుదారులు ఇరవై ఒక్క సంవత్సరాలుగా చేస్తున్న సాయుధ పోరాటాన్ని వారిని ప్రభుత్వంలోకి తీసుకోవడం ద్వారా నిలిపివేసారు. ఆరు సంవత్సరాల తరువాత సూడాన్ నుంచీ విడిపోయే విషయం మీద అభిప్రాయ సేకరణ చేస్తారు. అల్పసంఖ్యాక జాతులు, ఆదివాసీ గ్రూపులను సూడాన్ ప్రభుత్వం సైనిక శక్తితో క్రూరంగా అణిచివేసింది. జంజావీద్ (సల్వా జుడుం మాదిరిగా) వంటి అరబ్ మిలీషియాలను పెంచారు. వీరు ప్రభుత్వ బలగాలతో సహా వేలాది మంది డార్‌ఫర్ ఆదివాసులను చంపేసారు. ఇరవై ఐదు లక్షల మంది సరిహద్దు దాటి పొరుగున చాద్‌కు పారిపోయారు. వీరు ఇప్పుడు అమానవీయ పరిస్థితులలో శరణార్థ శిబిరాలలో ఉన్నారు. జంజావీద్ గూండాల నుంచీ హత్యా అత్యాచారం అన్ని రకాల దాడులనూ ఎదుర్కొంటున్నారు.

## డార్ఫర్ తిరుగుబాటు నేపథ్యం

డార్ఫర్ సూడాన్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతం. 80 శాతానికి పైగా ప్రజలు ప్రధానంగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మీద ఆధారపడి ఉన్నారు. 2000 నుంచీ సూడాన్ చమురును ఎగుమతి చేస్తున్నది. చమురు వ్యాపారంలో చెప్పుకోతగ్గ లాభాలు సంపాదించింది. పొరుగున ఉన్న చాద్‌లో విస్తృతమైన చమురు నిలువలు ఉన్నాయి. డార్ఫర్‌లో కూడా విశాల చమురు నిలువలు ఉన్నాయని అంచనా. సూడాన్‌లో చాలా తక్కువ ఖనిజ వనరులు ఉన్నాయి.

సూడాన్‌కు పశ్చిమాన ఉన్న రాష్ట్రం డార్ఫర్. లిబియా, చాద్‌లకు సరిహద్దులో ఉన్నది. విశాల, అత్యధిక జనాభా ఉన్న ప్రాంతం. వర్షపాతాన్ని బట్టి జనం ఇక్కడకు రావడం, పోవడం చేస్తుంటారు. నల్ల ఆఫ్రికా ఫర్ తెగ జనాభాలో సగంగా ఉన్నారు. అందుకనే ఈ ప్రాంతానికి డార్ (ఇల్లు)ఫర్ అన్న పేరు వచ్చింది. ఇది కాక మరో 15 వివిధ భాషా జాతులు ఉన్నాయి. అందరూ సున్నీ ముస్లిములు.

17వ శతాబ్దం మధ్య కాలంలో ఈ ప్రాంతంలో కాయ్‌రా స్వతంత్ర సుల్తానేట్ ఉండేది. 1916లో ఇది అంతిమంగా ఆనాటి ఆంగ్లో ఈజిప్షియన్ సూడాన్‌కు అప్పగించారు.

1991లో ఫర్ జాతికి చెందిన ముస్లిం సంస్థ కార్యకర్త డాద్ బోలాద్, మొదట బషీర్ ప్రభుత్వాన్ని సమర్ధించాడు. ఆ తరువాత వారు నిర్లక్ష్యం చేయడంతోనూ అరబ్‌ల ఆధిపత్యం మీదనూ తిరుగుబాటు చేసాడు. అతన్ని ఓడించి చంపేసారు. డార్ఫర్‌లో ప్రజల చైతన్యానికి ఈ తిరుగుబాటు ఒక మూలమలుపు.

## తిరుగుబాటు నిర్బంధం

ఉత్తర డార్ఫర్‌లోనూ పశ్చిమ, దక్షిణ డార్ఫర్‌లోనూ పదే పదే కరువులు వచ్చాయి. అడపా దడపానే పడే వర్షాల వల్లా, పురుగుల మందులూ వ్యవసాయ పరికరాలూ లేకపోవడం వల్ల పంటలు ఊహించరానంత తక్కువగా పండాయి. గడ్డి, నీరూ లేక పశువులు నశించిపోయాయి.

సామాజికంగా ఆర్థికంగా వెనుకబడి ఉండడం ఈ సంఘర్షణకు దారి తీసింది. పరాయీకరణ వల్ల స్వయం నిర్ణయాధికారం కోసం పోరాటాలు వస్తున్నాయి.

ప్రస్తుత సంఘర్షణ 2003 ఫిబ్రవరిలో ప్రారంభమయింది. ఇది త్వరలోనే విస్తృతమైన గెరిల్లా యుద్ధంగా పెంపొందింది. ఏప్రిల్ 25వ తేదీన గెరిల్లా పోరాటం తీవ్రతరమయింది. ఎస్ఎల్ఎం తిరుగుబాటుదారులు రాష్ట్ర రాజధాని ఎల్ ఫాషర్‌లో దాడి చేసి 72 మందిని చంపేసారు. నాలుగు విమానాలను ధ్వంసం చేసారు. గారిజన్ కమాండర్ జెనరల్ ఇబ్రహీం బుష్రాను అదుపులోకి తీసుకున్నారు.

ఖార్‌టౌం బలగాలకు వ్యతిరేకంగా రెండు తిరుగుబాటు గ్రూపులు పని చేస్తున్నాయి. ఒకటి సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్ (సూడాన్ విముక్తి ఉద్యమం - ఎస్.ఎల్.ఎం). ఇది చాలా వరకూ ఫర్, మసాలీత్ తెగల మీద ఆధారపడి ఉంది. రెండో తిరుగుబాటు గ్రూపు జస్టిస్ ఎండ్ ఈక్వాలిటీ మూవ్‌మెంట్ (న్యాయ, సమానత్వ ఉద్యమం - జీ.ఈ.ఎం). ఇందులో చాలావరకూ జఘవా తెగ ప్రజలు ఉన్నారు. ఈ రెండింటిలో ఎస్.ఎల్.ఎం ప్రధాన, అతి శక్తివంతమైన గ్రూపు. ఎస్.ఎల్.ఎం సూడాన్ విడిపోయే హక్కు కోసం ఉద్యమిస్తున్నది. మిని అర్కోయ్ మినావీ నేతృత్వంలో నడిచే సూడాన్ విముక్తి సైన్యం 'ఐక్య, ప్రజాస్వామిక సూడాన్ సృష్టించడం కోసం' పోరాటం చేస్తున్నామని చెప్పుకుంటున్నది.

ప్రభుత్వ బలగాలు ప్రజల మీద మరింత హింసాత్మక దాడులతో స్పందించాయి. నివాసాలు లేని జెబెల్ మారా కొండ వాలుల మీద గెరిల్లాలు శిబిరాలు ప్రారంభించారు. దీంతో అనేక మంది భర్తీ అయ్యారు. ఈ పరిస్థితిని అదుపు చేయలేక సూడాన్ ప్రభుత్వం ఎం.ఐ 24 యుద్ధ హెలికాప్టర్‌లతో వైమానిక శక్తిని అమలు చేసింది. పెద్ద ఎత్తున గూండాలనూ జంజావీద్‌లనూ భర్తీ చేసుకుంది. జంజావీద్ నిర్దాక్షిణ్యంగా ప్రజలను ఊచకోత కోసింది.

ఒక అంచనా ప్రకారం ముప్ఫై వేల మంది మరణించారు. రాష్ట్రంలో పది లక్షల మంది నిరాశ్రయులయ్యారు. లక్షా ఇరవై వేల మంది పొరుగున చాద్‌కు పారిపోయారు. ఈ యుద్ధం మౌలికంగా నల్ల ఆఫ్రికా తిరుగుబాటుదారులకూ ఖార్‌టౌం ప్రభుత్వమూ వారి స్థానిక ఏజెంటులయిన జంజావీద్‌కూ మధ్య జరిగింది. అరబ్ ఆధిపత్యం, ఆఫ్రికా ప్రజల పట్ల నిర్లక్ష్యం ఈ తిరుగుబాటుకు కారణం. ముస్లిం ఉత్తర ప్రాంతంలో విధేయమైన భాగంగా ఉన్నప్పటికీ డార్ఫర్‌లో ప్రాథమిక సౌకర్యాలు లేవు. విద్యా ఆర్థిక రంగాలలో దక్షిణాన క్రిష్టియన్ ప్రాంతంలో మాదిరిగానే అభివృద్ధి సరిగా లేదు. జీవనం విధ్వంసం చేయడం సూడాన్ ప్రభుత్వం అనుసరించిన మరో ఎత్తుగడ. బావులలో విషం కలిపారు. పశువులను చంపారు. ఆహార దుకాణాలను ధ్వంసం చేసారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున నిర్వాసితులయ్యారు. పొరుగున చాద్‌కు వలస వెళ్లారు. డార్ఫర్‌లో దాదాపు రెండు వేల గ్రామాలు విధ్వంసమయ్యాయి. హింసా, అనారోగ్యాల వల్ల దాదాపు నాలుగు లక్షల మంది చనిపోగా 25 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

## సామ్రాజ్యవాదుల ఆటలు

ఆఫ్రికాలో వలస, యుద్ధ చరిత్ర అంతటా సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ఈ సంఘర్షణలను వాడుకున్నారు. అమెరికా ఇందుకు మినహాయింపు కాదు.

ఇరాక్ చమురు మాదిరిగానే సూడాన్ చమురు కూడా అమెరికాకు సూడాన్ మీద ఆసక్తి ఉండడానికి కారణం. ఆఫ్రికాలో మూడో అతి పెద్ద చమురు ఉత్పత్తి చేసే దేశం సూడాన్. ఏదో ఒక కారణంగా అమెరికా సూడాన్ మీద పెత్తనం చేస్తున్నది. ఒకసారి అది 'అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని' సమర్ధిస్తున్నదంటూ ఆరోపించింది. 1997 నుంచీ అమెరికా సూడాన్ మీద అనేక ఆంక్షలు విధించింది. ఆ సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం వ్యాపార ఆంక్షలు విధించింది. సూడాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొత్తం ఆస్తులు ప్రతిష్టంభన చేసారు.

సూడాన్ చమురు మీద చైనా, ఫ్రాన్స్‌ల గుత్తాధిపత్యం గురించి అమెరికా యోచిస్తున్నది. డార్‌ఫర్‌తో పాటు డార్‌ఫర్‌కు పొరుగున ఉన్న చాద్‌లో భారీ చమురు నిక్షేపాలు ఉన్నాయి. డార్‌ఫర్‌లో చమురును వాణిజ్య అవసరాల కోసం వెలికి తీయడం చాలా లాభకరంగా ఉంటుందని చైనా, ఫ్రాన్స్‌లో టోటల్ ఫినా ఎల్ఫ్‌లకు బాగా తెలుసు. అందుకనే అమెరికా, పాశ్చాత్య దేశాలూ డార్‌ఫర్‌ల 'మానవత్వ సంక్షోభం'లో అంత ఆసక్తి చూపిస్తున్నది.

సూడాన్ ప్రభుత్వం తిరుగుబాటులను అణిచివేసింది. గూండాలను ఏర్పాటు చేసింది. డార్‌ఫర్‌లో ఘోరమైన నేరాలు చేసింది. అమెరికా డార్‌ఫర్ వ్యూహాత్మక ప్రాంతంలోకి ప్రవేశించడానికి ముసుగులో ప్రయత్నిస్తున్నది.

ఫ్రెంచి విదేశీ మంత్రి ఫిలిప్ డోస్ట్ బ్లాజీ డార్‌ఫర్‌కు వెళ్లి అంతర్జాతీయ ప్రజలకు డార్‌ఫర్‌లో 'రహస్య ఎజెండా' లేదని చెబుతూ వచ్చారు.

## చైనా ముఖ్యమైన పాత్ర

ఈ ప్రాంతంలో చైనా ముఖ్యమైన పాత్ర వహించేందుకు ప్రయత్నిస్తున్నది. యాభై దేశాల అధిపతులతో బీజింగ్‌లో జరిగిన ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశాలు ఈ ప్రాంతంలో చైనాకు పెరుగుతున్న ప్రయోజనాలను తెలియజేస్తున్నాయి. గత కొంత కాలంగా సూడాన్ చైనాకు వ్యాపార భాగస్వామిగా ఉన్నది.

ఆంక్షలు విధించినప్పటికీ సూడాన్ అమెరికా ఒత్తిడులకు లొంగలేదు. రష్యా నుంచీ, ముఖ్యంగా చైనా నుంచీ సహాయం కోరుతున్నది. సూడాన్‌లో చైనా ప్రయోజనాలు గణనీయంగా పెరుగుతున్నాయి. 71 శాతం చమురు చైనాకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధాన దిగుమతులు కూడా చైనా నుంచే ఉన్నాయి.

సూడాన్ చమురు పరిశ్రమలో చైనాకు ప్రధాన పాత్ర ఉన్నది. దక్షిణ డార్‌ఫర్‌లో ఉన్న బ్లాక్ 6లో దానికి హక్కులు ఉన్నాయి. ఇక్కడ వెలికి తీయని చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఎగుమతి కోసం చమురును ఉత్పత్తి చేసే ప్రధాన దక్షిణ చమురు ప్రాంతాలలో 40 శాతం చైనా చేతులలో ఉంది. ఎగుమతుల కోసం ఉత్పత్తి చేస్తున్న క్షేత్రం ఇది ఒక్కటే. సూడాన్‌లో చైనా ఇతర పెట్టుబడులు కూడా ఉన్నాయి. వాటితో చైనా చమురు శుద్ధి క్షేత్రాలూ ఆయుధ ఉత్పత్తి పరిశ్రమలూ నిర్మిస్తుంది. చైనా యావత్తు చమురు దిగుమతులలో ఆరు శాతం సూడాన్ నుంచే ఉన్నాయి.

చైనా భద్రతా సమితిలో ఉంది. డార్‌ఫర్ కేసును అంతర్జాతీయ నేర న్యాయ స్థానానికి అప్పజెప్పే అంశంలో అది వోటు వేయలేదు. రష్యనులు, ఆఫ్రికా యూనియన్ సభ్యులతో కలిసి వాళ్లు సూడాన్‌కు వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. అమెరికా, దాని మిత్రపక్షాలు, ముఖ్యంగా బ్రిటన్ ఐక్య రాజ్య సమితి బలగాలను మోహరించాలని కోరుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నీ కలిసి ఆంక్షలు విధించడం వంటి తీవ్రమైన చర్యలు తీసుకోవాలనీ 'రాకూడని జోన్‌లు' ఏర్పరచడం మొదలయినవి కోరుతున్నాయి. వీటికి తోడు అమెరికా సూడాన్ మీద ఏకపక్ష చర్య తీసుకోవాలని గట్టిగా యోచిస్తున్నది.

సెప్టెంబరులో అమెరికా, దాని మిత్ర పక్షాలూ సూడాన్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి ఇతర అవకాశాల గురించి ఆలోచిస్తున్నాయి. సైనిక జోక్యం గురించి కూడా ఆలోచిస్తున్నది. చైనా సహాయం వల్ల సూడాన్ కొంతవరకూ రక్షణ ఏర్పాటు చేసుకోగలిగిందన్నది స్పష్టం. ప్రస్తుతానికి అమెరికా యూరోపియన్ యూనియన్‌లు ఈ కారణం వల్ల ఆంక్షలు విధించలేకపోతున్నాయి.

రానున్న రోజులలో సూడాన్ ఒక తీవ్రమైన అంశంగా ముందుకు రావచ్చు.

★

**సామ్రాజ్యవాదపు విస్తరణ కాంక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం!**

# ఈస్ట్ డివిజన్ ప్రతిఘటనా పోరాట వార్తలు

## కామ్రేడ్స్ బి.కె కరుణల హత్యలకు నిరసనగా........

కామ్రేడ్స్ బికె, కరుణల బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా జనవరి 10న పార్టీ పిలుపిచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయటానికి చేసిన నిరసన చర్యల్లో భాగంగానే జనవరి 6న పెదవలస తీగులబందలో ఎ.పి.ఎఫ్.డి.సికి చెందిన కాఫీ గోడౌన్లపై దాడి చేసి పెద్ద మొత్తంలో కాఫీ పప్పును ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాఫీ పల్పింగ్ యంత్రాలను కూడా పేల్చివేయడం జరిగింది.

బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా జనవరి 10న బంద్ పాటించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ పెదవలస తీగులబందలలో పోస్టర్లను వేశారు. మూడు బస్సులను ఆపివేసి అందులోని ప్రయాణీకులూ, డ్రైవర్, కండక్టర్లతో సభ నిర్వహించారు. బస్సులపై నినాదాలు రాసి బంద్‌ను ప్రచారం చేశారు.

## కామ్రేడ్ బికె, కరుణల సంస్మరణ సభ

2006 డిసెంబర్ 27న భారత విప్లవోద్యమం మరో ఇద్దరు గొప్ప విప్లవకారులను, సీనియర్ నాయకులను కోల్పోయింది. కేంద్ర కమిటీ సభ్యుడు, కేంద్ర మిలటరీ కమీషన్ సభ్యుడిగా భారత విప్లవోద్యమానికి, విప్లవ సైన్యానికి నాయకత్వం వహించిన కా. దేవన్న (చంద్రమౌళి), విప్లవ మహిళా ఉద్యమ నాయకురాలిగా, ఈస్ట్ జిల్లా కమిటీ సభ్యురాలిగా పని చేసిన కా. కరుణలను దోపిడీ పాలకవర్గాలు అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేసి రహస్యాలను రాబట్టలేక, ఆ విప్లవ వీరుల గుండె ధైర్యం ముందు ఓడిపోయి కిరాతకంగా కాల్చి చంపి విశాఖ జిల్లా గూడెం మండలం జంపర్లోవ వద్ద శవాలను పడవేశారు. తమ ప్రియతమ నాయకుల అమరత్వాన్ని, విషాదాన్ని జీర్ణించుకోలేని మన్యం ప్రజలు, పి.ఎల్.జి.ఎ బలగాలు ఒకచేత కంట తడిని ఒత్తుకుంటూ ఆ అమరుల జ్ఞాపకాలను స్మరించుకుంటూ వారి ఆశయాన్ని కొనసాగిస్తామంటూ అనేక సంస్మరణ సభలను, నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ అమరత్వ వార్త విన్న ప్రజలు, గతంలో బికె పని చేసిన ఏరియాలోని ప్రజలు స్వచ్ఛంధంగా చెట్లు నరికి రోడ్లు బ్లాక్ చేసి నిరసనలు తెలియచేశారు. దాంట్లో భాగంగానే జనవరి 30, 2006 నాడు ఈస్ట్ పి.ఎల్ సంస్మరణ సభను జరుపుకుంది.

ఈ సభలో కామ్రేడ్సందరూ కామ్రేడ్స్ బి.కె, కరుణల స్మృతులను పంచుకున్నారు. ఎ.ఒ.బి ఉద్యమంతో వారిద్దరికీ వున్న విడదీయరాని అనుబంధాన్ని స్మరించుకుంటూ ఉద్యమాభివృద్ధిలో వారి కృషిని ఎత్తిపట్టారు. వారి ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామని పిడికిలెత్తి శపథం చేసారు.

## జనవరి 26 బంద్ సందర్భంగా

జనవరి 26, సాయంత్రం పెదవలస - లకారపుపేట, పెదవలస - చలపరాతిపాలెంల మధ్య పి.ఎల్.జి.ఎ సభ్యులు రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికివేసి పోస్టర్లు, బ్యానర్లు కట్టారు. పెదవలసలో దుకాణాలకు, సంత జరిగే ప్రదేశంలో మొత్తం పోస్టర్లు వేసి, బ్యానర్లు కట్టారు. పెదవలసకు వచ్చిన బస్సులను ఆపి బ్యానర్లు కట్టారు.

ఏరియా లోపల ఉన్నటువంటి అన్ని పాకెట్స్‌లోను, రోడ్డు పక్కన ఉన్న కొన్ని గ్రామాల్లోను మిలీషియా, ప్రజలు పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం చేశారు.

మరో గ్రామంలో కాఫీ గోడౌన్‌కు చెందిన లాంచి తగులబెట్టారు.

జిల్లా, ఏరియా కమిటీలు పత్రికలకు ప్రకటనలు ఇచ్చాయి.

★

---

*(.... 38వ పేజీ తరువాయి)*

అందర్నీ రిట్రీట్ చేయించాడు కామ్రేడ్ మల్లేశం. పెద్దకొత్తపల్లి రెయిడ్‌లో అసాల్ట్ గ్రూప్‌లో వుండి శత్రువు గుండెల్లో వణుకు పుట్టించాడు. మాధవ్ (ఎపి రాష్ట్ర కమిటీ కార్యదర్శి) తదితర కామ్రేడ్స్ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా నల్గొండ జిల్లా ఎం. ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి ఎస్.ఐతో సహా ఇద్దరు కానిస్టేబుల్స్‌ను చంపి ఒక పిస్టల్‌ను తెచ్చాడు. మిలటరీ రంగంలో ఎంతో నైపుణ్యం సంపాదించాడు. పాటలు పాడేవాడు. తోటి కామ్రేడ్స్‌ను సహృదయతతో అర్థం చేసుకునేవాడు.

ఇలా మిలటరీ రంగంలో ఎంతో అనుభవాన్ని పొందిన కామ్రేడ్ మల్లేశం అమరత్వం పి.ఎల్.జి.ఎకు పెద్ద నష్టం. అతనిలోని తెగువనూ, సాహసాన్ని అలవర్చుకోవడం ద్వారానే ఆ నష్టాన్ని పూడ్చగలం అదే కామ్రేడ్ మల్లేశంకు మనం ఇవ్వగలిగే నివాళి. ★

సిద్ధాంత వ్యాసం

# సరియైన భావాలు

*(ఈ వ్యాసం కామ్రేడ్ మావో మార్గదర్శకత్వంలో "చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రస్తుత మన గ్రామీణ ప్రాంత పనిలో కొన్ని సమస్యలు" అనే అంశంపై రూపొందించిన డాక్యుమెంటు నుండి స్వీకరించినది. ఈ వ్యాసాన్ని కా. మావో స్వయంగా రచించారు.)*

సరియైన భావాలు యెక్కడ నుండి వస్తాయి? అవి ఆకాశం నుండి వూడిపడతాయా? లేదు. వాటంతట అవి మనస్సులో నుండి పుట్టుకొస్తాయా? లేదు. అవి సామాజిక ఆచరణ నుండి మాత్రమే వస్తాయి. అంటే, మూడు రకాలైన సామాజికాచరణల నుండి - ఉత్పత్తి కొరకు జరిపే పోరాటం, వర్గ పోరాటం మరియు శాస్త్ర ప్రయోగం నుండి మాత్రమే వస్తాయి.



సమాజంలో మానవుని ఉనికి, లేక అతని స్థానం అతని ఆలోచనను నిర్ణయిస్తుంది. అభివృద్ధి చెందిన వర్గాల లక్షణాలను గురించిన సరియైన భావాలను ప్రజానీకం గ్రహించగలిగినప్పుడు ఈ భావాలు భౌతిక శక్తిగా రూపొందుతాయి. ఈ భౌతిక శక్తే సమాజాన్ని, ప్రపంచాన్ని మార్చివేస్తుంది. మానవులు తమ సామాజిక ఆచరణలో అనేక రకాల పోరాటాలు జరుపుతూ వుంటారు. ఆ సమయంలో తాము సాధించిన విజయాల నుండి మరియు పొందిన అపజయాల నుండి కూడా గొప్ప అనుభవాన్ని సంపాదించుకుంటారు.

భౌతికమైన బాహ్య ప్రపంచము యొక్క అసంఖ్యాక దృశ్య ఘటనలు - చూపు, వాసన, వినుట, రుచి మరియు స్పర్శలకు సంబంధించిన పంచేంద్రియాల ద్వారా, మానవుని మెదడులో ప్రతిబింబింపబడుతాయి. మొదట్లో జ్ఞానం అనేది గ్రాహకమైనట్టిది. తరువాత ఈ జ్ఞానం 'గ్రాహక దశ' నుండి 'భావ దశ'కు ఒక గెంతు గెంతుతుంది, అంటే , చాలినంత గ్రాహక జ్ఞానం యేర్పడినప్పుడు జ్ఞానం 'భావ దశ'కు చేరుకుంటుంది. 'ప్రత్యయ దశ'లో ఇది ఒక క్రమం. ఇది సంపూర్ణ 'ప్రత్యయ దశ'లోని మొదటి దశ. ఈ దశలో (భావ దశలో) వ్యక్తిగత చైతన్యం, లేక భావాలు (సిద్ధాంతాలు, పాలసీలు, ప్లానులు, చర్యలతో సహా) భౌతికమైన బాహ్య ప్రపంచం యొక్క సూత్రాలను సరిగ్గా ప్రతిబింబించునా లేదా అన్నది ఇంకనూ రుజువుకాదు. ఆ భావాలు సరియైనవా? కావా? అని నిర్ణయించుటకు ఈ దశలో ఇంకనూ సాధ్యం కాదు. ఆ తరువాత ప్రత్యయ దశలోని రెండవ దశ ఆరంభమవుతుంది. అంటే చైతన్యం నుండి తిరిగి పదార్థమునకు దారితీసే దశ. భావాల నుండి అస్తిత్వమునకు దారితీసే దశ. ఇప్పుడు మొదటి దశ పొందిన జ్ఞానం - అంటే రూపొందించబడిన సిద్ధాంతాలు, పాలసీలు, ప్లానులు, చర్యలు, అనుకున్న విజయాన్ని సాధించగలవా, లేదా అన్న విషయాన్ని రుజువు చేసుకోవడానికి, సామాజికీకరణలో అన్వయించబడుతుంది. సాధారణంగా, విజయాన్ని సాధించినవి సరియైనవి, అపజయాన్ని పొందినవి సరియైనవి కావు. మానవుడు ప్రకృతిపై జరిపే పోరాటంలో ఇది మరీ యదార్థం. సామాజిక పోరాటంలో పురోగమిస్తున్న వర్గం కొన్ని సమయాల్లో అపజయాన్ని పొందుతుందంటే దాని అర్థం భావాలు తప్పుడువని కాదు. దానికి కారణం, పోరాటంలో నిమగ్నమైయున్న శక్తుల తూకంలో, పురోగామి వర్గం తాత్కాలికంగా, అభివృద్ధి నిరోధక శక్తులంత బలంగా లేకపోవటమే. అందువల్లనే పురోగామి శక్తులు తాత్కాలికంగా అపజయాన్ని పొందుతాయి. కాని ఈ శక్తులు ఎప్పుడో ఒకప్పుడు

# ఎక్కడి నుండి వస్తాయి?

విజయాన్ని తప్పక సాధించి తీరుతాయి. ఆచరణలో పరీక్షింపబడుట ద్వారా మానవునియొక్క జ్ఞానం మరొక గెంతు గెంతుతుంది. పూర్వపు గెంతుకన్నా ఈ గెంతు మరీ ముఖ్యమైనది. ఎందువల్లనంటే, మొదటి గెంతు - అంటే భౌతికమైన బాహ్య ప్రపంచాన్ని ప్రతిబింబించు క్రమంలో మనకు ఏర్పడ్డ భావాలు, సిద్ధాంతాలు, పాలసీలు, ప్లానులు, చర్యలు సరియైనవా? కావా? అని రుజువుచేయగలిగినది ఈ రెండవ గెంతు మాత్రమే. వాస్తవాన్ని పరిశీలించుటకు ఇంతకంటె మరో మార్గం లేదు. అంతే కాకుండా శ్రామికవర్గం, ప్రపంచాన్ని గురించి తెలుసుకోవడంలో ఏకైక లక్ష్యం, దాన్ని (ప్రపంచాన్ని) మార్చుటకు మాత్రమే.

పదార్థం నుండి చైతన్యానికి, మరల చైతన్యం నుండి పదార్థానికి, అంటే ఆచరణ నుండి జ్ఞానానికి, మరల జ్ఞానం నుండి ఆచరణకి దారి తీసే క్రమంలో ఇది అనేకసార్లు పునరావృత్తి చేయబడడం ద్వారా మాత్రమే సరియైన భావాలు ఉద్భవిస్తాయి. మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతమైతేనేమి, గతితార్కిక భౌతికవాద జ్ఞాన సిద్ధాంతమైతేనేమి యిదే.

ఈ జ్ఞాన సిద్ధాంతాన్ని ఇంకా అర్థం చేసుకోనివారు మన కామ్రేడ్స్‌లో చాలా మంది వున్నారు. మీ భావాలకు, అభిప్రాయాలకు, పాలసీలకు, పద్ధతులకు, ప్లానులకు, చైతన్యానికి, ఉపన్యాసాలకు, సుదీర్ఘ వ్యాసాలకు మూలమేమిటని వారిని ప్రశ్నిస్తే, ఈ ప్రశ్నను వింతగా భావించి, దానికి జవాబు చెప్పలేరు. పదార్థం చైతన్యంగా, చైతన్యం పదార్థంగా చెందు మార్పులు నిత్య జీవితంలో కానవచ్చే సంఘటనలే అయినప్పటికీ ఈ గెంతులను వారు గ్రహించలేరు.

తమ ఆలోచనలను సరిగా రూపొందించుకోవటానికి, పరిశోధనలోనూ, అధ్యయనంలోనూ ఉత్తములుగా రూపొందుటకు, తమ అనుభవాన్ని మధింపు చేసుకోవడానికి, కష్టాలను దాటటానికి, తక్కువ తప్పులు చేయటానికి, పూర్వం కన్నా బాగా తమ పనులు చేయటానికి, తత్ఫలితంగా చైనాను శక్తివంతమైన గొప్పసోషలిస్టు దేశంగా నిర్మించడానికి, ప్రపంచంలోని అసంఖ్యాక పీడిత ప్రజానీకం పట్ల మనకు గల అంతర్జాతీయ విద్యుక్త ధర్మాన్ని నిర్వహించుటకు సాయపడటానికి మనం మన కామ్రేడ్స్‌కు గతితార్కిక భౌతికవాద జ్ఞాన సిద్ధాంతాన్ని నేర్పటం అన్నిటికన్నా ముఖ్యం.

★

**ఆచరణ ద్వారా సత్యాన్ని కనుగొనండి; మళ్లీ ఆచరణ ద్వారా ఆ సత్యాన్ని నిరూపించి, అభివృద్ధి చేయండి. ఇంద్రియగ్రహీత జ్ఞానం నుండి మొదలుపెట్టి, క్రియాశీలతతో దాన్ని హేతుబద్ధ జ్ఞానంగా వికసింపచేయండి; ఆపై హేతుబద్ధ జ్ఞానంతో ప్రారంభించి, స్వీయమానసిక (కర్తృపర) ప్రపంచం, భౌతిక (కర్మపర) ప్రపంచాలు రెంటినీ మార్చేందుకుగాను విప్లవకర ఆచరణకు చురుగ్గా మార్గదర్శకత్వం వహించండి. ఆచరణ, జ్ఞానం, మళ్లీ ఆచరణ, (తద్వారా) మళ్లీ జ్ఞానం - ఈ క్రమం మళ్లీమళ్లీ అనంత వలయాలుగా సంభవిస్తూ ఉంటుంది; ఇలాంటి ప్రతి వలయంతోనూ ఆచరణ, జ్ఞానాల సారాంశం మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతూ వుంటుంది. గతితార్కిక భౌతికవాద జ్ఞాన సిద్ధాంత సమస్తం ఇదే; తెలుసుకోవడానికి, చేయడానికి నడుమగల ఐక్యతకు సంబంధించిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం ఇదే.**

**- కామ్రేడ్ మావో రచించిన 'ఆచరణ' వ్యాసం నుండి**

# అమరుల రక్తంతో తడిసి ఎరుపెక్కిన అరుణపతాకను సమున్నతంగా ఎత్తిపట్టండి!

*(జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు జరిగే అమరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపు)*

## ప్రియమైన కామ్రేడ్స్!

2004 సెప్టెంబర్‌లో సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించినపుడు జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల వారోత్సవాన్ని పాటించాలని నిర్ణయమైంది. ఈ నిర్ణయం మేరకు ప్రతి సంవత్సరం అమరుల వారాన్ని పాటిస్తూ, ప్రజల కొరకు ప్రాణాలర్పించిన మన ప్రియతమ అమరుల మహోన్నత త్యాగాలను స్మరిస్తూ, వారికి వినమ్రంగా హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆశయ సాధనకై పిడికిలి బిగించి ప్రతిజ్ఞ చేస్తున్నాం.

"గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా పురోగమింపజేయాలి, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చాలనీ" పిలుపునిస్తూ చారిత్రాత్మక ఐక్య కాంగ్రెస్ (9వ కాంగ్రెస్) విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, ఈ సంవత్సరం అమరుల వారోత్సవాన్ని పాటించడానికి సన్నద్ధమవుతున్నాం.

భారత విప్లవ పంథాను రూపొందించి, మార్గ నిర్దేశం చేయటంలో రివిజనిజానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరు సాగించిన మన పార్టీ నిర్మాతలూ, పంథా రూపశిల్పులూ, మహోపాధ్యాయులూ కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ ఛటర్జీల చారిత్రాత్మక పాత్రను స్మరించుకుంటూ, ఐక్య కాంగ్రెస్ (9వ కాంగ్రెస్) వారికి హృదయపూర్వక నివాళులర్పిస్తూ, వారు రూపొందించిన పంథాలో సాహసంతో పురోగమించడానికి దృఢంగా ప్రతినబూనింది. అమరులు కామ్రేడ్స్ అమూల్యసేన్, సుశీతల్‌రాయ్ చౌదరి, చంద్రశేఖర్‌దాస్, సరోజ్‌దత్తా, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, భుజాసింగ్, సుబ్బారావు పాణిగ్రాహి, సుదీప్తో బెనర్జీ ఇంకా అనేక మంది అమరులకు కూడా కాంగ్రెస్ శ్రద్ధాంజలి ఘటించింది. చారిత్రాత్మక నక్సల్బరీ తిరుగుబాటు కాలం నుంచి నేటి వరకు శత్రువు అమలుచేస్తున్న పాశవిక నిర్బంధమూ, క్రూరమైన దాడుల్లో అమరులైన పదకొండు వేల మంది కామ్రేడ్స్‌కూ, 2004 సెప్టెంబర్‌లో సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకూ ప్రాణాలర్పించిన ఏడు వందల మంది కామ్రేడ్స్‌కూ, పి.బి సభ్యుడు కామ్రేడ్ కరంసింగ్‌కూ, సి.ఎం.సి సభ్యుడు కామ్రేడ్ చంద్రమౌళికి కాంగ్రెస్ శ్రద్ధాంజలి ఘటించింది.



అలాగే ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి, డి.కె, ఛత్తీస్‌గఢ్, కర్నాటక, 3యుల నుండి అమరులైన రాష్ట్ర స్థాయి కామ్రేడ్స్ సాకేత్ రాజన్, మాధవ్, మైమొద్దీన్, శ్రీధర్, యాదన్న, మంగ్తు, ప్రాణ్, సత్యం, వికాస్, రాఘవులు, గౌతం, శ్రావణ్‌లకూ, వివిధ స్థాయి పార్టీ కమిటీలకు చెందిన కామ్రేడ్స్‌కూ, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్‌కూ, వివిధ స్థాయి ఆర్.పి.సిల కామ్రేడ్స్‌కూ, ప్రజా మిలీషియా, విప్లవ ప్రజా సంఘాలకు చెందిన అమర కామ్రేడ్స్‌కూ, ఇంకా వీరిలో అమరులైన వందలాది మహిళా కామ్రేడ్స్‌కూ కాంగ్రెస్ శ్రద్ధాంజలి ఘటించింది. మన దేశంలో, అలాగే ప్రపంచ వ్యాప్తంగానూ అన్ని రకాల దోపిడీ పీడనల నుంచి విముక్తిని సాధించి, వర్గ రహిత సమాజాన్ని నిర్మించేందుకు గొప్ప పాత్రను పోషించి అమరులైన కామ్రేడ్స్ కృషినీ, అనన్య త్యాగాలనూ స్మరిస్తూ కాంగ్రెస్ వారికి హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించింది.

కామ్రేడ్స్!

మన కాంగ్రెస్ విజయవంతంగా ముగిసిన తర్వాత, మరింతగా పెరిగిన శత్రు బహుముఖ దాడి, క్రూర నిర్బంధం, బూటకపు ఎన్‌కౌంటర్లలో అనేక మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఎ.పిలో ఆరుగురు ఎ.సి సభ్యులతో సహా 8 మంది కామ్రేడ్స్, ఎన్.టిలో ఆరుగురు కామ్రేడ్స్, డి.కెలో 24 మంది కామ్రేడ్స్, బి-జెలో 25 మంది కామ్రేడ్స్, ఛత్తీస్‌గఢ్‌లో ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. కాంగ్రెస్ తర్వాత అమరులైన వారిలో బి-జె ఎస్.ఎ.సి పరిధిలో బఢ్-షేక్‌పుర-నవడా జోనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ నాథున్‌జీ, ఉత్తర ఛత్తీస్‌గఢ్ జోనల్ కమిటీ కామ్రేడ్ మానస్, ఎన్.టిలోని ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ నరేష్, ఎ.పి, ఎన్.టి నుండి మహిళా కామ్రేడ్స్ భవాని, స్వర్ణ, అరుణ, లలితలు, హర్యానా నుంచి మలేరియా జ్వరంతో అమరుడైన కామ్రేడ్ రామ్ మోహర్, పంజాబ్‌లో పేరు పొందిన మేధావి కామ్రేడ్ హరిసింగ్ తార్క్‌లు వున్నారు. మార్చి 13న డి.కెలో బీజాపూర్ పోలీసు జిల్లాలోని రాణిబోదిలి పోలీసు - ఎస్.పి.ఒ క్యాంపుపై దాడి చేసి 68 మంది శత్రు బలగాలను నిర్మూలించిన దాడిలో పశ్చిమ బస్తర్ కమాండ్ ఇన్‌ఛార్జి, డివిజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మోహన్‌తో పాటు ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ దాడి మన విప్లవోద్యమ చరిత్రలోనే చాలా పెద్దది. జార్ఖండ్‌లో బొకారో జిల్లాలోని ఖన్‌మహల్‌లో సి.ఐ.ఎస్.ఎఫ్ బ్యారక్ (క్యాంపు)పై చేసిన విజయవంతమైన దాడిలో ఎస్.ఎ.సి స్థాయి మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ కామ్రేడ్ ప్రదీప్, పి.ఎల్.జి.ఎ పోరాటయోధుడు కామ్రేడ్ నిర్మల్‌లు అమరులయ్యారు.

గడిచిన సంవత్సర కాలంలో దేశ వ్యాప్తంగా 202 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో కొంత మంది కామ్రేడ్స్ శత్రు బలగాలపై మన పి.ఎల్.జి.ఎ చేసిన వీరోచితమైన రెయిడ్‌లూ, ఆంబుష్‌లూ, దాడుల్లో అమరులయ్యారు. కొంత మంది కామ్రేడ్స్ పోలీసు, పారామిలటరీ బలగాలకు వ్యతిరేకంగా జరిపిన తీవ్రమైన ప్రతిఘటనలో అమరులయ్యారు. కానీ, అనేక మందిని పట్టుకుని, క్రూరంగా చిత్రహింసలు పెట్టి, బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేశారు. బూబీట్రాప్‌లూ, మందుపాతరలూ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. గడిచిన సంవత్సర కాలంలో డి.కెలోని ఆర్.పి.సిలూ, ప్రజా మిలీషియా యూనిట్లూ, విప్లవ ప్రజాసంఘాలకూ చెందిన వందమంది కామ్రేడ్స్‌ను పోలీసులూ, సల్వాజుడూం సాయుధ అరాచక మూకలూ క్రూరంగా హత్య గావించారు. బి-జెలో ప్రభుత్వ ప్రోత్సాహక టి.పి.సి (తృతీయ ప్రస్తుతి కమిటీ)కి చెందిన హంతక, అరాచక మూకల చేతిలో కొంతమంది కామ్రేడ్స్ చనిపోయారు. అమరుల వారోత్సవం సందర్భంగా మన ప్రియతమ కామ్రేడ్స్ అందరికీ హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించుదాం.

భారతదేశంలో మొత్తం సమాజాన్ని పరివర్తన చేసే లక్ష్యంతో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో, దోపిడీ వర్గాన్ని అధికారం నుంచి కూల్చేందుకు పీడిత వర్గం కఠినమైన పోరాటం జరుపుతున్నచోట, సాయుధ విప్లవం ప్రతిఘాతుక విప్లవాన్ని ఎదుర్కొంటున్న చోట, దోపిడీ పీడనలకు గురవుతున్న కార్మిక, రైతాంగ, శ్రామిక వర్గాలు చేస్తున్న విముక్తి పోరాటాలను దోపిడీ పాలకవర్గం తన రాజ్య యంత్రాంగం ద్వారా అణచివేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. ఆవిధంగా, ఈ రోజు దేశమంతా యుద్ధ రంగంగా మారి, బలమైన శత్రువుకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో "మనల్ని మనం రక్షించుకోవడానికి శత్రువును నాశనం చేయటం'' అనే సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నందువల్ల త్యాగాలు అనివార్యం. శత్రువు బలగాలను నాశనం చేయటం, నష్టం కలిగించటమనే క్రమంలో స్వతఃసిద్ధమైన త్యాగాలు కొన్ని అనివార్యం. అయినప్పటికీ మనం అనవసర త్యాగాలను నివారించాలి.

అమరత్వం అనేది మన పార్టీలో మహోన్నత విప్లవ సాంప్రదాయం. ఏ ఒక్కరి స్వప్రయోజనాల కోసమోగాక, విశాల పీడిత ప్రజల ప్రయోజనాలకోసం, సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా దోపిడీ పీడనల కబంధ హస్తాల నుండి మాతృభూమి విముక్తి కోసం చేసే త్యాగం అన్నిటికంటే గొప్పది. మన ప్రియతమ అమరులు మన దేశమాత ముద్దు బిడ్డలు. వారి అమరత్వం హిమాలయాలకంటే ఉన్నతమైనది.

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకూ అమరుల వారోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలన్నీ చేయవలసిందిగా అన్ని పార్టీ కమిటీలకూ, పి.ఎల్.జి.ఎ బలగాలకూ, ఆర్.పి.సిలూ, కె.కె.సి కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజా సంఘాల కామ్రేడ్స్‌కూ మన కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది. అమరుల వారోత్సవానికి సి.సి ఈ కింది నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించింది.

**అమరుల వారోత్సవానికి నిర్దిష్ట కార్యక్రమం:**

1. అమరుల వారోత్సవం సందర్భంగా విస్తృత రాజకీయ ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించాలి. అమరుల వారోత్సవ కార్యక్రమాల్లో

పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించడానికి అన్ని విధాలుగా కృషి చేయాలి. ఈ క్యాంపెయిన్‌లో అమరులు వారి నిరాడంబర జీవిత శైలినీ, కఠోర శ్రమనూ, వారి జీవితాల్లో వారు ఆచరించి, ఉన్నతంగా నిలిపిన ఆదర్శాలనూ, కమ్యూనిస్టు విలువలనూ పైకెత్తిపడుతూ కేంద్రీకరించాలి. పార్టీ క్యాడర్‌కు వీటిని అనుసరించాలని పిలుపునివ్వాలి. ఈ కర్తవ్యాన్ని చేపట్టడానికి అందుబాటులో వున్న అన్నింటినీ ఉపయోగించుకోవాలి. అన్ని రాష్ట్రాల్లో అమరుల గురించి, అమరవీరుల వారోత్సవం గురించి పత్రికా ప్రకటనలు విడుదల చేయాలి. కరపత్రాలూ, పోస్టర్లూ మొదలైనవి తీసుకురావాలి. గోడ రాతలు కూడా విస్తృతంగా రాయాలి. మన ప్రభావం గట్టిగా వున్న ఏరియాల్లో ఖచ్చితమైన రహస్య పద్ధతులు పాటిస్తూ బ్యానర్లు కట్టాలి. సాధ్యమైన చోట జిల్లాలకూ, ప్రాంతాలకూ, వేదికలకూ చెందిన అమరవీరులా, మహిళా అమరుల ఫోటోలతో క్యాలెండర్లు తీసుకురావాలి. జోనల్ కమిటీ / జిల్లా కమిటీ / డివిజనల్ కమిటీ / ఎస్.ఎ.సి / ఎస్.జడ్.సి / ఎస్.సి స్థాయిలో బుక్‌లెట్లు ప్రచురించాలి.

2. మన ప్రసంగాలూ, సమావేశాలూ, పోస్టర్లూ, కరపత్రాలూ, బుక్‌లెట్లూ మొదలైన వాటన్నింటిలో మన పార్టీ స్థాపకులైన నేతలిద్దరి పైనా ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. వారి జీవిత చరిత్రలూ, రచనల గురించి క్లుప్తంగా పరిచయం చేయాలి. ప్రచార సామాగ్రి అంతటా ఈ నేతలిద్దరి ఫోటోలూ వుండాలి. ఈ నేతలిద్దరూ రూపొందించిన పంథాలో పురోగమించాలని ప్రజలకూ, పార్టీ క్యాడర్లకూ పిలుపునివ్వాలి.

3. మనకు కొంత బలమున్న చోట అమరవీరుల స్థూపాలు నిర్మించడానికి తప్పక ప్రయత్నించాలి. వాస్తవానికి అమరుల స్థూపాలను నిర్మించి, కాపాడుకోవటానికి ప్రభుత్వ, ప్రతీఘాతుక శక్తులకు వ్యతిరేకంగా పోరాడటంలో మన క్యాడర్‌కూ, ప్రజలకూ సుదీర్ఘమైన అనుభవముంది. అమరుల కుటుంబాలనూ, ఆ గ్రామాల ప్రజలనూ కదిలించి, సాధ్యమైనన్ని ఎక్కువ గ్రామాల్లో చిన్న చిన్నవి అమరుల స్థూపాలను నిర్మించడానికి తప్పక ప్రయత్నించాలి. మనం ప్రజాయుద్ధంలో వున్నామనే విషయాన్ని దృష్టిలో వుంచుకుని, సాధ్యమైనంత తక్కువ సమయంలో అమరుల స్థూపాల నిర్మాణాల్ని పూర్తి చేయాలి. ఏ రాష్ట్రంలోనైనా అమరుల స్మారక స్థూప నిర్మాణం సాధ్యమైతే, దాన్ని కేంద్రంగా చేసుకుని ప్రజలను స్థూపాల నిర్మాణానికి రాజకీయంగా కదిలించడానికి ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి. ఆయా రాష్ట్రాల్లో కనీసం ఒకటి రెండు చోట్ల దీన్ని చేపట్టాలి. ఇందుకోసం విస్తృత పునాదిగల కమిటీలను రూపొందించాలి.

4. అమరుల కుటుంబాలతో, బంధు మిత్రులతో బహిరంగ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ కమిటీల ఆధ్వర్యంలో కొన్నిచోట్ల అమరుల స్థూపాలను నిర్మించాలి. సాధ్యమైన చోట్ల ఈ పేరుతో బహిరంగ సభలూ, విస్తృత ప్రచారం చేపట్టాలి. అమరులు ప్రజల ప్రియతమ నేతలనీ, వారి అమరత్వాన్ని కొనియాడే హక్కు ప్రజలకుందనీ ఈ వేదికల ద్వారా అమరుల కుటుంబాలూ, బంధు మిత్రులూ నిర్భయంగా చాటాలి. ప్రభుత్వ బలగాలూ, గూండాలూ, ప్రతీఘాతుక మూకలూ ఈ సంస్మరణ సభలను చెడగొట్టాలనీ, స్థూపాల నిర్మాణాన్ని అడ్డుకోవాలనీ ప్రయత్నిస్తే వాళ్లను ప్రజలు ధైర్యంగా ఎదుర్కోవడానికి సంసిద్ధం చేయాలి. ఈ వేదికలను క్రియాశీలంగా రూపొందించి, ప్రజలకు విజ్ఞప్తి చేసే క్రమంలో కొంతమంది ప్రముఖులనూ, అభ్యుదయవాదులనూ ఇందులో పాల్గొనేట్లు మనం తప్పక ప్రయత్నించాలి.

5. బహిరంగ, రహస్య సమావేశాలు నిర్వహించాలి. సాయుధ పోరాటం జరుగుతున్న ప్రాంతాల్లో ఈ సభలు రహస్యంగా నిర్వహించాలి. మన పోరాటం ప్రాథమిక స్థాయిలో ఉన్న పట్టణాల్లో, ఏరియాల్లో ఏమేరకు సాధ్యమైతే ఆమేరకు బహిరంగ సభలు నిర్వహించాలి. బహిరంగ కార్యక్రమాలైనా, రహస్య కార్యక్రమాలైనా స్థూపాలనూ, సభలనూ నాశనం చేయడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నాలను ఎదుర్కొనడానికి మన ప్రజా మిలీషియా, పి.ఎల్.జి.ఎ బలగాలను సంసిద్ధం చేయాలి. అమరుల వారోత్సవం సందర్భంగా ప్రజలను భయభ్రాంతుల్ని చేయడానికి పోలీసూ, మిలటరీ బలగాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు నిర్వహిస్తాయి. మన కార్యక్రమాలను భగ్నం చేయడానికి బహిరంగ సభల విషయంలో శత్రువును ఎదుర్కోవడానికి ప్రజల్ని పెద్దయెత్తున కదిలించడానికి తప్పక ప్రయత్నించాలి. ప్రజల్ని కదిలిస్తూ ఊరేగింపులూ, కాగడాల ప్రదర్శనలను నిర్వహించడానికి కూడా తప్పక కృషి చేయాలి. అమరుల బంధు మిత్రులతో బహిరంగ, రహస్య ఊరేగింపులూ, మౌన ప్రదర్శనలూ, సమావేశాలూ, పత్రికా సమావేశాలూ ఇంకా ప్రజల్ని కదిలించే అటువంటి క్రియాశీల పద్ధతులకూ, ప్రచారానికి మనం ప్లాన్ చేయాలి.

6. శత్రువుపై చివరి శ్వాస వరకూ పోరాడుతామని పార్టీలో, పి.ఎల్.జి.ఎలో, ఆర్.పి.సిలలో కె.కె.సిలలో విప్లవ ప్రజా సంఘాలలోని మన కామ్రేడ్స్‌ను వారి వారి యూనిట్లలో ప్రతిజ్ఞ బూనేందుకు ప్రోత్సహించాలి. ప్రజల కొరకు తమ అమూల్యమైన ప్రాణాలను

అర్పించిన మన ప్రియతమ అమరుల ఆదర్శాలను ఉన్నతంగా ఎత్తిపట్టడానికి కృషి చేయాలి. అసాధారణమైన అమరుల సుగుణాలను అనుసరిస్తామనీ, ఆదర్శవంతమైన వారి జీవితాల నుండి నేర్చుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించాలి. అమరుల వారోత్సవం సందర్భంగా అమరుల ఆశయాలను పూరించడానికి మనందరం తప్పక ప్రతిజ్ఞబూనాలి. గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చే కర్తవ్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోవడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలి పై కర్తవ్యాన్ని పూర్తి చేయడం ద్వారానే అమరులు కన్న కలల్ని సాధించే మార్గంలో పురోగమించగలం. ఇందుకోసం చేసే ప్రతిజ్ఞ శత్రు బలగాలను సాహసంగా ఎదుర్కొని ఓడించడానికీ, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం కమ్యూనిజాలను స్థాపించే వైపు పురోగమించే మన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడానికీ మన మనసుల్లో నూతనోత్తేజాన్ని, నూతన సంకల్పాన్నీ సృష్టిస్తుంది.

7. అమరవీరుల కుటుంబాలన్నింటిని కలవడానికి మనం తప్పక కృషి చేయాలి. వారి విచారాన్నీ, దుఃఖాన్ని పంచుకుని, వారిని ఓదార్చి, వారిని సాధ్యమైనమేరకు విప్లవోద్యమంలో పాత్ర నిర్వహించడానికి ప్రోత్సహించాలి. అమరుల కుటుంబాలన్నింటినీ మనం కలవలేకపోవడం, వారిని కార్యక్రమాల్లో నిమగ్నం చేయలేకపోవటం చాలా దురదృష్టం. అమరత్వపు వార్తలు తెలిసిన వెంటనే పార్టీ క్యాడర్, ప్రజా సంఘాలతో పాటు అమరుల కుటుంబాలతో ఏర్పాటు చేసిన సంఘాలను వీలైనంత తొందరగా కదిలించాలి. ప్రతిసారీ ఇది ఆచరణలోకి రావాలి. అమరుల వారోత్సవాన్ని పాటించడంలో వారు ముందుండేటట్లు, అమరుల సంస్మరణ సందర్భంగా ఏర్పాటు చేసే వేదికల్లో భాగమయ్యేటట్లు వారిని మనం తప్పక ప్రోత్సహించాలి.

***కామ్రేడ్స్!***

దిన దినం శత్రుదాడి అన్ని వైపులా పెరుగుతూ, మరింత క్రూరంగా మారుతున్న వాస్తవం మనకు తెలిసిందే. యు.పి.ఎ ప్రభుత్వమూ, అన్ని ప్రతిపక్షాలూ, రివిజనిస్టులూ, సి.పి.ఐ (ఎం) సోషల్ ఫాసిస్టు నాయకత్వంలోని వామపక్ష పార్టీలూ అన్ని కలిసి సామ్రాజ్యవాదుల, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఒక్కటై విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటిపైనా, ప్రజలపైనా క్రూరమైన దాడులు చేస్తున్నాయి. సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించినప్పటి నుండీ విప్లవకారులపై దేశవ్యాప్త దాడిని ప్రకటించి, అన్ని వైపులా వాళ్ల దాడిని తీవ్రం చేస్తున్నారు. అన్ని రకాల శత్రు దాడులను ఎదుర్కొంటూ, చైతన్యవంతంగా ప్రజల్ని విస్తృతంగా కదిలించాలి. మన కార్యక్రమమంతటా గెరిల్లా యుద్ధ ఆచరణా, సిద్ధాంతాలనూ ఖచ్చితంగా అనుసరించాలి. శత్రు బలగాలను నాశనం చేసి, మన కార్యక్రమాన్ని అమలుచేయటంలో, మన బలగాలను సంరక్షించుకోవటం చాలా ముఖ్యం. అందువల్ల, అమరుల వారోత్సవ క్యాంపెయిన్ చేపట్టడంలో మన పనికి సంబంధించిన దీర్ఘకాలిక లక్ష్యాన్నీ, శత్రువు యొక్క సాయుధ దాడి తీవ్రతనూ, స్థానిక నిర్దిష్ట పరిస్థితులనూ తప్పక దృష్టిలో వుంచుకోవాలి.

గొప్ప విప్లవోత్తేజం, ఉత్సుకతతో అమరుల వారోత్సవాన్ని పాటించుదాం రండి!

శత్రు బలగాలను పూర్తిగా నిర్మూలించి, ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేసి, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చి మన కామ్రేడ్స్ అమరత్వానికి రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి శపథం చేద్దాం.

క్రూరమైన శత్రు దాడిని ధైర్యంగా, గొప్ప త్యాగ స్ఫూర్తితో ఎదుర్కొని, శత్రువుతో వర్గ పోరాటంలోని కఠిన పరిస్థితులతో తలపడటానికి మొత్తం పార్టీ క్యాడర్కూ, పి.ఎల్.జి.ఎ వీరోచిత కమాండర్లకూ, పోరాట యోధులకూ మొత్తం ప్రజానీకానికి అమరుల వారోత్సవాన్ని ఒక సైద్ధాంతిక - రాజకీయ తర్ఫీదుగా, ఎడ్యుకేషన్ క్యాంపెయిన్గా పాటించుదాం.

అమరుల వారోత్సవం సందర్భంగా కామ్రేడ్ మావో చెప్పిన ఈ కింది వాక్యాలను మననం చేసుకుందాం. "కమ్యూనిస్టు ఏ పరిస్థితుల్లోనూ తన స్వప్రయోజనాలను ముందు పెట్టడు. దేశ, ప్రజల ప్రయోజనాలకు లోబడే తన ప్రయోజనాలను వుంచుతాడు. స్వార్థం, పనిలో అలసత్వం, అవినీతి, పేరు ప్రతిష్టల కోసం వెంపర్లాట (కీర్తికాంక్ష) మొదలైనవి చాలా అధమమైనవికాగా, శక్తి కొద్దీ పని చేయడం, మన స్ఫూర్తిగా ప్రజల కొరకు పని చేయడం, నిరాడంబరంగా కఠోర శ్రమ చేయడం వంటి సుగుణాలన్నీ గౌరవనీయమైనవి''.

*(తరువాయి 43వ పేజీలో.....)*

# గెరిల్లాల చేతుల్లోని ఎక్కుపెట్టిన ఆయుధం కామ్రేడ్ గౌతమ్

తీవ్ర నిర్బంధం మధ్యనే ఎ.ఒ.బి మహాసభను విజయవంతం చేసుకొని, రూపొందించుకున్న నూతన కర్తవ్యాలను ఆచరణలోకి తీసుకెళ్లాలనే సమరోత్సాహంతో ఉన్న ఎ.ఒ.బి పార్టీ శ్రేణులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎ.ఒ.బి ఉద్యమ సారథుల్లో ఒకరైన కామ్రేడ్ గౌతం అమరుడయ్యాడన్న వార్త అందరినీ విషాదంలో ముంచెత్తింది.

ఉద్యమావసరాల రీత్యా విజయవాడ వెళ్లిన కా. గౌతంను 2006, నవంబర్ 23న పోలీసులు పట్టుకొని, నవంబర్ 24న ఈస్ట్ డివిజన్‌లోని శ్యామగడ్డ సమీపంలో కాల్చిచంపి ఎప్పటిలాగే ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు.

25 ఏళ్ల సుదీర్ఘ కాలం విప్లవోద్యమం కొరకు అవిశ్రాంత కృషి చేసి ఆ క్రమంలో తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన కామ్రేడ్ గౌతంకు అరుణారుణ జోహార్లు అర్పిద్దాం.

కా. గౌతంది క్రిష్ణా జిల్లాలోని దివిసీమ. 47 ఏళ్ల క్రితం ఒక విప్లవ సానుభూతిపరుల ఇంట్లో కా. గౌతం పుట్టాడు. తల్లిదండ్రులు ఇతనికి పెట్టుకున్న పేరు సుబ్బారావు. వీరిది వ్యవసాయ కుటుంబం. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో వీరి కుటుంబం పోరాటకారులకు కొండంత అండగా నిలిచింది. కమ్యూనిస్టు పార్టీ ఆ పోరాటానికి విద్రోహం చేసినపుడు ఆ పార్టీని అసహ్యించుకుంది. ఆ తర్వాత సి.పి.ఐ (ఎం.ఎల్) వెనుక దృఢంగా నిలబడింది. అటువంటి స్వేచ్ఛాయుత, విప్లకర భావాల మధ్య కా. గౌతం పెరిగి పెద్దయ్యాడు. పదవ తరగతి వరకూ తమ సొంత వూర్లోనే చదువుకున్నాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో కాపురముంటున్న తన అక్కా బావల దగ్గరికి వెళ్లాడు. అప్పటికి పిల్లలులేని అక్కా బావలు కా. గౌతంను కన్న బిడ్డలా చూసుకున్నారు. అక్కడే వుంటూ డిగ్రీ (బి.కాం) వరకూ చదువుకున్నాడు. ఆ కాలంలోనే అతనిపై జగిత్యాల రైతాంగ పోరాట ప్రభావం పడింది. 1980 కాలంలో హైదరాబాద్ నగరంలో ఆర్.ఎస్.యు, ఆర్.వై.ఎల్ తదితర ప్రజాసంఘాల కార్యకలాపాలు నడుస్తుండినాయి. ఆనాడు జరిగిన ప్రచార, ఆందోళన కార్యక్రమాల ప్రభావం తనపై వుంది. తను డిగ్రీ చదువుతున్నప్పుడే రాడికల్ విద్యార్థి సంఘం సభ్యుడైనాడు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత ఒకవైపు హార్డ్‌వేర్ షాప్‌లో పని చేస్తూనే, రాడికల్ యువజన సంఘం (ఆర్.వై.ఎల్) కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఈ క్రమంలోనే, పీడిత ప్రజల విముక్తి కొరకు పూర్తి కాలం కార్యకర్తగా 1982లో ఉద్యమంలో చేరాడు. కొద్ది కాలం జంట నగరాల్లో పని చేశాడు.

అలా తన నైపుణ్యాన్ని పెంచుకుంటూ 1983లో గెరిల్లా సభ్యుడిగా దండకారణ్యానికి చేరాడు. 1985 వరకు దండకారణ్యంలో గడ్చిరోలిలోని ఆదివాసీ ప్రజల మధ్య పని చేశాడు. పట్టణ జీవితం నుండి వెళ్లిన గౌతమ్ కొద్ది కాలంలోనే ఆదివాసీ ప్రజలకు దగ్గరయ్యాడు. అడవినీ, ఆదివాసీ జీవితాలను లోతుగా అర్థం చేసుకుంటూ, ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేశాడు. తోటి సభ్యుల అభిమానం చూరగొన్నాడు. ఈ క్రమంలో గడ్చిరోలి దళంలో డిప్యూటీ కమాండర్‌గా ప్రమోట్ అయ్యాడు.

ఆ తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా 1985 నుండి ఆయుధాల తయారీ విభాగంలో (టెక్నికల్ టీమ్)లో పని చేశాడు. మొదట టెక్నికల్ యూనిట్‌లో సభ్యుడిగా వున్నాడు. 1991 నాటికి స్వంత చొరవతో, తీవ్రమైన సాధన చేసి ఆయుధాల ఉత్పత్తిలో నైపుణ్యం సంపాదించాడు. తనతోటి కామ్రేడ్స్‌ను తర్ఫీదు చేశాడు. 1991లో ఆయుధాల ఉత్పత్తి యూనిట్ (టెక్నికల్ టీం) ఒకదానికి బాధ్యుడయ్యాడు. 94 డిసెంబర్‌లో ఆయుధాల ఉత్పత్తి విభాగంలో టెక్నికల్ కమిటీ ఎన్నిక జరిగింది. కా. గౌతం ఆ కమిటీలో సభ్యుడిగా ఎన్నిక అయ్యాడు. 99లో పార్టీ తనకు రీజనల్ కమిటీ స్థాయిని కల్పించింది. '96 నుండి 2002 వరకు ఉత్తర తెలంగాణాలో టెక్నికల్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2003 మధ్యకాలంలో ఉత్తర తెలంగాణా నుండి ఎ.ఒ.బికి బదిలీ అయ్యాడు. కా. గౌతమ్‌కు ఎన్.జడ్.సి స్థాయిని పార్టీ కల్పించటంతో, 2003 సెప్టెంబర్ నుండి ఎ.ఒ.బి ఎస్.జడ్.సిలో భాగం అయ్యాడు. తన పనిలో క్రమంగా అభివృద్ధి చెందుతూ, వివిధ రకాల ఆయుధాల ఉత్పత్తిలో నైపుణ్యం పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన బాధ్యతలు మరింతగా పెరిగాయి. ఆయుధాల ఉత్పత్తికి సంబంధించిన కేంద్ర స్థాయి విభాగం అయిన సెంట్రల్ టెక్నికల్ టీం (సి.టి.సి)లో 2003 అక్టోబర్‌లో సభ్యుడయ్యాడు.

విముక్తి ప్రాంత లక్ష్యంతో దండకారణ్య ఉద్యమాన్ని నిర్మించడానికి 1980లో నిర్ణయం తీసుకున్నప్పుడే, ఆయుధాల తయారీ యూనిట్ కూడా ప్రాథమిక స్థాయిలో ప్రారంభమైంది. '90 దశకం నుండే ఆయుధాల ఉత్పత్తిని ఉద్యమ ప్రాంతంలో కూడా చేస్తున్నాం. అంతవరకూ నగరాల్లోనే చేసేవాళ్లం. ఉద్యమంలో పీడిత ప్రజల మధ్య పని చేయడానికి వచ్చిన వాళ్లకు ప్రజలను వదిలి ఎక్కడో, ఎవరితో సంబంధం లేకుండా పని

చేయడం కష్టమైనదే. ఉద్యమ అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడానికి ఎక్కడికైనా, ఎలాంటి పనికైనా కా. గౌతమ్ సిద్ధపడ్డాడు. అంతకుముందు వరకూ ఆయుధాల ఉత్పత్తి గురించి ఎలాంటి పరిజ్ఞానం లేకపోయినా, పార్టీ అప్పగించిన బాధ్యతలను స్వీకరించి 1985లో టెక్నికల్ యూనిట్‌లో పని చేయడానికి నగరానికి వెళ్లాడు. పట్టణాల్లో రహస్యంగా, ఏదో ఒక కవర్‌లో పని చేయడంలో మంచి అనుభవం సంపాదించాడు. 1991 నాటికి కొద్ది మందితో ఏర్పడిన యూనిట్‌కు బాధ్యుడిగా వ్యవహరించాడు. యుద్ధ అవసరాలకు అనుగుణంగా టీమ్‌ను రాజకీయంగా తర్ఫీదు చేస్తూ, యుద్ధానికి అవసరమైన ఆయుధాలను, మందుగుండును తయారు చేసి అందించాడు. ఉద్యమానికంతటికీ ప్రాథమిక ఆయుధం అయిన 12 బోర్‌ని మరింత నైపుణ్యంగా, తక్కువ బరువుతో తయారు చేసే విధంగా ప్రయత్నించాడు. అనేక 12 బోర్ నమూనాలను తయారు చేయడంలో తన కృషి వుంది.

1995 నాటికి గెరిల్లా జోన్ ప్రాంతాల్లో, ఆయుధాల ఉత్పత్తి యూనిట్‌లను ఏర్పర్చి, తయారు చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆ విధంగా ఉత్తర తెలంగాణాలో ఏర్పడిన ఆయుధాల యూనిట్‌కు 96 నుండి బాధ్యుడిగా వున్నాడు. 2002 వరకు లోపలే వుంటూ గైడ్ చేశాడు. ఉత్తర తెలంగాణాలో మూడు ఆయుధాల ప్రాజెక్టులను నిర్వహించాడు. 1999, 2003లో ఎ.ఒ.బిలో ఆయుధాల తయారీ యూనిట్‌ని నడిపాడు. 2002 దండకారణ్యంలో ఆయుధాలు తయారుచేసే ప్రాజెక్టులో తను పనిచేశాడు. మల్కన్‌గిరిలో నిర్వహించిన ఆయుధాల యూనిట్‌పై గ్రేహౌండ్స్ పోలీసులు దాడిచేస్తే, ఆ దాడిని తిప్పి కొడుతూ అందర్నీ సురక్షితంగా రిట్రీట్ చేయడంలో మంచి పాత్రను పోషించాడు. అనేక కష్టాలకు ఓరుస్తూ మరో ప్రాంతంలో ఈ యూనిట్‌ను నడిపించి ఆయుధాలు తయారు చేశాడు. ఎ.ఒ.బిలో ఉన్న నిర్బంధ పరిస్థితుల్లో తక్కువ ప్రొటక్షన్‌తో 2004, 2005ల్లో రెండు క్యాంపులు నడిపి ఉద్యమావసరాలకు అనుగుణంగా తపంచాలు అందించాడు. ఉత్తర తెలంగాణా, ఎ.ఒ.బి, దండకారణ్యంలోని గెరిల్లాలకు వందలాది ఆయుధాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా అందించి ప్రజాయుద్ధ పురోగమనానికి దోహదపడ్డాడు.

నగరాల్లోగానీ, ఫీల్డ్‌లోగానీ టెక్నికల్ యూనిట్‌లో బాధ్యుడిగా వున్నప్పుడు కా. గౌతమ్ సహచర కామ్రేడ్స్‌తో చాలా సన్నిహితంగా వుండేవాడు. వాళ్ల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేవాడు. జీవిత సహచరితో కూడా సన్నిహితంగా వుండి టెక్నికల్ రంగంలో తనకు వచ్చే సమస్యలను పరిష్కరించేవాడు. తన సహచరి టెక్నికల్ రంగంలో నైపుణ్యం సంపాదించడానికి, తను ఒక టీమ్‌ను నడిపే విధంగా అభివృద్ధి చేయడంలో కా. గౌతమ్ పాత్ర ముఖ్యమైనది. ఆమె ఆరోగ్యం విషయంలో కూడా శ్రద్ధ తీసుకుని, పనిచేసే విధంగా ప్రోత్సహించేవాడు. కా. గౌతమ్ కూడా తీవ్రమైన కాళ్ల నొప్పులతో బాధపడేవాడు. అయినప్పటికీ రాజకీయ చైతన్యంతో ఎ.ఒ.బి ఎత్తైన కొండల్ని ఎక్కుతూ, ఇతరుల్ని ఉత్తేజితుల్ని చేసేవాడు. పనుల వత్తిడి తీవ్రంగా వున్నప్పుడు తను శారీరక శ్రమలో పాల్గొని, ఇతరులు పాల్గొనే విధంగా ప్రోత్సహించేవాడు.

25 ఏళ్ల విప్లవ జీవితంలో రాజకీయంగా దృఢంగా వుంటూ, ఇతరులను ఉద్యమంలో నిలబెట్టాడు. పార్టీలో ఏర్పడ్డ రెండుసంక్షోభాల కాలంలో పార్టీ పంథా వెనుక దృఢంగా నిలబడ్డాడు. ఈ రెండు సంక్షోభాల్లో కూడా టెక్నికల్ పనిలో బయటే వున్నాడు. సంక్షోభాలు ఏర్పడ్డప్పుడు తన యూనిట్ కామ్రేడ్స్‌కు ఓపికగా విషయాలు చెప్పి నిలబెట్టాడు.

తన మొత్తం జీవితం టెక్నికల్ రంగంలో గడిపినప్పటికీ, ఉద్యమంతోపాటు ఎదగడానికి తీవ్ర కృషి చేశాడు. తను పై కమిటీలోకి వస్తున్న క్రమంలో ఆర్గనైజేషన్, మిలటరీ విషయాల్లో అనుభవం సంపాదించడానికి ప్రయత్నించాడు.

ఉత్తర తెలంగాణాలో టెక్నికల్ రంగంలో ఉన్నప్పుడు మిలటరీపరంగా అధ్యయనం పెంచుకున్నాడు. ఎ.ఒ.బి కమిటీలో వుంటూ మిలటరీపరంగా, ఆర్గనేజషన్‌లో అనుభవం సంపాదించాడు. కింది కమిటీ సమావేశాలకు హాజరు కావడం ద్వారా, ఫీల్డ్‌లో తిరగడం ద్వారా ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందాడు.

ఎ.ఒ.బిలో ఎస్.ఎం.సిలో సభ్యుడిగా వుంటూ, క్రమంగా మిలటరీ విషయాల్లో తన సేవలను అందించాడు. ఉదయగిరి రెయిడ్‌లో కోర్ గ్రూప్‌లో సభ్యుడిగా వున్నాడు. ఆ సందర్భంగా జైలుపై దాడి చేసిన టీమ్‌కు కమాండర్‌గా నాయకత్వం వహించాడు. జైలుపై దాడి చేసి ఖైదీలను విజయవంతంగా విడిపించాడు.

తను అమరుడయ్యేంత వరకు మూడు సెంట్రల్ టెక్నికల్ టీం సమావేశాలకు హాజరయ్యాడు. ఈ సమావేశాల్లో చురుకుగా పాల్గొని వివిధ విషయాలను చర్చించాడు. ఇలా అన్ని రంగాలపై పట్టు సంపాదిస్తూ విశాలత్వం రాజకీయ పరిపక్వత పెంచుకున్నాడు. ఉద్యమ అవసరాలరీత్యా చాలా విషయాలు నేర్చుకున్నప్పటికీ తన మొత్తం జీవితంలో టెక్నికల్ రంగమే తన ప్రధాన బాధ్యత. ఈ రంగంలో అనేక సమస్యలు వచ్చినా, వాటిని రాజకీయంగా పరిష్కరించాడు. ఈ రంగంలో సుదీర్ఘ అనుభవం

ఉత్తర తెలంగాణ అమరులు

# మొక్కవోని దృఢ దీక్షకు నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ పద్మ

2006, అక్టోబర్ 14న అదిలాబాద్ - నిజామాబాద్ ఉమ్మడి జిల్లా కమిటీలో భాగంగా పని చేసే మంగి దళంపై గ్రేహౌండ్స్ బలగాలు చేసిన దాడిలో వీరోచితంగా పోరాడుతూ కా. పద్మ అమరురాలయింది. అమరురాలయ్యేనాటికి ఆమె ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తోంది.

ఆమె ఈ భూమ్మీద కండ్లు తెరిచేనాటికి ఒక సాధారణ నిరుపేద ఆదివాసీ బిడ్డ. కానీ ఆమె ఒక సాధారణ ఆదివాసీ మహిళగా కన్ను మూయలేదు. ఒక అద్భుత సాహస యోధగా కన్నుమూసింది. ఆమె అమరత్వాన్ని ఎత్తివడుదాం. ఆమెకు వినమ్రంగా జోహార్లర్పిద్దాం.



కామ్రేడ్ పద్మ (తొర్రం లక్ష్మీబాయి) ఆదిలాబాద్ జిల్లా ప్రాణహిత నది ఒడ్డున బెజ్జూరు మండలం సోమిన గ్రామంలో దాదాపు 35 ఏళ్ల క్రితం పేద ఆదివాసీ కుటుంబంలో తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా పురుడు పోసుకున్నది.

కుటుంబ ఆర్థిక స్థితిగతుల వల్ల కా. పద్మ బడి ముఖం చూడలేదు. కూలీ నాలి చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలబడింది. ఆమెకు యుక్త వయస్సు రాగానే తల్లిదండ్రులు జిల్లెడ గ్రామానికి చెందిన పోర్తేటి పాపయ్యతో ఆదివాసీ సాంప్రదాయ బద్ధంగా 1993లో వివాహం చేశారు.

అప్పటికే పాపయ్య దండకారణ్య ఆదివాసీ రైతుకూలి సంఘం కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. ఆ తర్వాత దళంలో చేరాడు. ఈ పరిణామాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానించింది కా. పద్మ.

పాపయ్యను పట్టి ఇవ్వాలని కా. పద్మపై పోలీసుల ఒత్తిడి, వేధింపులు పెరిగాయి. ఇంటిపై దాడులు జరిగాయి. పద్మ ధైర్యంగా ఆ నిర్బంధాన్ని ఎదుర్కొంది. ఈ క్రమంలో ఒక కొడుకుకు తల్లి అయింది. మూన్నెల్ల వయస్సు గల కొడుకును వదిలి 1994లో ఉద్యమంలో చేరింది.

1994లో సిర్పూరు దళంలోకి రిక్రూట్ అయిన కా. పద్మ 1999 వరకు దళ సభ్యురాలుగా పని చేసింది. 1999లో ఇంద్రవెల్లి ఏరియా కమిటీ సభ్యురాలయింది. ఆ తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా సిర్పూరు-చెన్నూరు ఏరియా కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. ఆ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడంలో కృషి చేసింది. సిర్పూరు, చెన్నూరు ఉద్యమాలను గైడ్ చేసిన డిసిఎం, ఆ ఏరియా కమిటీ కార్యదర్శి, సభ్యులూ దిగజారినా కూడా కా. పద్మ తొణకకుండా, బెణకకుండా స్థిరంగా పని చేస్తూ ఆ ఏరియా కమిటీకి కార్యదర్శిగా ఎదిగింది. నష్టాలు, లొంగుబాట్లతో దెబ్బతిన్న ఉద్యమాన్ని నిలబెట్టడంలో తీవ్రంగా కృషి చేసింది. తన విప్లవ జీవిత కాలంలో ఎక్కువ కాలం సిర్పూరు, చెన్నూరు ఏరియాలలో పని చేసింది. ఆ ప్రాంతంలో పద్మ అంటే తెలియని వారు లేరంటే అతిశయోక్తి

---

వున్న కా. గౌతమ్ అమరత్వం గెరిల్లా జోన్ ప్రాంతాలకు, విముక్తి ప్రాంత లక్ష్యంతో పని చేస్తున్న ఉద్యమాలకు తీవ్రమైన లోటు.

కా. గౌతమ్‌ను విజయవాడలో పోలీసులు అరెస్టు చేయగానే ప్రజా సంఘాలు వెంటనే స్పందించాయి. అయినా పోలీసులు కాల్చిచంపి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారు. తన సహచరి కామ్రేడ్ జయను అరెస్టు చేసిన పోలీసులకు ప్రజాసంఘాలు, ప్రజల నిరసనతో ఆమెను కోర్టుకు హాజరుపర్చక తప్పలేదు. కా. గౌతం మృతదేహం తన స్వగ్రామం రాగానే ప్రజలు, ప్రజాసంఘాల కార్యకర్తలు, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరులు వేలాదిగా తరలివచ్చారు. వేలాది మందితో గౌతమ్ అంతిమయాత్రను జరిపారు. ప్రజలను అంతిమయాత్రకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నా, పోలీసు జులూంను తిప్పికొడుతూ కా. గౌతమ్‌కు ఎర్రెర్ర నివాళులు అర్పించారు. ప్రజాసంఘాల నాయకులను రానివ్వకుండా అరెస్టులు చేశారు. అయినా, విప్లవ నినాదాల మధ్య కా. గౌతమ్ అంతిమ యాత్ర జరిపి నివాళులు అర్పించారు. తన సంస్మరణ సభను వేలాది మందితో జరిపి తన బాటలో కొనసాగుతామని ప్రతినబూనారు. హంతక వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేసారు.

కా. గౌతమ్ త్యాగపూరిత జీవితాన్ని పుణికి పుచ్చుకుందాం. తన బాటలో సమసమాజ స్థాపన కొరకు నడుద్దాం. ఇదే కామ్రేడ్ గౌతమ్‌కు అర్పించే అంతిమ నివాళి.

కాదు. 2005 నవంబరులో కా. పద్మ అదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలుగా బాధ్యతలు స్వీకరించింది.

చంద్రబాబు నాయుడు, ఆ తరువాత వై.ఎస్ రాజశేఖర్ రెడ్డిల పాలనల్లో శత్రువు బహుముఖ దాడుల మధ్య కూడా చొరవతో ప్రజల మధ్యలోకి పోయి సంబంధాలు కొనసాగించింది. వారిని విప్లవోద్యమం వెనుక నిలబెట్టింది. చర్చల కాలంలో వచ్చిన వెసులుబాటు కాలంలో ప్రజా సంబంధాలు, ప్రజా పునాదిని పెంచడానికి సిర్పూరు, చెన్నూరు ప్రాంతంలో ఎనలేని కృషి చేసింది. ప్రజా సంఘాలను, ప్రజా మిలీషియా యూనిట్లను నిర్మించింది. బబ్బర్ చెలక, కమ్మర్‌గాం గ్రామాలలో అమరవీరుల స్థూపాలను నిర్మించడానికి కృషి చేసింది. ఆ స్థూపావిష్కరణ కార్యక్రమాలకు వందలాది మంది ప్రజలను నిర్బంధం మధ్య కూడా కదిలించింది.

కామ్రేడ్ పద్మ పార్టీ సంబంధాల్లోకి వచ్చిన తర్వాతనే చదవడం, రాయడం నేర్చుకుంది. అయినప్పటికీ విషయాలను అర్థం చేసుకోవడంలో చాలా చురుగ్గా వుండేది. రాజకీయ తరగతులలో విన్న పాఠాలను చక్కగా అర్థం చేసుకొని, తిరిగి క్యాడర్‌కు సులువుగా అర్థం అయ్యేలా బోధించేది. పలు విషయాల పట్ల లోతుగా ఏకధాటిగా మాట్లాడేది.

మిలటరీ విషయాలను సైతం చురుగ్గా అర్థం చేసుకునేది. నేర్చుకున్నదాన్ని ఆచరించడంలోనూ, కింది క్యాడర్‌కు నేర్పడంలోనూ ఆదర్శంగా ఉండేది.

పై స్థాయి నాయకత్వంతో ఏ సంకోచం లేకుండా సన్నిహితంగా మెదులుతూ వారి వద్ద నుంచి పలు విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తిని చూపేది. ఎల్లప్పుడూ విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి తపన పడేది.

ఈ క్రమంలో ఆమె భర్త పాపయ్యలో అన్యవర్గ ధోరణులు పెరిగిపోయాయి. కామ్రేడ్ పద్మ అతని తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటం చేసింది. చివరకు అతను ఉద్యమం నుంచి వెళ్లిపోవడానికి సిద్ధపడి ఆమెను కూడా తనతో తీసుకు వెళ్లాలని తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ ఆమె విప్లవ దీక్ష ముందు అతని ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి 2001లో అతను శత్రువు ముందు లొంగిపోయాడు.

ఇలా అన్ని విషయాల్లో దృఢంగా నిలబడుతూ అదిలాబాద్ జిల్లా ఉద్యమంలో కీలకమైన పాత్రను పోషిస్తోన్న పద్మను లొంగదీసుకోవాలని పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కౌన్సిలింగ్‌ల పేరుతో ఆమె కుటుంబాన్ని వేధించారు. లొంగిపొమ్మని పలుసార్లు ప్రకటనలు ఇచ్చారు. లొంగిన పాపయ్యను ఆదర్శంగా చూపెడుతూ ప్రచారం గావించారు. పద్మ కన్న కొడుకుతో "అమ్మా....రా..." అంటూ ప్రకటనలు ఇప్పించారు. అంతేకాదు ఆమె కొడుకును దత్తత పేరుతో పోలీసులు తమ అధీనంలో ఉంచుకున్నారు. అలా కన్న కొడుకును అడ్డం పెట్టుకొనైనా ఆమెను లొంగదీసుకోవాలనుకున్నారు. పోలీసుల ఈ ఎత్తులేవీ ఆమె దృఢత్వాన్ని కొంచెం కూడా సడలించలేకపోయాయి.

ఆమెను లొంగదీసుకోలేకపోయిన పోలీసులు ఆమెను కుట్రపూరితంగా చంపడానికి కూడా ప్రయత్నించారు. కొంత మంది ఆదివాసీ యువకులను నయాన, భయాన లొంగదీసుకొని దళానికి అన్నంలో విషం కలిపి పెట్టించారు. కొంచెం అన్నం తిన్న తర్వాత ఈ కుట్రను అర్థం చేసుకున్న పద్మ వెంటనే అందరితో అన్నం పారవేయించింది. ఆ తర్వాత మకాం మార్చి అందరికీ చికిత్స చేసింది.

పద్మ పన్నెండు సంవత్సరాల విప్లవ జీవిత కాలంలో శత్రువు జరిపిన అనేక దాడులను ఎదిరించడంలోనూ, శత్రువుపై చేసిన దాడుల్లోనూ చురుకుగా పాల్గొన్నది. రాచార్ల, బుద్దారం, బాబాసాగర్, వాయిపేట, అగురుగూడ ఎన్‌కౌంటర్లలో ఆమె పాల్గొంది. ఆగురుగూడ (2003 మే 14న)లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి కా. లలితక్క (ఎల్లంకి అరుణ)తో పాటు ఉన్న కామ్రేడ్స్‌ను దాదాపు వెయ్యి మంది గ్రేహౌండ్స్ బలగాలు చుట్టుముట్టినాయి. ఈ దాడిలో వీరోచితంగా పోరాడుతూ రిట్రీట్ అవుతున్న క్రమంలోనే కా. లలితక్కతో పాటు మరో ఇద్దరు కామ్రేడ్స్ శత్రువు తూటాలకు నేలకొరిగినారు. ఆ సంఘటనలో కా. పద్మ ధైర్యంగా పోరాడుతూ శత్రు మూకల దాడిని తిప్పి కొడుతూ మిగితా కామ్రేడ్స్‌ను రిట్రీట్ చేసింది.

1999 నవంబర్ - డిసెంబర్‌లలో (సిర్పూర్ ఏరియా) సలుగుపల్లి వద్ద గెరిల్లా దళం చేసిన ఆంబుష్‌లో పోలీసులు చచ్చారు. ఈ ఆంబుష్‌లో కా. పద్మ చురుకుగా పాల్గొన్నది. ఇదే సంవత్సరంలో కాగజ్ నగర్ డి.ఎస్పీ ఆఫీసుపై చేసిన దాడిలో ముగ్గురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. మూడు ఎస్.ఎల్.ఆర్‌లు పి.ఎల్.జి.ఎ స్వాధీనమయ్యాయి. ఈ రెయిడ్ విజయవంతం కావడంలో కా. పద్మ కృషి ఎంతో వుంది. ఎన్‌కౌంటర్ల సందర్భంగా నాయకత్వాన్ని రక్షించుకోవడానికి తెగించి పోరాడేది. కెరెగూడ ఎన్‌కౌంటర్లోనూ అదే విధంగా నాయకత్వాన్ని రక్షించుకోవడం కోసం శత్రువుతో దృఢంగా పోరాడుతూనే నేలరాలింది.

కామ్రేడ్ పద్మ జీవితం ఆదర్శాల మయం. ఆ ఆదర్శాలను ఆచరించడమే ఆమెకు మనం ఇచ్చే నివాళి.

# శత్రువు గుండెల్లో ప్రకంపనాలు సృష్టించిన కామ్రేడ్ మధు

2006, సెప్టెంబర్ 15వ తేదీన ఊరట్టం అడవుల్లో శత్రువుతో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరోచితంగా పోరాడుతూ కరీంనగర్-ఖమ్మం-వరంగల్ (కె.కె.డబ్ల్యు) డివిజన్‌కు చెందిన కామ్రేడ్స్ మధు, నిర్మల, గీత, పద్మలు వీరమరణం పొందారు. అమరత్వం చెందేనాటికి కామ్రేడ్ మధు కె.కె.డబ్ల్యు డివిజన్ కమిటీలో కార్యదర్శివర్గ సభ్యుడిగా బాధ్యతలు నెరవేర్చుతున్నాడు. కామ్రేడ్స్ నిర్మల, గీత, పద్మలు ఎల్.జి.ఎస్ సభ్యులుగా పని చేస్తున్నారు.

కామ్రేడ్ మధు (సారన్న) వరంగల్ జిల్లా చిట్యాల మండలం భౌసింగ్ పల్లిలో జన్మించాడు. ఉత్తర తెలంగాణలో 1985 నిర్బంధాన్ని తిప్పికొట్టి 1989 నుండి నూతన వెల్లువగా ముందుకొచ్చిన రైతాంగ పోరాటాలతో ఉత్తేజితుడైన సారన్న గ్రామంలోని భూ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ప్రజల్ని కదిలించి భూస్వాముల భూముల్లో ఎర్రజెండాలు నాటించి భూ ఆక్రమణ పోరాటాలు చేశాడు. భూస్వాములా, బి.జె.పి గూండాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దళితులను కూడగట్టాడు.



1992 నుండి మళ్లీ పెరిగిన నిర్బంధంలో పోలీసులు మధు ఇంటిని కూలగొట్టి, తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసినా చెక్కు చెదరని ధైర్యంతో శత్రువుకు చిక్కకుండా చాకచక్యంగా తప్పుకుంటూ, సంఘాన్ని, ప్రజలను సంఘటితపరిచి పోరాడి సాధించుకున్న విజయాలను నిలబెట్టుకోవడానికి కృషి చేశాడు. ఆ క్రమంలో గిట్టుబాటు ధరలూ, కరెంటు లో ఓల్టేజి తదితర రైతాంగ సమస్యలపై ముందు నిలిచి రైతాంగాన్ని మిలిటెంట్ పోరాటాల్లో నడిపించాడు. సారా నిషేధం కొరకు పోరాటం సాగించాడు.

తీవ్ర నిర్బంధంలో బూటకపు ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల మధ్య కూడా మొక్కవోని ధైర్యంతో సంఘంలో పనిచేస్తూ, ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించాడు. పార్టీ పిలుపునందుకుని 1992లో ఎన్.టి.ఎఫ్.డిలోని ఖమ్మం జిల్లాకు పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. ఏటూరునాగారం దళ సభ్యుడిగా ప్రారంభమైన విప్లవ ప్రయాణంలో అమరడయ్యే వరకు 14 సంవత్సరాల పాటు కా. మధు వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించాడు. నిప్పులు చెరిగే నిర్బంధంలో అనేక సవాళ్ల మధ్య కా. మధు ఎంతో నిబ్బరంగా, పరిస్థితులను ఆకళింపు చేసుకుంటూ, పట్టు సాధించే కృషి చేస్తూ దళానికి పైలెట్‌గా, కష్ట కాలంలో కొరియర్‌గా బాధ్యతలు నెరవేర్చాడు. ఇంటి దగ్గర చదువుకోకపోయినా పట్టుదలతో ప్రాథమిక విద్య నేర్చుకుని, పార్టీ సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు.

1994లో ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగి శత్రు నిర్బంధం వల్ల నష్టాలకు గురైన ఏటూరునాగారం ఉద్యమాన్ని పునర్నిర్మించడంలో తన కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించాడు. 1996లో ఎల్.జి.ఎస్ కమాండర్‌గా, 1998లో ఏరియా కమిటీ కార్యదర్శిగా, 2000 సంవత్సరంలో జరిగిన జిల్లా కాన్ఫరెన్స్‌లో డివిజన్ కమిటీ సభ్యుడిగా స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగాడు.

1992 నుండి డివిజన్‌లో శత్రువుపై జరిగిన ముఖ్యమైన దాడుల్లో కా. మధు సాహసోపేతంగా పాల్గొని గొప్ప సైనికుడిగా, సమర్థుడైన గెరిల్లా కమాండర్‌గా ఎదిగాడు. 1992లో నార్లాపూర్ పోలీసు స్టేషన్‌పై, 1993లో పూరేడుగుపల్లి గ్రామంలో భూస్వామికి రక్షణగా వున్న పోలీసు క్యాంపుపై చేసిన దాడుల్లో చురుకైన పాత్ర వహించాడు. 1995లో వెంకటాపురం పోలీసు స్టేషన్‌పై జరిగిన దాడిలో పాల్గొన్నాడు. 1996లో 16 మంది పోలీసులను నిరాయుధులను చేసి... 

1998లో పస్రా పోలీసు స్టేషన్‌కు అతి సమీపంలో ఎం.ఎల్.ఎ ఇంటిపై దాడి చేసి, గన్‌మెన్‌ల నుండి రెండు ఆయుధాలను స్వాధీనం చేసుకున్న యాక్షన్ టీంకూ, అదే సంవత్సరంలో మెట్లగూడెం రోడ్డులో పోలీసు వాహనంపై ఆంబుష్‌లో పది మంది పోలీసులను మట్టికరిపించి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న దళానికి కమాండర్‌గా సమర్థవంతమైన పాత్ర నిర్వహించాడు. 1999 డిసెంబర్ 6న ఏటూరునాగారం పట్టణ నడిబొడ్డున పోలీసు జీపుపై ఆంబుష్ చేసి ముగ్గుర్ని హతమార్చి, నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకుని, కొయ్యూరు అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల హత్యాకాండతో విర్రవీగుతున్న

శత్రువుకు సవాల్ విసిరాడు. గుర్రేవులలో కొయ్యూరు అమరుల స్థూపాన్ని నిర్మించి, శత్రువు కండ్లుగప్పి వేలాది మంది ప్రజలతో సంస్మరణ సభను విజయవంతం చేశాడు.

2000 డిసెంబర్ పి.ఎల్.జి.ఎ ఆవిర్భావం సందర్భంగా కామ్రేడ్ మధు ప్లాటూన్ కమాండర్‌గా, సబ్ కమాండ్ మెంబర్‌గా పార్టీ అప్పగించిన బాధ్యతలను స్వీకరించాడు. పార్టీ చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ (టి.సి.ఒ.సి)లను విజయవంతం చేయడానికి విరామమెరుగని కృషి చేశాడు. 2001లో ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌పై డైరెక్షనల్ మైన్‌తో దాడి చేసి శత్రువుకు కంటి మీద కునుకు లేకుండ చేశాడు. మిలటరీ జ్ఞానాన్ని ఎంతో శ్రద్ధగా గెరిల్లాలకు బోధించి మంచి నిపుణుడైన మిలటరీ ఇన్‌స్ట్రక్టర్‌గా గుర్తింపు పొందాడు.

2002లో జరిగిన తుపాకులగూడెం ఎన్‌కౌంటర్లో వందలాది బలగాలతో క్యాంపును చుట్టుముట్టిన శత్రువు చక్రబంధాన్ని ఛేదించి నాయకత్వాన్ని రక్షించడానికి తన ప్లాటూన్‌ను ముందుకు నడిపి క్రూరుడైన ఎస్.ఐ సంజీవ్‌ను హతమార్చాడు. శత్రువుతో జరిగిన హోరాహోరీ పోరాటంలో తన సహచర గెరిల్లాయోధులు తొమ్మిది మంది నేలకొరిగి, తను గాయపడినప్పటికీ గొప్ప ధైర్య సాహసాలతో అందరినీ రక్షించడానికి తన శాయశక్తులా ప్రయత్నించాడు. అనేక ఎన్‌కౌంటర్లలో, శత్రువును నిర్మూలించే దాడుల్లో గెరిల్లా బలగాలకు నాయకత్వం వహించే సమర్ధుడైన మిలటరీ కమాండర్‌గా క్యాడర్ల విశ్వాసాన్ని చూరగొన్నాడు.

కా. మధు సమర్థుడైన మిలటరీ కమాండరేగాక, మంచి ఆర్గనైజర్ కూడ. పీడిత వర్గ పునాది నుండి వచ్చి, విప్లవ నాయకుడిగా ఎదిగాడు. దళ సభ్యుడి నుండి డివిజనల్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడి వరకు ఏటూరునాగారం ప్రాంతంలో పనిచేసి, అనేక మిలిటెంట్ పోరాటాలు నిర్వహించి, విలువైన అనుభవాలు సంపాదించాడు. ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీలక పాత్రను పెంచడంలో సృజనాత్మక పద్ధతులను అనుసరిస్తూ, ప్రజలను సంఘటితం చేయడంలో నిర్మాణదక్షతగల ఆర్గనైజర్.

ప్రజల నుండి నేర్చుకుని ప్రజలకు బోధించడమనే ప్రజా పంథాను తు.చ తప్పక ఆచరించి, ఉన్నతమైన కమ్యూనిస్టు విలువలతో కడదాకా ముందుకు నడిచిన కార్మికవర్గ ఉత్తమ పుత్రుడూ, మంచి కమ్యూనిస్టూ కా. మధు. ఆచరణ నుండి, అధ్యయనం నుండి నేర్చుకుంటూ, వర్గపోరాట కొలిమిలో నిత్యం రాటుదేలుతూ, ఉద్యమావసరానికి తగినట్లుగా తనను తాను మలుచుకుంటూ నిత్య నూతన విప్లవోత్తేజంతో ప్రయాణం సాగించాడు.

తను అమరుడైతే, తన జీవిత చరిత్ర క్రాంతిలో రెండు పేజీలు వస్తుందని ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్పేవాడు. అవును, అనన్యమైన త్యాగాలతో విప్లవ వినీలాకాశంలో అరుణతారలుగా వెలుగొందుతున్న అమరయోధుల జీవిత చరిత్రలు రెండు పేజీలతో ఆవిష్కరించలేనివి. విప్లవ పోరాటంలో కా. మధు నెలకొల్పిన ఆదర్శాలను ప్రతినిత్యం మన మనోఫలకాలపై లిఖించికుని ఆచరిస్తూ తన విలువైన అనుభవాల నుండి నేర్చుకుని, ఆయన ఆశయసాధనకై మరింత దృఢంగా కంకణబద్ధులమవుదాం.

## కామ్రేడ్ నిర్మల (వసంత)



కా. నిర్మల వరంగల్ జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో విప్లవకారుల కుటుంబంలో జన్మించింది. తన అన్న సంఘంలో పని చేయడం వల్ల చిన్నప్పటి నుండే విప్లవ రాజకీయాలతో పరిచయం కలిగింది. తను వివాహమాడిన రాయకొమురు (రమాకాంత్) సంఘ కార్యకలాపాల్లో అప్పటికే చురుగ్గా పాల్గొంటూ వుండడంతో విప్లవ రాజకీయాలకు మరింత దగ్గరైంది. రమాకాంత్‌ను లొంగిపోవాలని పోలీసులు కుటుంబాన్నీ, తననూ కౌన్సిలింగ్‌ల పేరిట వేధింపులకు గురి చేసినా తన వారందరికీ ధైర్యం చెపుతూ ఎంతో గుండె నిబ్బరంతో వుండేది.

మహిళా విముక్తికి విప్లవ మార్గమే సరైనదనే విప్లవ భావాలను రమాకాంత్ నుండి నేర్చుకున్న నిర్మల తను కూడా అదే బాటలో ప్రయాణించడానికి నిర్ణయించుకుని 2004 చర్చల సమయంలో పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలోకి వచ్చింది. నర్సంపేట, ఏటూరునాగారం దళాల్లో పని చేసింది. కష్టపడి చదువు నేర్చుకుని, మహిళలకు విప్లవ రాజకీయాలు బోధించేది. తన శరీరం సహకరించకున్నా, విప్లవ పోరాటంలో పీడిత ప్రజల ప్రయోజనాల కోసం తుది శ్వాస వరకు అంకితమవుతానంటూ చిరునవ్వుతో మృత్యువును గేలిచేసింది. కామ్రేడ్ నిర్మల ఆశయ సాధనలో దృఢంగా పోరాడుతూ, ఆ కామ్రేడ్ కలల్ని సాకారం చేస్తామని శపథం చేద్దాం.

## కామ్రేడ్ గీత (ప్రమీల)

ఊరట్టం అడవుల్లో 2006 సెప్టెంబర్ 15న జరిగిన బూటకపు ఎదురుకాల్పుల్లో అసువులు బాసి, ఉత్తర తెలంగాణ విప్లవ వనంలో ఎర్ర మందారమై వికసించిన వీర వనిత కా. గీత. వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలంలో విప్లవోద్యమానికి బలమైన గ్రామమైన బుట్టాయిగూడెంలో జన్మించింది.

ఇంటికి పెద్ద కూతురుగా తల్లిదండ్రులకు అన్నింటా చేదోడుగా నిలిచి కుటుంబం కోసం కష్టపడి పని చేసింది. చర్చల వెసులుబాటు కాలంలో పుంజుకున్న పోరాటాలు తన గ్రామానికి కూడా వ్యాపించడంతో ఉత్తేజితురాలైంది. గ్రామంలో జరిగే సారా వ్యతిరేక పోరాటాల్లో పాల్గొనాలని ఎంతో పరితపించినా, తనను గడపదాటనీయని పితృస్వామ్య సమాజపు కట్టుబాట్ల బంధనాలను ఛేదించుకొని బయటకు రావాలని అనుక్షణం సంఘర్షించింది. గ్రామ సంఘాన్ని కలుస్తూ విప్లవ రాజకీయాలను అలవర్చుకుంది. దళంలో చేరాలనే ప్రతిపాదనను సంఘం ముందుంచి, దళంతో పరిచయం ఏర్పరచుకుని చర్చల అనంతర కాలంలో పూర్తి కాలం కార్యకర్తగా ఏటూరునాగారం ఎల్.ఒ.ఎస్‌లో చేరింది. గృహ నిర్బంధం, రాజ్యం యొక్క దోపిడీ అణచివేతలకంటే శత్రు నిర్బంధం ఎక్కువేమీకాదని గెరిల్లా జీవితపు కష్ట నష్టాల్ని చిరునవ్వుతో స్వీకరించింది. దళంలోని సమిష్టి పనుల్లో చురుగ్గా పాల్గొనేది. తనకప్పగించిన పనులు ఎంతటి కష్టమైనా బాధ్యతాయుతంగా పరిపూర్తి చేసేది. క్రమశిక్షణకు మారుపేరుగా వుండేది. పట్టుదలతో చదవడం, రాయడం నేర్చుకుంది. ఏరియాలో ఉద్యమానికి ముప్పుగా తయారైన ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌ను దెబ్బతీయటంలో భాగంగా విప్లవ ద్రోహుల్ని నిర్మూలించటంలో ముందుండేది.

కామ్రేడ్ గీత క్రమశిక్షణ, పట్టుదల, దృఢ సంకల్పాలు ఆదర్శంగా నూతన ప్రజాస్వామిక రాజ్యం కోసం పోరాటం సాగిస్తూ దృఢంగా ముందుకు నడుద్దాం.

## కామ్రేడ్ ముడిగే పద్మ

ఆకాశంలో సగం, సమాజంలో సగం మేము అని పితృస్వామ్య సమాజంలో అన్ని రకాల దోపిడీతోపాటు అదనంగా పురుషాధి పత్యానికి గురవుతున్న మహిళల విముక్తి వర్గపోరాటం ద్వారానే సాధ్యమని సాయుధమైన కా. పద్మది వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం చింతగూడెం గ్రామం.

వృద్ధ తల్లిదండ్రులకు పెద్ద కూతురుగా కా. పద్మ కుటుంబ పోషణ భారాన్ని తన భుజాలపై వేసుకుని ఇంటింటికి తిరిగి పాలు పెరుగమ్మి, కూలినాలి పనులు చేసి, తను చదవలేకపోయినా తమ్ముళ్లిద్దరినీ విద్యావంతులను చేయడానికి ఎంతో శ్రమించింది. గ్రామానికి వచ్చే దళంతో చిన్న వయసునుండే పరిచయమున్న పద్మ దళం బోధించే విప్లవ రాజకీయాలను శ్రద్ధగా అర్థం చేసుకునేది. బతుకు పోరులో రాటుదేలిన పద్మ దోపిడీ, దారిద్ర్యం, పేదరికం నిర్మూలనకూ, స్త్రీ విముక్తికి వర్గపోరాటమే సరైన మార్గమని నిర్ణయించుకుని 2001లో పూర్తి కాలం కార్యకర్తగా దళంలో చేరింది.

ఐదు సంవత్సరాల తన విప్లవ జీవితంలో పార్టీ చేపట్టిన అనేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొని ప్రజల్ని కదిలించింది. చర్చల కాలంలోని వెసులుబాటులో సభలకు విస్తృతంగా ప్రజలను సమీకరించడం, నిర్మాణాల్లో సంఘటితం చేయడం, అమరుల స్థూపాలు నిర్మించటంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయడానికి కృషి చేసింది. శత్రువు తయారు చేసిన ఇన్‌ఫార్మర్‌లపై నిఘా వేసి, దళం చేపట్టిన నిర్మూలనా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నది.

అరమరికలు లేకుండా అందరితో కలిసిపోయి ప్రజల సమస్యలు తెలుసుకోవటంలో చొరవచూపేది. మహిళల సమస్యలు శ్రద్ధగా విని, పరిష్కరించడానికి ప్రయత్నించేది. ఏటూరునాగారం ఏరియాలో, గోదావరి బెల్ట్‌లో కా. పద్మ అందరికీ సుపరిచితురాలు. శత్రు నిర్బంధానికి వెరచి కొందరు దిగజారినా, నమ్మిన ఆశయం కోసం చివరి శ్వాస వరకు మొక్కవోని దీక్షతో పోరాడిన ధీరవనిత కా. పద్మ. పీడిత ప్రజల విముక్తికి, నూతన సమాజ స్థాపనకూ అమరులు కలలుగన్న ఆశయ సాధనకై కృతనిశ్చయంతో పోరాడుతూ కామ్రేడ్ పద్మ అమరత్వానికి నివాళులర్పిద్దాం.

## కామ్రేడ్ కిరణ్ (మగ్గిడి నాగరాజు)

కరీంనగర్ జిల్లా, ధర్మారం మండలం, నందిమేడారం కిరణ్ స్వగ్రామం. ఇంటర్మీడియట్ చదువుతూ విప్లవ రాజకీయాలపట్ల ఆకర్షితుడైనాడు. కిరణ్ మేనమామ కామ్రేడ్ భీమన్న 1992లో బూటకపు ఎన్‌కౌంటర్లో అమరుడు కావటంతో సహజంగానే కిరణ్‌లో దోపిడీ, అన్యాయం, అసమానతల పట్ల వ్యతిరేక భావాల సంఘర్షణ మొదలైంది.

పార్టీ పరిచయంతో విప్లవ రాజకీయాలను మరింత లోతుగా అర్థం చేసుకుని, భూస్వాముల, పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా యువకులను కూడగట్టి పోరాడుతూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. పార్టీ పిలుపునందుకుని

2001లో పూర్తికాలం కార్యకర్తగా, పెద్దపల్లి ఎ.సి పరిధిలోని రామగుండం ఎల్.జి.ఎస్‌లో సభ్యుడిగా చేరాడు. పార్టీ నిర్ణయించిన అనేక సింగిల్ యాక్షన్లలో ముఖ్యమైన పాత్ర వహించాడు. జమ్మికుంట ఎల్.ఒ.ఎస్ సభ్యుడిగా పని చేస్తూ, వీణవంక మండలంలో ఒక గ్రామానికి వచ్చిన ఎస్.ఐ కుమారస్వామిని ముగ్గురు సభ్యుల టీంతో వెళ్లి ఖతం చేసి, ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ముంజంపల్లిలో కా. రాంరెడ్డిని బూటకపు ఎన్‌కౌంటర్లో హత్య చేయించిన విప్లవ ద్రోహి, ఇన్‌ఫార్మర్ లచ్చయ్యను హతమార్చాడు. 2002లో జిల్లా యాక్షన్ టీంలో పని చేసి, మాజీ సి.ఒ నల్లదండు ముఠా సభ్యుడైన దాసరి రాములును, విప్లవ ద్రోహులైన పోలారం సర్పంచ్ రాజయ్యను, టి.డి.పి లీడరైన జమ్మికుంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణను తన టీంతో వెళ్లి హతమార్చాడు. దళంపై జరిగిన అనేక ఆంబుష్‌లలో ధైర్యంగా పోరాడుతూ రిట్రీటయ్యాడు.

పోలీసులు తన కుటుంబాన్ని వేధింపులకు గురిచేసినా, జిల్లా కమిటీ సభ్యుడు, కమాండర్ నిర్బంధానికి భయపడి శత్రువు ముందు లొంగిపోయినా కా. కిరణ్ దృఢ సంకల్పంతో చివరి వరకు ఉద్యమానికే అంకితమయ్యాడు. దళ సభ్యుడిగా, కొరియర్‌గా, టీచర్‌గా అనేక పనులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాడు. 2002లో ఎల్.ఒ.ఎస్ కమిటీ మెంబర్‌గా స్వయం కృషితో ఎదిగాడు. 2003లో కా. కిరణ్, లలితలు దంపతులయ్యారు. కిరణ్‌లోని మంచి క్రమశిక్షణ, చురుకుదనం, సమిష్టి పని విధానం, పట్టుదల మనకు ఆదర్శం. అతడి ఆశయ సాధనకై దృఢ సంకల్పంతో ముందుకు నడుద్దాం.

## కామ్రేడ్ లలిత (కనక లక్ష్మి)

కా. కనక లక్ష్మి కరీంనగర్ జిల్లా, ధర్మారం మండలం మేడారం గ్రామంలోని పేద రైతు కుటుంబంలో జన్మించింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలోనే ఆపివేసింది. తాగుడుకు బానిసైన తండ్రి, కుటుంబాన్ని పెట్టే వేధింపులను చిన్నతనం నుండీ తల్లీ, తోబుట్టువులతో కలిసి ఎదుర్కొంది. పితృస్వామ్య అణచివేత, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరి, అవినీతి, అన్యాయాలను బాల్యం నుండే చూసింది. కుటుంబంపై తండ్రి వేధింపులకు వ్యతిరేకంగా పోరాడుతూ భూస్వాములు, పెత్తందారులు చేసిన పంచాయితీలో కుల బహిష్కరణకు గురైంది. ఇటువంటి అణచివేత వ్యతిరేక పోరాటంలో పార్టీ పరిచయంతో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితురాలైంది.

గ్రామంలో మహిళలను కూడగడుతున్నదని ఆగ్రహించిన పెత్తందార్లు పోలీసులతో వేధింపులకు గురిచేసినా ధైర్యంగా నిలబడింది. చదువు ఆగిపోయినా గ్రామంలో ప్రయివేట్ టీచరుగా పని చేసింది. పార్టీలో పని చేయాలనే భావాలు బలపడే క్రమంలో కరీంనగర్‌లో నర్సుగా పని చేసి వైద్యంలో మంచి తర్ఫీదు పొందింది. కుటుంబంపై తండ్రి వేధింపులతో తీవ్రంగా ఘర్షిస్తున్న లలిత కొంతకాలం పార్టీ కలయిక ఆలస్యం కావటం వల్ల కుటుంబ సమస్య పరిష్కరిస్తామని చెప్పిన నకిలీ నక్సల్స్ ముఠా మాటలకు మోసపోయి, వారి వెంట వెళ్లి పోలీసులకు చిక్కి మూడు నెలలు



జైలు జీవితం గడిపింది. జైలు నుండి విడుదలైన లలితకు పార్టీ కలవడంతో 2004 అక్టోబర్‌లో పూర్తి కాలం కార్యకర్తగా దళంలో చేరింది.

ఏటూరునాగారం ఏరియాలో మహిళా టీంలో పని చేసింది. రాడికల్ విద్యార్థి సంఘంలో విద్యార్థులను ఆర్గనైజ్ చేసింది. 2005లో ఎల్.ఒ.ఎస్ కమిటీలోకి ప్రమోట్ అయి శబరి ఎల్.ఒ.ఎస్‌లో పని చేసింది. ప్రజలతో చొరవగా సంబంధాలు పెంచుకుంటూ, నాయకత్వ బాధ్యతలు వహించాలని పరితపిస్తూ, పట్టుదలతో నేర్చుకునేది. పితృస్వామ్యంపై నిరంతరం పోరాటం చేసింది. డాక్టర్‌గా ప్రజలకు, దళంలోని కామ్రేడ్స్‌కు మంచి సేవలందిస్తూ, అందరికీ నేర్పించడానికి కృషి చేసేది. విప్లవ ప్రయాణంలో కా. కిరణ్‌తో జీవితాన్ని పంచుకుంది.

ఏరియాకు పోయి, తిరిగి వస్తున్న క్రమంలో 2007 జనవరి 11న ఆంధ్ర - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలైన ఉట్ల, తడపాల మధ్య గ్రేహౌండ్స్ పోలీసుల మాటు దాడిలో అమరురాలైంది.

కామ్రేడ్ లలిత క్రమశిక్షణ, పట్టుదల, పోరాటతత్వం ఆదర్శంగా ఆమె కలలుగన్న నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కొరకు పిడికిలి బిగించి పోరాడుతూ, లలిత ఆశయసాధనకై పునరంకితమవుదాం.

## కామ్రేడ్ గుండెబోయిన యాదగిరి

వరంగల్ జిల్లా నర్మెట్ట మండలంలో పార్టీకి పెట్టని కోట లాంటి బొమ్మకూర్ గ్రామంలో పేద కుటుంబంలో యాదగిరి జన్మించాడు. గ్రామ సంఘంలో పని చేస్తూ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి, భూ ఆక్రమణ పోరాటాల్లో ప్రజల్ని కదిలించి, అరెస్టయి జైలు జీవితం అనుభవించాడు.

కుటుంబ పోషణకు ఆటో నడుపుకుంటూ నిత్య నిర్బంధంలో కూడా పార్టీని అంటిపెట్టుకుని వున్నాడు. 2002లో దామెర ఎన్‌కౌంటర్లో చేర్యాల దళం మొత్తం దెబ్బతిన్న సమయంలో, కొత్తగా వచ్చిన బాధ్యులకు వెంట వుండి ఏరియాలో తిప్పి, ప్రజలతో సంబంధాలు ఏర్పాటు చేశాడు. తీవ్ర నిర్బంధంలో కూడా దళాన్ని కాపాడుతూ, శత్రు సమాచారాన్ని దళానికి అందించేవాడు. మైదాన ప్రాంతంలో దళం కలయిక లేకున్నా వివిధ కవర్‌లలో, పార్టీ కమిటీలలో పని చేస్తూ, పార్టీ తన కప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ, నిబద్ధతగల పార్టీ సభ్యునిగా కొనసాగాడు.

నిత్యం పోలీసులు జరుపుతున్న కౌన్సిలింగ్‌లూ, వారాంతపు కండీషన్లకు వ్యతిరేకంగా ధైర్యంగా మాట్లాడినందుకు ఫాసిస్టు పోలీసులు కుట్ర పన్ని, తన ఆటోలోనే ఎక్కి, కాళ్లు చేతులు విరిచి, క్రూరంగా హత్య చేసి యాక్సిడెంట్‌లో చనిపోయాడని అబద్ధపు ప్రచారం చేశారు.

పార్టీ పట్ల కా. యాదగిరి అంకిత భావాన్ని, పట్టుదలను ఆదర్శంగా స్వీకరించి, తన ఆశయ సాధనకై అంతిమ విజయం వరకు పోరాడుతామని శపథం చేస్తూ, కామ్రేడ్ యాదగిరికి అరుణారుణ జోహార్లర్పిద్దాం.

## కామ్రేడ్ కనకన్న

కరీంనగర్ జిల్లా, జూలపల్లి మండలం కాసాపూర్ గ్రామంలోని పేద కుటుంబంలో భార్య, నలుగురు పిల్లలతో జీవనం సాగిస్తున్న కామ్రేడ్ కనకన్న వృత్తి రీత్యా గీత కార్మికుడు. సుదీర్ఘకాలంగా రైతు కూలీ సంఘంలో పని చేస్తూ భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు, వెట్టిచాకిరీ, సాంఘిక బహిష్కరణలకు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటం సాగించాడు. పార్టీ చేపట్టిన కూలీరేట్ల పెంపుదల పోరాటంలో ప్రజలను సంఘటితపరిచి, భూస్వాముల మెడలు వంచి కూలీరేట్ల పెంపుదల సాధించి, పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని ఇనుమడింపజేశాడు.

తమకు వ్యతిరేకంగా ప్రజల్ని కూడగడుతున్నాడని భూస్వాములూ, పెత్తందారులు పోలీసులతో కుమ్మక్కై, చిత్ర హింసలు పెట్టి, వేధించినా, పార్టీని విడువక సానుభూతిపరునిగా కొనసాగుతూ, అనేక పార్టీ కార్యక్రమాలకు సహకారం అందించాడు. 1996-97 తీవ్ర నిర్బంధ కాలం నుండి సంఘాలు దెబ్బతిని భూస్వాములా, పెత్తందార్ల దోపిడీ, అణచివేతలు పెచ్చరిల్లడంతో, వాటికి వ్యతిరేకంగా ప్రజల్ని కూడగట్టి, పంచాయితీలలో ఎండగడుతూ నిలదీసేవాడు. తమ దోపిడీ, దౌర్జన్యాలకు ఆటంకంగా తయారైన కనకన్నను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని భూస్వాములూ, ప్రజా వ్యతిరేకులు పోలీసుల అండతో కుట్ర పన్నారు. 2004 వేసవి కాలంలో తాటిచెట్లు ఎక్కి ఇంటికి వెళుతున్న కనకన్నను ప్రజా వ్యతిరేకులైన మాజీ సర్పంచ్, అతడి అనుచరులు దారికాచి కొట్టి హత్య చేశారు. వ్యక్తిగత కక్షలతో కనకన్న హత్యకు గురయ్యాడని తప్పుడు ప్రచారం చేసి ప్రజల్ని నమ్మించడానికి వ్యర్థ ప్రయత్నాలు చేసారు.

భూస్వాముల, పెత్తందారుల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించి, చివరి శ్వాస వరకు ప్రజలపక్షాన నిలిచి అమరుడైన కామ్రేడ్ కనకన్నకు అరుణారుణ జోహార్లు.

## కామ్రేడ్ సుక్కి (బండి)




దండకారణ్య ఉద్యమంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ తోడ్క గ్రామానికి చెందిన కామ్రేడ్ సుక్కి పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించింది. పార్టీని తమ స్వంతం చేసుకున్న ఆదివాసుల సహజ శైలిలో చిన్నతనం నుండే పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామి అయింది. గ్రామ మిలీషియాలో చురుకుగా పనిచేస్తూ, అర్హతకు తగిన వయసు రాగానే, పూర్తి కాలం పని చేయడానికి సిద్ధమై 2005లో ప్లాటూన్‌లో సభ్యురాలైంది.

ప్లాటూన్‌లోని సమిష్టి పనుల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రాథమిక విద్యను త్వరలోనే పట్టుదలతో నేర్చుకుని, పార్టీ సాహిత్యాన్ని అధ్యయనం చేసేది. పార్టీ చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ (టి.సి.ఒ.సి)లలో పాల్గొంటూ, తన వంతు కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించింది. నిబద్ధతతో పనిచేసి పార్టీ సభ్యురాలైంది. అకస్మాత్తుగా దాడి చేసిన అనారోగ్యంతో, వైద్య చికిత్సకు పంపించే ఏర్పాటు చేసే క్రమంలోనే కా. సుక్కి తుది శ్వాస విడిచి అమరురాలైంది.

తమ కళ్లముందే అసువులు బాసిన కా. సుక్కి అమరత్వానికి ఉప్పొంగిన దుఃఖాన్ని దిగమింగుకుని సహచర కామ్రేడ్స్ ప్రజలతో కలిసి విప్లవ సాంప్రదాయం ప్రకారం ఘనంగా నివాళులర్పించారు. కామ్రేడ్ సుక్కి ఆశయ సాధనలో దృఢంగా ముందుకు సాగుతూ, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కొరకు తుదివరకు పోరాడుతామని శపథం చేస్తూ, అరుణాంజలి ఘటిద్దాం.

# ప్రజాయుద్ధ రంగంలో చిచ్చర పిడుగు కామ్రేడ్ సురేష్

కా. సురేష్ (బలగాని జానయ్య) గుంటూరు జిల్లాలో విప్లవానికి నెలవైన దాచేపల్లి ప్రాంతంలో మాచవరం మండలం రేగుల గడ్డ గ్రామంలో జన్మించాడు. పోరాటాల గడ్డ అయిన ఆ గ్రామంలో బాల్యం నుంచే విప్లవ పాఠాలు నేర్చుకున్న సురేష్ తాను కూడా విప్లవంలో భాగం కావాలనే ఆకాంక్షను పెంచుకున్నాడు. 1997లో దళ సభ్యుడిగా చేరి, రెండేళ్లపాటు దాచేపల్లి దళంలో బాలన్నగానూ, అనంతరం బొల్లాపల్లి దళంలో సుధాకర్ పేరుతోనూ పని చేశాడు.



పల్నాడు కేంద్రంగా భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు మిన్నంటుతూ జిల్లాలో పెరుగుతున్న ఉద్యమాన్ని దెబ్బతీయడానికి, బహుముఖ దాడి ఎత్తుగడలతో పార్టీని, పి.ఎల్.జి.ఎను నిర్మూలించే కార్యక్రమాన్ని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ క్రమంలో 2000 చివరలో జరిగిన జిల్లా పార్టీ కాన్ఫరెన్స్‌లో రాజ్య సాయుధ బలగాలపై దాడులు చేస్తూ, జిల్లా ఉద్యమాన్ని గెరిల్లా జోన్ స్థాయికి అభివృద్ధి చేయాలని నిర్ణయం జరిగింది. అప్పటి నుండి ఉద్యమంలో కా. సురేష్ పాత్ర పెరుగుతూ వచ్చింది. 2001 నాటికి ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగి బెల్లంకొండ స్పెషల్ గెరిల్లా దళం కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 2004 ప్రారంభంలో జిల్లా పార్టీ కమిటీలోకి రావడమే కాకుండా, జిల్లా ప్లాటూన్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ కాలంలో ప్రజాయుద్ధ అభివృద్ధి క్రమం తీసుకున్న మలుపులన్నింటిలో కా. సురేష్ పాత్ర కీలకమైనదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

కాలంతోపాటు వేగంగా పరుగెత్తగలిగే వడుపు, చురుకుదనం వున్న సాహసికుడు అయిన కా. సురేష్ పార్టీ రాజకీయ, సైనిక పంథాను ఆచరణలోకి తీసుకెళ్లడం కోసం పి.ఎల్.జి.ఎ జిల్లా మిలటరీ ఇన్‌చార్జీగా అత్యంత సాహసంగా ఈ ప్రజాయుద్ధానికి నాయకత్వం వహించాడు. మైదాన ప్రాంతంలోని అనుకూల పరిస్థితులను చాకచక్యంగా ఉపయోగించుకుంటూ తన పథకాలతో శత్రువుకు ఆందోళన కల్పించేవాడు. శత్రువుపై దాడి చేసే చొరవను గెరిల్లాలు ఎల్లప్పుడు తమ చేతిలో ఉంచుకోవాలనే మావోయిస్టు సూత్రాన్ని ఆచరణలోకి తీసుకెళ్లే క్రమంలో కొన్ని విలువైన అనుభవాలను అందించాడు.

తన ప్లాటూన్‌ను శత్రువు చుట్టుముట్టిన సమయంలో దూసుకొస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులను గురి చూసి దెబ్బకొట్టి, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని సభ్యులందరినీ ఫైర్ చేయిస్తూ, ప్లాటూన్ సురక్షితంగా తప్పుకునేట్లు ముందుకు నడిపించాడు. శత్రువుపై దాడి చేయడం ద్వారానే ఆత్మరక్షణ ఉంటుందనే కా. మావో సూత్రీకరణను గుర్తు చేస్తూ తోటి కామ్రేడ్స్‌తో శత్రు సాయుధ బలగాలపై దాడి చేయాలనే స్పృహను నిరంతరం కల్పించేవాడు.

నల్లమల గెరిల్లా జోన్‌లో పలు కీలకమైన మిలటరీ దాడులకు నాయకత్వం వహించాడు. శత్రువులను నిర్మూలించిన అనేక ఘటనల్లో చురుకైన పాత్ర పోషించాడు. రేమిడిచర్ల వద్ద జరిగిన రెండు ఆంబుష్‌లు, నరసరావుపేట ఎన్.సి.సి ఆయుధాగారంపై దాడి, అద్దంకి, చిలుకలూరి పేట, నందిగామ పోలీస్ స్టేషన్‌పై రెయిడ్లు, దుర్గి పోలీస్ స్టేషన్‌పై రాకెట్లతో దాడి, కారంపూడి ఎస్.ఐ నిమ్మకాయల కోటేశ్వర్ రావు, పిడుగురాళ్ల సి.ఐ బ్రహ్మయ్య యాక్షన్లలో కీలకమైన పాత్ర పోషించాడు. వీటిలో అనేక చర్యలకు స్వయంగా కమాండర్‌గా వ్యవహరించాడు. 2002లో ఎం.ఎల్.ఎ, కాంగ్రెస్ నాయకుడూ అయిన జంగా కృష్ణమూర్తి ఇంటిపై దాడి చేసి, గన్‌మెన్‌ల నుంచి రెండు స్టెన్ కార్బన్ తుపాకులు స్వాధీనం చేసుకున్న దాడిలో ప్రముఖ పాత్ర వహించాడు. రాష్ట్రంలోనే గొప్ప సంచలనం సృష్టించిన పిడుగురాళ్ల మండలం, మోర్జంపాడు, మాచవరం గ్రామాల్లోని భూస్వాములూ, పెత్తందారుల ఇండ్లపై చేసిన కరువు దాడిలో ప్రముఖ పాత్ర వహించాడు. ప్రజలకు పంపిణీ చేసిన ధాన్యాన్ని వారికి దక్కకుండా తిరిగి స్వాధీనం చేసుకోవడానికి వస్తున్న పోలీసులపై ఆంబుష్ చేసి, ప్రజలకు అందిన కరువు సహాయాన్ని చేజారి పోకుండా కాపాడాడు. జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో బతుకు దెరువుకు మోటారు వాహనాలు నడుపుకుని జీవనం సాగిస్తున్న పేద డ్రైవర్ల పాలిట బకాసురుడుగా తయారై పీడించి డబ్బు వసూలు చేస్తున్న రవాణా శాఖాధికారి (ఆర్.టి.ఓ) లంచగొండి అయిన జనార్దన్ శెట్టిని ప్రజల డిమాండ్ మేరకు దేహశుద్ధి చేసి, బుద్ధి చెప్పి పేద డ్రైవర్లకు కొండంత అండగా నిలిచాడు. ఈ సంఘటన పల్నాడు ప్రాంతంలోని వాహనాల డ్రైవర్లకు పార్టీ పట్ల గొప్ప విశ్వాసాన్ని పెంచింది.

2004 ఎన్నికల సందర్భంగా గ్రామాలపై, దళాలపై దాడులు చేయడానికి ప్రజలను మానవకవచంగా ఉపయోగించుకుంటూ బస్సులో వస్తున్న పోలీసులపై సమయస్ఫూర్తిగా ఆంబుష్ చేసి, ప్రజలకు నష్టం జరగకుండా శత్రువును గాయపర్చి, ఆయుధాల

స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొన్నాడు. ఆ తర్వాత బస్సులోని పోలీసులకు సహాయంగా వస్తున్న సి.ఆర్.పి.ఎఫ్ బలగాలపై అక్కడికి దగ్గర్లోనే మరొక ఆంబుష్ చేసి ఇద్దర్ని నిర్మూలించిన దళానికి నాయకత్వం వహించాడు. 2005లో చర్చల అనంతరం బొల్లాపల్లి మండలంలోని అనేక గ్రామాలలో ప్రజల్ని కదిలించి భూ పోరాటాలు నిర్వహించి 1500 ఎకరాల భూమిని ప్రజలకు పంపిణీ చేశాడు. పార్టీ పేరు చెప్పుకుని డబ్బు వసూలు చేస్తున్న అనేక మంది నకిలీలను శిక్షించి పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పాడు.

ఆలోచనను ఆచరణలో పెట్టడం, సృజనాత్మకంగా ఎత్తుగడలు పన్ని శత్రువును నిర్మూలించడంలో కా. సురేష్ ఎంతో తెలివిగా వ్యవహరించేవాడు. దుర్గి పోలీసు స్టేషన్‌పై రాకెట్లు ప్రయోగించి, అక్కడికి దగ్గర్లోని అడిగొప్పుల గ్రామం వద్ద మందుపాతరలు పెట్టి, పోలీసులను నిర్మూలించాలని చేసిన ప్రయత్నం సంచలనం సృష్టించింది. జిల్లా ఉద్యమంలో అంచెలంచెలుగా ఎదుగుతూ నాలుగేళ్లపాటు శత్రువుకు కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ప్రమాదకరమైన మావోయిస్టుగా యెంచిన శత్రువు కా. సురేష్ తలకు 12 లక్షల రివార్డు ప్రకటించాడు. అనారోగ్యం రీత్యా నల్గొండ జిల్లాలోని బంధువుల వద్దకు వెళ్లిన సురేష్‌ను పట్టుకుని ద్రోహి ఇచ్చిన సమాచారంతో 2006 జూన్ 18వ తేదీన హత్య చేసి, పి.ఎల్.జి.ఎ ఇన్‌ఛార్జ్ ఎన్‌కౌంటర్లో మరణించాడని శత్రువు ప్రకటించుకున్నాడు.

గెరిల్లా యుద్ధ వ్యతిరేక వ్యూహంలో ఆరితేరిన వాళ్లుగా విర్రవీగుతున్న ఆంధ్ర ప్రభుత్వ ఎస్.ఐ.బి, గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీసుల బహుముఖ దాడిని ఎదుర్కొంటూ, ఆంధ్రప్రదేశ్ మైదాన ప్రాంతాలలో రాజకీయ ప్రాధాన్యత వున్న గుంటూరు జిల్లాను గెరిల్లా జోన్‌గా మలచడంలో తనవంతు పాత్ర నిర్వహించిన కామ్రేడ్ సురేష్ అనుభవాల నుండి పి.ఎల్.జి.ఎ బలగాలు నేర్చుకోవాలి. అతని సాహసం, వేగం, తెలివితేటలు, శత్రు దాడుల మధ్య చెక్కుచెదరని నిబ్బరం, పట్టుదల నుండి విప్లవ స్ఫూర్తిని పొందుతూ, అతడి ఆశయసాధనకై ప్రజాయుద్ధాన్ని తుదకంటా కొనసాగించి, నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపిస్తామని ప్రతినబూనుదాం.

## కామ్రేడ్ పార్వతి (సీత)

కామ్రేడ్ పార్వతి మెదక్ జిల్లా చెట్ల తిమ్మాయిపల్లె గ్రామంలో దాదాపు 25 సంవత్సరాల క్రితం ఒక పేద కుటుంబంలో పుట్టింది. చిన్నప్పటి నుండి పశువులు కాస్తూ కుటుంబానికి అండగా వుండేది. కుటుంబంలో వుండే పేదరికం మూలంగా రెండో సంబంధం వానికి ఇచ్చి ఆమెకు పెళ్లి చేశారు. అది తెల్సుకున్న సీత, రెండవ భార్యగా వుండటానికి సిద్ధపడక విడిపోయింది. అందరి మహిళలలాగానే కా. సీత కూడా పితృస్వామ్య సమాజం తాలుకు బాధలను అనుభవించింది. ఈ పరిస్థితులలో స్వేచ్ఛని సమానత్వాన్ని కోరుకున్న కా. సీత విప్లవ జీవితాన్ని గడపడానికి సిద్ధపడింది. అప్పటికీ ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఇందూ ప్రియాల్ దళంతో ఆమె కుటుంబానికి సన్నిహిత సంబంధం వుండటంతో 2004లో దళంలో చేరింది. కొంతకాలం తరువాత ఎ.పి రాష్ట్ర కమిటీ ప్రొటెక్షన్ దళంలో పార్టీ సభ్యురాలుగా కొనసాగింది. బరువులెత్తుకొని కొండలు గుట్టలు ఎక్కుతూ గంటల తరబడి అలుపెరుగకుండా నడిచేది. ఎప్పుడు ఉత్సాహంగా వుండేది. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి వుండేది. తన ప్రధాన బాధ్యత అయిన నాయకత్వ రక్షణ విషయంలో ఎంతో జాగరూకతతో వుండేది. 2006 జూలై 13వ తేదిన ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల నక్కంటి గూడాల మధ్య సంకెలగుండం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా. సీత కూడా వుంది. కామ్రేడ్ సీత అమరత్వం పొందేదాక దళ సభ్యురాలుగా పార్టీ సభ్యురాలుగా తన విధులను నిర్వహించటంలో ముందు పీఠిన నిలిచి గెరిల్లా యోధులందరికీ ఆదర్శమైంది.

## కామ్రేడ్ మురళి (మల్లేశం, రత్నం)

కామ్రేడ్ మల్లేశం మెదక్ జిల్లా చేగుంట మండలం చెట్ల తిమ్మాయి పల్లె గ్రామంలో పేద కుటుంబంలో 29 సంవత్సరాల క్రితం పుట్టాడు. అతని తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి ఎంతో కష్టపడి 10వ తరగతి వరకు చదివించింది. 7వ తరగతి చదువుతూ బాలల సంఘంలో పని చేసేవాడు. అర్ధరాత్రి పోయి పోస్టర్లు అంటించేవాడు. వాల్ రైటింగ్ రాసేవాడు. ఆ క్రమంలో అరెస్టయి జైల్లో కూడా వున్నాడు. సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలను కూలదోసి నూతన ప్రజాస్వామిక సమాజం కోసం పెన్నుని గన్నుగా చేసి ఈ దోపిడీ సమాజంపై యుద్ధానికి సిద్ధమై పార్టీలోకి 1993లో పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు. ఇందూ ప్రియాల్ దళంలో దళ సభ్యునిగా పని చేశాడు. తరువాత నల్లమల స్పెషల్ దళంలో పని చేశాడు. తరువాత మెదక్ నర్సాపూర్ దళ కమాండర్‌గా, ఎస్.జి.ఎస్ కమాండర్‌గా ఎంతో బాధ్యతతో పని చేసాడు. పి.జి.ఎ వార్షికోత్సవం సందర్భంగా టాటా ఫ్యాక్టరీ పేల్చివేసిన దాడిలో కమాండర్‌గా వున్నాడు. ఎన్నో దాడులకు నాయకత్వం వహించేవాడు. 2001లో మెదక్ జిల్లా గిరాయిపల్లె ఏరియాలో కాన్ఫరెన్స్ జరుగుతున్న క్యాంపును పోలీసుమూకలు చుట్టుముడితే ఎంతో సాహసంతో శత్రువుని ముందుకు రానీయకుండా ఫైరింగ్ చేసి కామ్రేడ్స్

*(తరువాయి 21వ పేజీలో.....)*

*(.... 44వ పేజీ తరువాయి)*

తమకు వ్యతిరేకంగా పెరగబోయే ప్రమాదంగానే భావించారు. అందుకే పట్టుకుని పది రోజులు లాకప్‌లో పెట్టారు. అయినప్పటికీ పోలీసులు అతన్ని తమ దారికి తెచ్చుకోలేకపోయారు. విడుదలై వచ్చిన తర్వాత అతను యధావిధిగా తన కార్యకలాపాలను కొనసాగించాడు. అంతేకాదు జిల్లా రాడికల్ యువజన సంఘానికి కార్యవర్గ సభ్యుడయ్యాడు.

## విప్లవమే వృత్తిగా ఎంచుకొని......

రెండేళ్లు యువజన సంఘంలో పని చేసిన తర్వాత 1982లో పూర్తి కాలం కార్యకర్తగా హుస్నాబాద్ దళంలో చేరాడు. అప్పటికి పార్టీకి దళ నిర్మాణాల అనుభవం పెద్దగా లేదు. ఆయుధాలూ, స్వీయాత్మక శక్తులూ తక్కువే. ప్రజా పోరాటాల అనుభవాలూ అంతంత మాత్రమే. సైద్ధాంతిక స్థాయీ పరిమితమైనదే. అటువంటి పరిస్థితుల్లో పార్టీని ఈ అన్ని విషయాల్లో సుసంపన్నం చేయడం కోసం అవిశ్రాంత కృషి చేసిన కామ్రేడ్స్‌లో ప్రసాద్ ఒకరు.

ఒకరు ఇద్దరుగానే పల్లె పల్లె తిరుగుతూ, సమస్యలపై ప్రజల్ని కదిలిస్తూ సంఘ నిర్మాణాలను చేస్తూ పార్టీని విస్తృతం చేసిన ఆనాటి కృషిలో కామ్రేడ్ ప్రసాద్‌కు భాగస్వామ్యం వుంది. విషయాలను చురుగ్గా గ్రహించడంలో, గ్రహించిన దాన్ని ఆచరించడంలో ఉన్న సామర్థ్యాల రీత్యా కొద్ది కాలంలోనే కామ్రేడ్ ప్రసాద్ దళ కమాండరయ్యాడు.

అవి తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన రోజులు; బి.ఎస్.ఎఫ్ పద ఘట్టనల కింద తెలంగాణ పల్లెలు నలిగిన రోజులు; తెలంగాణ గడ్డపై నిత్యం విప్లవకారుల నెత్తురు ఏరులై పారిన రోజులు; తెలంగాణా తల్లుల కడుపులో నిత్యం బాయ్‌నెట్లు దిగబడిన రోజులు; రాబందులు పీక్కుతిన్న శవాల్లా పల్లెలన్నీ కకావికలమైన రోజులు.

పోలీసులు, బి.ఎస్.ఎఫ్ అండతో మళ్లీ భూస్వామ్యం పడగ విప్పిన రోజులు; పెత్తందారులు తల ఎగరేసిన రోజులు.

అటువంటి దుర్మార్గపు రోజుల్లో పార్టీని కాపాడుకోవడం, పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం, ప్రజల మద్దతును నిలుపుకోవడం సాధారణ విషయం కాదు. కామ్రేడ్ ప్రసాద్ హుస్నాబాద్ ఏరియాలో, నీళ్లల్లో చేపలా ప్రజల మధ్య తిరుగుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాడు. తమకు తారసపడ్డ ఎన్‌కౌంటర్లలో వీరోచితంగా పోరాడుతూ ప్రజలా, దళ సభ్యుల నైతిక స్థయిర్యాన్ని పెంపొందించాడు. ఆనాడు దళాలు ఆర్గనైజేషన్, మిలటరీ కర్తవ్యాలను రెండింటినీ నిర్వర్తించేవి. ప్రభుత్వ నిర్బంధాన్ని ఓడించాలంటే ఎటువంటి నిర్మాణాలు తీసుకోవాలని నిరంతరం ఆలోచించేవాడు. ఆ నిర్బంధం నడుమనే, సహచరుల అమరత్వపు నష్టాల నడుమనే ప్రజలను కలుస్తూ, వారిని సంఘటితపరుస్తూ, దెబ్బతిన్న నిర్మాణాలను పునర్నిర్మిస్తూ భూస్వామ్య, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలను చేపట్టాడు.

భూస్వామ్య శక్తులతో కుమ్మక్కయిన సి.పి.ఐ రివిజనిస్టులకూ బలమైన కేంద్రంగా ఉండేది ఈ ప్రాంతం. అలాగే విప్లవోద్యమాన్ని అణచివేయడానికి లొంగిపోయిన నక్సలైట్లతో ప్రభుత్వం 'ఫియర్ వికాస్' అనే గూండా ముఠాను మొదటిసారిగా ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసింది. ఈ పరిస్థితిలో రివిజనిస్టులకూ గూండా ముఠాలకూ వ్యతిరేకంగా పోరాడి ప్రజలను పార్టీ వైపుగా గెలుచుకోవడంలో కామ్రేడ్ ప్రసాద్ ప్రధానపాత్ర వహించాడు.

## అంచెలంచెలుగా బాధ్యతలను స్వీకరిస్తూ......

నిర్బంధం మధ్యనే ఉద్యమాన్ని అభివృద్ధి చేసిన కామ్రేడ్ ప్రసాద్ ప్రజల్లో, క్యాడర్‌లో ఎనలేని విశ్వాసాన్ని చూరగొంటూ అంచెలంచెలుగా నాయకుడిగా ఎదిగాడు. 1985లో అతను హుస్నాబాద్ దళ కమాండరయ్యాడు. 1985-87 మధ్య కాలంలో కేంద్ర ఆర్గనైజర్‌గా పని చేశాడు. 1988లో కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. జిల్లా కమిటీ సభ్యుడిగా వుంటూ హుస్నాబాద్, హుజురాబాద్ ఏరియాలకు బాధ్యత వహించాడు. తీవ్ర నిర్బంధంతో అతలాకుతలమైన ఉత్తర తెలంగాణా వ్యాప్తంగా క్రమంగా ప్రతిఘటన పెరిగి 1989 నాటికల్లా ఉద్యమం శక్తివంతంగా తయారయ్యింది. ఇదే సమయంలో కామ్రేడ్ ప్రసాద్ తాను బాధ్యత వహిస్తున్న రెండు ఏరియాల్లో ప్రతిఘటన పెంచి ఉద్యమం బలోపేతం అయ్యేలా కృషి చేసాడు.

తన అవిశ్రాంత కృషి, ఉద్యమాన్ని అభివృద్ధి చేయాలనే తపన అతన్ని క్రమంగా జిల్లా నాయకుడిగా ఎదిగించాయి. 1989లో జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతల్ని చేపట్టాడు. 1991లో రీజనల్ కమిటీ సభ్యుడయ్యాడు. 1994లో జరిగిన ఎ.పి రాష్ట్ర ప్లీనంలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1995లో జరిగిన ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ కాన్ఫరెన్స్‌లో జోనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయి, సెక్రటేరియట్ సభ్యుడయ్యాడు. 2000 ఏప్రిల్‌లో జోనల్ కమిటీ కార్యదర్శి అయ్యాడు. 2001లో జరిగిన కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2007 జనవరిలో జరిగిన 9వ ఐక్యతా కాంగ్రెస్‌లోనూ తిరిగి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

పెరుగుతున్న బాధ్యతలకు అనుగుణంగా తన రాజకీయ, సైద్ధాంతిక, మిలటరీ పర అవగాహనను పెంచుకుంటూ ఉద్యమానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాడు.

## ఆపత్కాలంలో ఉద్యమానికి చుక్కాని అవుతూ.....

ఇన్నేండ్ల ఉద్యమ చరిత్రలో నిర్బంధం నిప్పులు చిమ్ముతున్న ఈ క్రమమంతటా పలు ప్రాంతాల్లో, పలు సందర్భాల్లో ప్రజలు తమ నాయకత్వాన్ని కోల్పోతున్నారు. ఆనాడు ఉత్తర తెలంగాణలో ఈ పరిస్థితి మరీ ఎక్కువ. అందులో భాగంగా కరీంనగర్ జిల్లాలో ఎందరో నాయకులు అమరులయ్యారు. మాసాని రవీందర్, దగ్గు రాయలింగం, పులి రాములు వంటి జిల్లా నాయకులు అమరులై జిల్లా కమిటీ నాయకత్వంలో కొనసాగింపు అనేది లేకుండా పోయింది. అంతేగాక మరెందరో ఆర్గనైజర్లు కూడా అమరులయ్యారు. ఈ పరిణామాలకు ఏమాత్రం బెంబేలుపడని కామ్రేడ్ ప్రసాద్ అమరులు లేని లోటును నెరవేర్చడంలో భాగంగా వారి కర్తవ్యాన్ని భుజానేసుకొని నాయకత్వ బాధ్యతల్ని స్వీకరించాడు.

1999లో కొద్ది కాలంపాటు నిజామాబాద్ జిల్లాకు కూడా నాయకత్వం అందించాడు. ఆనాటికి నిజామాబాద్ జిల్లాలో కామ్రేడ్ మురళి నాయకత్వంలో ఉద్యమం విశేషంగా అభివృద్ధి చెందింది. ప్రజా పునాది విస్తృతంగా పెరిగింది. ప్రజల్లో రాజకీయ అధికార స్పృహ పెరిగింది. దానితో ప్రజా రాజకీయాధికార అంగాలు ఏర్పడ్డాయి. ఆ స్థితిలో ఉద్యమ నిర్మాణ బాధ్యతలను స్వీకరించిన కామ్రేడ్ ప్రసాద్ ఆ అధికార అంగాలను పటిష్టపరిచే కృషి చేస్తూనే వాటి అనుభవాలను విశ్లేషించి పార్టీకి అందించాడు.

1999 డిసెంబర్ 2వ తేదీన కేంద్ర కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలను ప్రభుత్వం పాశవికంగా హత్య చేసింది. యావత్ పార్టీ శ్రేణులను దుఃఖ సాగరంలో ముంచిన సంఘటనిది. కామ్రేడ్ మురళి ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీకి కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నాడు. కనుక ఆ ఉద్యమానికి తీవ్ర విఘాతం కలిగింది. ఆ స్థితిలో 2000 ఏప్రిల్‌లో కామ్రేడ్ ప్రసాద్ కార్యదర్శి బాధ్యతలను స్వీకరించి క్యాడర్‌లో, ప్రజల్లో ఉద్యమం పట్ల విశ్వాసాన్ని నిలిపాడు. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తీవ్రమైన కృషి చేసాడు.

2001లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయిన తర్వాత ఉద్యమావసరాలకు అనుగుణంగా మిలటరీ బాధ్యతలు తీసుకొని కేంద్ర మిలటరీ కమీషన్ సభ్యుడయ్యాడు. ఆ బాధ్యతల్ని స్వీకరించి మొదట ఎన్.టికి బాధ్యత వహించాడు. ఆ తర్వాత కొన్నాళ్లు ఎ.పికి, మరి కొన్నాళ్లు ఎ.ఒ.బికి బాధ్యత వహించాడు. మూడు జోన్లలోనూ నిర్బంధం తీవ్ర స్థాయిలో ఉన్న కాలంలో శత్రువును దెబ్బతీయడానికి తగిన మిలటరీ ఎత్తుగడలను రూపొందించడంలో తీవ్రమైన కృషి చేసాడు.

2001 తర్వాత కర్నాటక ఉద్యమంలో మితవాద అవగాహన చోటు చేసుకుంది. ఆ అవగాహనకు లోనైన కొంతమంది, పార్టీ విచ్ఛిన్నకర పద్ధతులకు పూనుకున్నారు. వీటన్నింటినీ చక్కదిద్ది పార్టీని ఏకతాటిపైకి తీసుకురావాల్సిన సమయంలో కర్నాటక కార్యదర్శిగా వుండిన కామ్రేడ్ సాకేత్‌రాజన్ అమరుడయ్యాడు. దాంతో అక్కడి ఉద్యమం మరింత క్లిష్ట పరిస్థితిలో పడింది. ఆ సమయంలో కేంద్ర కమిటీ, కామ్రేడ్ ప్రసాద్‌ను కర్నాటక కార్యదర్శిగా పంపింది. అప్పటిదాకా తనకు ప్రత్యక్షంగా ఏమాత్రం పరిచయం లేని ఉద్యమం, అందులోను సంక్లిష్ట స్థితిలో వున్న ఉద్యమం. అంతేగాక అప్పటిదాక ప్రసాద్‌కు ఎక్కువగా పరిచయం వున్నది గ్రామీణ ప్రాంత ఉద్యమమే. కర్నాటక ఉద్యమం ప్రధానంగా పట్టణ ఓరియంటేషన్ ఉన్న ఉద్యమం. ఈ అన్ని కారణాల రీత్యా అటువంటి ఉద్యమ బాధ్యతలను చేపట్టడం అనేది సాధారణ విషయం కాదు. దానికి ఎంతో ఆత్మవిశ్వాసం అవసరం. కేంద్ర కమిటీ సూచించిన ఆ బాధ్యతను కామ్రేడ్ ప్రసాద్ ఎటువంటి శషబిషలు లేకుండా స్వీకరించాడు. ఆ ఉద్యమంలోని చెడు ధోరణులను సరిదిద్దడానికి తీవ్రంగా కృషి చేసాడు. ఈ ఆంతరంగిక పోరాటంలో సాకేత్‌రాజన్ లేని లోటు తీరుస్తూ సరైన పంథాకు నాయకత్వం వహించి పార్టీని సరైన దిశలో నడిపించాడు. కర్నాటకలోని మల్నాడు అడవులు వ్యూహాత్మకంగా గెరిల్లా పోరాటానికి అనువైనవి. అందువల్ల అక్కడ గెరిల్లా దళాలు నిర్మించి విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని పార్టీ చేపట్టింది. ఆ లక్ష్య సాధనను కామ్రేడ్ ప్రసాద్ ఉత్సాహంగా స్వీకరించాడు.

అట్లా కామ్రేడ్ ప్రసాద్ ఉద్యమ జీవితాన్ని పరిశీలిస్తే ఉద్యమ అవసరాలకు అనుగుణంగా ఏ సమయంలో ఎటువంటి సవాల్‌నైనా స్వీకరించడం కనబడుతుంది. అతను ఉద్యమంలోకి అడుగుపెట్టినప్పటి నుండీ క్లిష్ట పరిస్థితుల్లో ఉద్యమాన్ని నిలబెట్టిన పునర్నిర్మించిన తీరు స్పష్టంగా అర్థం అవుతుంది.

## శత్రువు గుండెల్లో వణుకు పుట్టించిన యుద్ధ వీరుడు

నిత్య నిర్బంధంలో మనగలగాలంటే యుద్ధ నైపుణ్యం వంట పట్టించుకోవాల్సిందే. కామ్రేడ్ ప్రసాద్ అదే చేశాడు. అనేక ఎన్‌కౌంటర్లలో హోరా హోరీగా పోరాడుతూ బలగాలన్నింటినీ పోరాడేలా కమాండ్ చేస్తూ శత్రువుకు సింహస్వప్నమయ్యాడు.

ఒక సంఘటనలో హుస్నాబాద్ ప్రాంతంలో ఒక జాతరకు సెక్యూరిటీగా వచ్చిన పోలీసులపై దాడి చేసి తుపాకుల్ని స్వాధీనం చేసుకున్న సంఘటనకు నాయకత్వం వహించాడు. అంతేకాదు హుస్నాబాద్ ప్రాంతంలో కరడుగట్టిన భూస్వాములనూ, ఫియర్ వికాస్ గూండాలనూ, రివిజనిస్టు గూండాలను నిర్మూలించాడు.

1995 నాటికి ఎన్.టి ఉద్యమం గెరిల్లా జోన్ స్థాయికి చేరుకుంది. దాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కరకగూడెం, సిర్పూర్(యు) వంటి పెద్ద దాడులను చేయాలనే నిర్ణయం పార్టీ తీసుకుంది. అందులో భాగంగా సిర్పూర్ (యు) దాడికి అతను ప్రత్యక్షంగా నాయకత్వం వహించి దాడి విజయానికి తోడ్పడ్డాడు. పోత్కపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడిని కూడా దగ్గరుండి గైడ్ చేసి ఆ దాడి విజయంలో భాగస్వామి అయ్యాడు.



ఏరియాలో విచ్చలవిడిగా కూంబింగ్‌కు వస్తున్న పోలీసులపై 1992-94 మధ్యలో గాజులపల్లి, రుద్రారం వంటి పలు ఆంబుష్‌లకు నాయకత్వం వహించి ప్రజల్లో, క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపాడు.

విప్లవకారులను నేరుగా ఎదుర్కోలేని ప్రభుత్వం పార్టీ చరిత్రలో మొదటిసారి ఉత్తర తెలంగాణలో కోవర్టు ఎత్తుగడను ప్రయోగించింది. 1994 నాటికి దళ సభ్యుడిగా పని చేస్తున్న కత్తుల సమ్మయ్య అనే ద్రోహిని పోలీసులు లొంగదీసుకొని కోవర్టుగా మార్చారు. పోలీసుల ప్రలోభాలకు లొంగిపోయి కోవర్టుగా మారిన ఈ ద్రోహి 1994లో హుజురాబాద్ దళ కమాండర్‌గా పని చేస్తున్న కామ్రేడ్ భూపతినీ, అతని సహచరినీ మరో కామ్రేడ్‌ను నిద్రలో ఉన్నప్పుడు కాల్చి చంపాడు. ఆ సంఘటన ఆనాడు ప్రజలనూ, పార్టీ శ్రేణులను దిగ్భ్రాంతికి లోను చేసింది. పోలీసులు ఆ ఘటనతో తమకేం సంబంధం లేనట్టు విప్లవకారుల మధ్య వున్న అంతర్గత ఘర్షణలే ఆ ఘటనకు దారితీసాయని నమ్మబలికారు. కామ్రేడ్ ప్రసాద్ ఈ ఘటనను లోతుగా పరిశీలించి కత్తుల సమ్మయ్యకు సహాయపడిన సుమన్ అనే ద్రోహిని పట్టుకొని, ఆ ద్రోహి ద్వారానే ఈ కోవర్టు సంఘటనలో పోలీసుల పాత్ర గురించి పత్రికలకు చెప్పించాడు. అట్లా పోలీసులపట్ల ప్రజల్లో తీవ్ర అసహ్యాన్ని పెంచాడు.

2003లో ఎ.పిలో ఒక రాష్ట్ర వ్యాప్త మిలటరీ క్యాంపు నడుస్తున్న సందర్భంగా ఆ క్యాంపులోకి సానుభూతిపరుడి రూపంలో ఒక కోవర్టును పంపించి, క్యాంపులోని కామ్రేడ్స్ అందరినీ మూకుమ్మడిగా హత్య చేయాలని పోలీసులు పెద్ద ఎత్తున కుట్ర పన్నారు. ఆనాటికి సి.ఎం.సి సభ్యుడిగా ఎ.పికి బాధ్యత వహిస్తున్న కామ్రేడ్ ప్రసాద్ కూడా ఆ క్యాంపులో వున్నాడు. పోలీసుల ఈ కుట్రను గ్రహించి దాన్ని భగ్నం చేయడంలో భాగంగా కోవర్టును పట్టుకొని శిక్షించడంలోనూ కామ్రేడ్ ప్రసాద్ ముఖ్యమైన పాత్రను పోషించాడు.

తనలోని మిలటరీ శక్తిసామర్థ్యాల వల్లనే సి.ఎం.సి సభ్యుడయ్యాడు. ఆ బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో అతను మిలటరీ అధ్యయనాన్ని బాగా పెంచుకున్నాడు. మావో మిలటరీ రచనల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు.

కామ్రేడ్ ప్రసాద్‌లోని మిలటరీ శక్తి సమర్థతల వల్ల అతను శత్రువుకు కంటగింపయ్యాడు. ఎన్.టి ఉద్యమాన్ని అణచాలంటే ముందుగా ఇటువంటి నాయకత్వాన్ని దెబ్బ తీయాలని శత్రువు ఎంతగానో ప్రయత్నించాడు. అందులో భాగంగా అతనిపై పలుసార్లు దాడులకు పాల్పడ్డాడు. శత్రువును ఇంతగా హడలెత్తించగలిగిన కామ్రేడ్ ప్రసాద్ ఆ స్థాయికి ఎదిగిన తీరు మాత్రం ఆసక్తికరమైనది. మొదట్లో అతను మిలటరీకి తగినవాడు కాదనే అభిప్రాయమే వుండేది. 1996 వరకు ఇదే అభిప్రాయం కొనసాగింది. ఎందుకంటే అతన్ని అనారోగ్యం తీవ్రంగా వేధించేది. కమిటీ సమావేశాల్లో వరుసగా నాలుగైదు గంటలు కూర్చోవడం కూడా అతనికి దుర్భరంగా వుండేది. అందువల్ల ఎన్‌కౌంటర్లలో వీరోచితంగా పోరాడిన అనుభవం ఉన్నప్పటికీ 1996 దాకా అతను ఏ మిలటరీ క్యాంపులోనూ పాల్గొనలేదు. అయితే కా. ప్రసాద్‌కు మిలటరీ విభాగంపై ఉన్న ఆసక్తి వల్ల ఆ జీవితానికి అనుగుణంగా తనను తాను మలచుకోవడం కోసం తన ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంలో శ్రద్ధ పెట్టాడు. తన పట్టుదలతో అనతికాలంలోనే ఒక మంచి మిలటరీ కమాండర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఎప్పుడూ చురుగ్గా వ్యవహరించే తన తత్వం అతన్ని మరింత రాణింపచేసింది. ఆ చురుకుదనమే అనేక శత్రు దాడుల్లో అతన్ని మరణం నుంచి తప్పించింది. 1984లో విజయవాడలో జరిగిన అధ్యయన తరగతులకు ప్రసాద్ హాజరయ్యాడు. పోలీసులు క్లాసులు జరుగుతున్న ఇంటిపై దాడి చేసి అందరినీ అరెస్టు చేశారు. కానీ

ప్రసాద్ మాత్రం చాకచక్యంగా బాత్ రూంలోకి వెళ్లి, కిటికీలోంచి దూకి తప్పించుకున్నాడు. అటువంటి చురుకుదనం, చాకచక్యం అతనిలో నిరంతరం కనిపించేది. కామ్రేడ్ ప్రసాద్ జీవితాన్ని పరిశీలిస్తే, తాను వెనుకబడ్డ విషయాల్లో పట్టుదలగా, ప్రత్యేకంగా కృషి చేసి వాటిని అధిగమించడం అనేది కనబడుతుంది

## హుస్నాబాద్ స్థూప నిర్మాత

1990లో నిర్మించిన హుస్నాబాద్‌లోని అమరవీరుల స్థూపం చారిత్రాత్మకమైనది. ఆనాటికి ఆసియా ఖండంలో అది రెండవ ఎత్తయిన స్థూపం. విప్లవ ప్రజానీకానికి అది ఒక పర్యాటక కేంద్రంగా మారింది. 1996లో ప్రఖ్యాత రచయిత గూగీవాథియోంగి మన దేశానికి వచ్చినప్పుడు హుస్నాబాద్ స్థూపాన్ని చూసి ఉత్తేజితుడయ్యాడు. ఆ స్థూపాన్ని నిర్మించడం వెనుక కామ్రేడ్ ప్రసాద్ కృషి ప్రధానమైనది. దాన్ని ఎట్లా నిర్మించాలనే విషయంపై పలువురు ఇంజనీర్లనూ, మేస్త్రీలను సంప్రదించాడు. నిర్బంధాన్ని ధిక్కరించి స్థూప నిర్మాణంలో వేలాది ప్రజలు ఉత్సాహంగా పాల్గొనేలా కృషి చేశాడు.

విప్లవకారులను భౌతికంగా హత్య చేయడమేకాదు, వారి జ్ఞాపకాలను కూడా తుడిచేయాలని చూసే రాజ్యం హుస్నాబాద్ స్థూపాన్ని రెండుసార్లు కూల్చివేసి దాని పిరికితనాన్ని చాటుకుంది.

## ప్రజలకూ, క్యాడర్‌కు అభిమానపాత్రుడు

కామ్రేడ్ ప్రసాద్ ప్రజలతోనైనా, క్యాడర్‌తోనైనా చొరవగా కలిసిపోయేవాడు. తాను ఏ క్యాంపులో వున్నా క్యాంపంతా కలియతిరుగుతూ, ప్రతి ఒక్కరినీ పలుకరించేవాడు. క్యాడర్ బాగోగులను శ్రద్ధగా పట్టించుకునేవాడు. శ్రమలో పాల్గొనడంలో ముందుండేవాడు. క్యాంపులో తాను క్రమశిక్షణగా వుంటూ కామ్రేడ్స్ అందరితో క్రమశిక్షణను పాటింప చేసేవాడు. అట్లా క్యాడర్ అందరి అభిమానాన్ని చూరగొన్నాడు.

## నమ్మిన విషయాలపై నిలబడ్డంలో స్థిరత్వం

తాను నమ్మిన విషయాలపై ఎటువంటి గందరగోళమూ, ఊగిసలాటలేని స్థిరమైన అభిప్రాయాల్ని ఏర్పర్చుకునేవాడు. అటువంటి స్థిరత్వమే పార్టీ ఎదుర్కొన్న రెండు సంక్షోభ కాలాల్లో అతన్ని దృఢంగా నిలబెట్టింది. 1991లో సంక్షోభ ప్లీనంలో అతను పలు విషయాలపై చర్చిస్తుంటే నాయకత్వమే అతనిలోని స్థిరత్వాన్ని చూసి అబ్బురపోయింది. తాను అభిప్రాయపడిన పలు విషయాల్లో పార్టీలో అంతర్గత పోరాటం చేస్తూ కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి స్థిరంగా కట్టుబడి వుండేవాడు.

## ప్రజల హృదయాల్లో ముద్రించుకుపోయిన పోరు జంట

1989లో కామ్రేడ్ ప్రసాద్, పద్మలు జీవిత సహచరులయ్యారు. ఆ తర్వాత కాలంలో కామ్రేడ్ పద్మ కూడా గ్రామీణ ప్రాంత ఉద్యమ నిర్మాణంలో భాగమయింది. ఉద్యమాలను నిర్మించడంలో, శత్రువు దాడులను తిప్పికొట్టడంలో, శత్రువుపై దాడులు చేయడంలో చురుగ్గా వుండే పద్మ, ప్రసాద్‌కు సరైన జోడీ అయింది. వాళ్లిద్దరూ ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తిని పొందుతూ అరమరికలు లేని సహచరులయ్యారు. వాళ్లిద్దరి జంట కరీంనగర్ జిల్లాలో పోరాటాల వెల్లువను సృష్టించింది, ఉద్యమాభివృద్ధికి ఎంతగానో దోహదం చేసింది. అదే సమయంలో వాళ్లిద్దరూ ప్రజలకు ప్రీతిపాత్రులూ, పాలకులకు కంట్లో నలుసులూ అయ్యారు.

2002లో కామ్రేడ్ పద్మ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరురాలైంది. ఆమె వియోగం అతనికి భరింపరానిదే. కానీ విప్లవోద్యమం దాన్ని తట్టుకునే శక్తిని అతనికిచ్చింది. ఆ తర్వాత తనను కలిసిన వాళ్లెవరన్నా కామ్రేడ్ పద్మ గురించి చెప్పమని అడుగుతే ఎంతో ఉత్తేజకరంగా ఆమె గురించి చెప్పేవాడు. తన మాటల్లో ఆమె వీరత్వాన్ని ఎత్తిపట్టేవాడు. కొత్త వాళ్లతో కూడా ఆమె జ్ఞాపకాలను విపులంగా పంచుకునేవాడు. ఆమె అమరత్వాన్ని తలుచుకుని కుమిలిపోవడం కాకుండా, ఆమె జ్ఞాపకాలను నలుగురికీ చెప్పి ఉత్తేజపరుస్తూ, తానూ ఓదార్పును పొందేవాడు.

ఇట్లా అనేక ప్రత్యేకతలతో భారత విప్లవోద్యమ చరిత్రను ఉజ్వలవంతం చేసిన కామ్రేడ్ ప్రసాద్, 2007 జనవరిలో జరిగిన చారిత్రాత్మక 9వ ఐక్యతా కాంగ్రెస్‌లో పాల్గొని తన అభిప్రాయాలను చురుగ్గా చర్చించాడు. కాంగ్రెస్ చేపట్టిన నూతన కర్తవ్యాలను స్వీకరించి, ఆ కర్తవ్య నిర్వహణలో నిమగ్నమై వున్న కామ్రేడ్ ప్రసాద్‌ను పోలీసులు పట్టుకుని హత్య చేశారు.

## పోటెత్తిన జనవాహిని మధ్య అంత్యక్రియలు

కామ్రేడ్ ప్రసాద్ అంత్యక్రియలు ఆయన సొంత ఊరైన గూడెం గ్రామంలో 24వ తేదీన జరిగాయి. తమ ప్రియతమ నేతను చివరిసారిగా చూడ్డానికీ, అంత్యక్రియల్లో పాల్గొనడానికీ జిల్లా, రాష్ట్ర నలుమూలల నుండీ జనం వెల్లువెత్తారు. అంత్యక్రియలకు జనాన్ని రాకుండా చేయడం కోసం పోలీసులు అన్ని వాహనాలనూ ఆపేసారు. అయినప్పటికీ ప్రజలను రాకుండా నిరోధించలేకపోయారు. వెల్లువెత్తిన ప్రజలతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రసాద్ ఇంటి వద్ద పెద్ద ఎత్తున తొక్కిసలాట జరిగింది. నూతన సమాజ స్థాపన కోసం పాతికేళ్ల క్రితం ఇల్లు

వదిలి వెళ్లిన తమ ప్రియతమ నేత శవంగా తిరిగి రావడాన్ని ప్రజలు తట్టుకోలేక పోయారు. మృతదేహం గ్రామం చేరగానే పెద్ద పెట్టున రోధించారు. ఆ తర్వాత మృతదేహాన్ని ట్రాక్టర్‌పై వుంచి వీధులన్నీ ఊరేగిస్తూ, కా. ప్రసాద్ అమర్ రహే, అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. పోలీసులు ఇంటలిజెన్స్ వర్గాలు కెమెరాలతో చిత్రీకరిస్తున్నప్పటికీ ఎవరూ లెక్కచేయకుండా, పాలకవర్గాల పట్ల తమ ధిక్కారాన్ని ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలూ, ప్రజలూ, కామ్రేడ్ ప్రసాద్ తల్లీ, తండ్రీ, సోదరుడూ ప్రసాద్‌ది బూటకపు ఎన్‌కౌంటరని ముక్త కంఠంతో చెప్పారు.

వేలాది ప్రజల కన్నీటి నివాళుల మధ్య కా. ప్రసాద్ తండ్రి ఈ వీరయోధుడి చితికి నిప్పు పెట్టడంతో అంత్యక్రియలు ముగిసాయి.

ఉద్యమం ఒక కీలక సన్నివేశంలో వున్న నేటి స్థితిలో కామ్రేడ్ ప్రసాద్ వంటి నాయకుడిని కోల్పోవడం తీవ్రమైన నష్టాన్ని కల్గించే విషయం.

అయితే విప్లవకారుల మరణాలు విప్లవానికి తాత్కాలికంగా నష్టాన్ని కలిగించినా వారి ఆశయాలూ, లక్ష్యాలు విప్లవ విజయానికి ప్రేరణగానే నిలుస్తాయని చరిత్ర నిరూపిస్తూ వస్తుంది. అలాగే కామ్రేడ్ ప్రసాద్ ఆశయాలనూ, లక్ష్యాలను తలచుకొని అతని అమరత్వాన్ని ప్రేరణగా తీసుకొని విప్లవ విజయసాధనలో ముందుకు పోదాం. అదే కామ్రేడ్ ప్రసాద్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

★ ★ ★

---

*(....27 వ పేజీ తరువాయి)*

అమరుల వారోత్సవం సందర్భంగా ఇది సి.సి పిలుపు.

★ మన మహోపాధ్యాయులూ, ప్రియతమ నేతలూ కామ్రేడ్ సి.ఎం, కామ్రేడ్ కె.సిలు వర్థిల్లాలి.

మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ అమూల్యసేన్, సుశీతల్ రాయ్ చౌదరి, చంద్రశేఖర్‌దాస్, సరోజ్‌దత్తా, పంచాది కృష్ణమూర్తి, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, సుబ్బారావు పాణిగ్రాహి, బాబా భుజాసింగ్, అప్పూ, సుదీప్తో బెనర్జీ ఇంకా ఇతరులు వర్థిల్లాలి!

★ మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ డేవిడ్, భక్తిదా, జీవ్‌లాల్, దారా, బచ్చాన్, పనీల్, గోపాల్, దధీచి, సాగర్, కృష్ణ, సదన్, నవీన్, జఖీరియా వర్థిల్లాలి!

★ మన ప్రియతమ నేతలు కామ్రేడ్స్ పంచాది నిర్మల, స్నేహలత, పద్మ, లలిత, సుగుణ, చిట్టెక్క, భాగ్య, పార్వతి, హజీమా, కవిత, ప్రశాంతి, బక్కిదేవి, ఊర్మిళ, కరుణ ఇతరులు వర్థిల్లాలి!

★ ఎ.పి, బి.జె, డి.కె, ఛత్తీస్‌గఢ్, యు.పి, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, పంజాబ్, అస్సాం, త్రిపుర ఇంకా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా అమరులైన మన ప్రియతమ కామ్రేడ్స్ వర్థిల్లాలి!

★ అమరుల ఆదర్శాలను సమున్నతంగా నిలిపి, వారి ఆశయాలను పరిపూర్తి చేయడానికి కదం తొక్కుతూ ముందుకు పోదాం!

★ గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చి, దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని విస్తరింపజేయటమే మన ప్రియతమ అమరులకు మన మందించే నిజమైన నివాళి!

**పొలిట్ బ్యూరో**

**సి.పి.ఐ (మావోయిస్టు)**

మే 25, 2007

# ఉత్తర తెలంగాణా నుంచి పశ్చిమ కనుమలదాకా మోగిన రణ నినాదం కామ్రేడ్ రాజమౌళి (ప్రసాద్)

2007, జూన్ 22 - భారత విప్లవోద్యమ చరిత్ర ఒకానొక అగ్ని పరీక్షను ఎదుర్కొన్న రోజు. తన రథ సారధుల్లో ఒకరైన కామ్రేడ్ సందె రాజమౌళి (ప్రసాద్) లేకుండానే ఇక ముందు అది పురోగమించాల్సి వుందనే కఠిన వాస్తవాన్ని ఎదుర్కొన్న రోజు.

పురోగమిస్తున్న విప్లవోద్యమాన్ని రాజకీయంగా ఎదుర్కోలేని దోపిడీ పాలకవర్గాలు భౌతిక నిర్మూలన ద్వారా విప్లవోద్యమాన్ని అణచివేయ పూనుకున్నాయి. అందులో భాగంగానే పాలకవర్గాల కావలి కుక్కలైన ఎ.పి.ఎస్.ఐ.బి పోలీసులు జూన్ 21వ తేదీ మధ్యాహ్నం కేరళ రాష్ట్రంలోని కొల్లాంలో కామ్రేడ్ ప్రసాద్‌ను పట్టుకొని మర్నాడు సాయంత్రం దాకా చిత్రహింసలు పెట్టి 22వ తేదీ రాత్రి 9 గంటలకు అనంతపూర్ జిల్లా ధర్మవరం రైల్వే స్టేషన్ దగ్గర కాల్చి చంపి ఎప్పటి లాగానే పొసగని ఎన్‌కౌంటర్ కట్టు కథను అల్లారు.



అమరుడయ్యేనాటికి కామ్రేడ్ ప్రసాద్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు; కర్నాటక రాష్ట్ర కమిటీ కార్యదర్శి కూడా. సాధారణ దళ సభ్యుడి నుండి కేంద్ర కమిటీ సభ్యుడిదాకా సాగిన కామ్రేడ్ ప్రసాద్ విప్లవ పయణమంతా కత్తిమీద సాములాగే నడిచింది. అడుగడుగునా అగ్ని గుండాలను దాటుకుంటూనే నడిచింది. ఎందుకంటే దళ సభ్యుడి నుండి ప్రారంభించి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగేంత వరకూ అతను పని చేసింది ఉత్తర తెలంగాణా నిప్పుల కొలిమిలో.

### ఆడిపాడే వయసులోనే పోరు బావుటాను ఎత్తినవాడు

ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ జిల్లా, జగిత్యాల జైత్రయాత్రకు జన్మనిచ్చిన జిల్లా. అంతేకాదు ఆ జైత్రయాత్రను దేశం నలుమూలలకూ నడిపించడం కోసం ఎందరో వీరులను పోరుకు పయణం కట్టించిన జిల్లా. ఆ పోరును ముందుకు నడిపించడంలో భాగంగా కామ్రేడ్స్ శ్యాం, మురళి, బి.కె, మాధవ్, పద్మ వంటి వీరులను సగర్వంగా అర్పించిన జిల్లా. ఇటువంటి వీరోచిత చరిత్ర వున్న జిల్లాలోని పెద్దపల్లి మండలం గూడెం గ్రామంలో 42 సంవత్సరాల క్రితం ప్రసాద్ పుట్టాడు. పేద రైతు కుటుంబానికి చెందిన లక్ష్మి, రాజయ్యల పెద్ద కొడుకు కామ్రేడ్ సందె రాజమౌళి. అతనికి తోడుగా ఒక తమ్ముడూ, చెల్లీ పుట్టారు. అయితే చిన్నప్పుడే అతని చెల్లి చనిపోయింది.

కామ్రేడ్ ప్రసాద్ తండ్రి కొద్ది రోజులు సింగరేణిలో కార్మికుడిగా పని చేశాడు. కనుక ప్రసాద్ బాల్య దశలోని కొంత భాగం సింగరేణిలో గడిచింది. ఆ తర్వాత తండ్రి ఉద్యోగం వదిలేయడంతో వారి కుటుంబమంతా తమ పల్లెకు చేరుకుంది. ప్రసాద్ పదవ తరగతి దాకా పొత్కపల్లిలో చదువుకున్నాడు.

అతను చిన్నప్పటి నుండి మహా చురుకైనవాడు. అతని బాల్యం దాటీ దాటకముందే జగిత్యాల జైత్రయాత్ర మొదలైంది. పల్లెలన్నీ పోరుబడులైనాయి. ఫలితంగా కామ్రేడ్ ప్రసాద్ 1980లో రాడికల్ యువజన సంఘంలో చేరి పోరు పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టాడు. అప్పటికి అతనికి 15 ఏళ్ల వయస్సే. నిక్కరేసుకుని తన ఆర్గనైజర్ వెంట చురుగ్గా తిరుగుతూ అతనికి చేదోడు వాదోడుగా ఉండే ఈ చిన్న పిల్లవాడిని చూసి పలువురు కామ్రేడ్స్ ముచ్చట పడేవారు.

అయితే పోలీసులు మాత్రం చిన్న పిల్లవాడని ఎంతమాత్రమూ ఉపేక్షించలేదు. ఈ చిన్న పిల్లవాడిని రేపు

*(తరువాయి 39వ పేజీలో.....)*